విశిష్టాద్వైతవేదాన్తనేపథ్యమున

# పంచస్తవి

- ఒక పరిశీలన

డాక్టర్ కె. రాజగోపాలన్

శ్రీ సుందర పబ్లికేషన్స్
తిరుపతి

విశిష్టాద్వైతవేదాన్తనేపథ్యమున

# పంచస్తుతి

- ఒక పరిశీలన

**డాక్టర్ కె. రాజగోపాలన్,** M.A., Ph.D.,
రిసెర్చ్ అసిస్టెంట్
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం
తిరుపతి

**శ్రీ సుందర పబ్లికేషన్స్**
తిరుపతి

# A Study of Pañcastavi
with special reference to
# Viśiṣṭādvaita Philosophy


*by*

*Dr. K. Rajagopalan*

First Edition : 1999

Copies : 1000

© Copy rights reserved



***This book is published with the Financial Assistance of Tirumala Tirupati Devasthanams under their scheme Aid to Publish Religious Books***

*Copies can be had from :*
***Smt. K. Vasantha Lakshmi***
Sri Sundara Publications
7-6-231, Mitta Street
Tirupati - 517 501

Price : Rs. 150

*Printed at*
***M/s Annapurna Graphics***
53, (upstairs) R.S. Gardens
Tirupati - 517 507 ✆ : 30184



వేదాత్మకప్రణవకారణవర్ణవాచ్యం

తం త్వాం వయం తు పరమేశ్వరమామనామః ॥

- వై స్త. । ౨



యస్యాః కటాక్షవీక్షాక్షణలక్ష్యం లక్షితా మహేశా స్యుః।

శ్రీరంగరాజమహిషీ సా మామభివీక్షతాం లక్ష్మీః॥

- శ్రీ.స్త. 11.

*Prof. S.B. Raghunathacharya*
DIRECTOR GENERAL
**S.V. Institute of Higher Vedic Studies**
T.T. Devasthanams
Tirupati

# వరివస్య

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంస్కృత విభాగంలో శ్రీ రాజగోపాలన్ ఎమ్.ఏ. పట్టభద్రుడై పరిశోధన చేయాలనే సంకల్పంతో నాదగ్గరకు వచ్చాడు. ''దేనిపై పరిశోధన చేయాలని అనుకుంటున్నా''వన్నాను. ''స్తోత్రసాహిత్యంపైన చేయాలని ఉంది'' అన్నాడు. భగవద్రామానుజుల అంతరంగశిష్యులైన శ్రీకూరేశమిశ్రుల ''పంచస్తవి''పైన చేస్తే బాగుంటుందా ? అని అడిగాడు. ''విశిష్టాద్వైత వేదాన్తనేపథ్యమున పంచస్తవి - ఒక పరిశీలన'' అనే అంశం బాగుంటుందని సూచించాను. అలాగేనని శ్రద్ధతో నా మార్గదర్శనంలో నిర్విరామమైన కృషిచేసి ఈ శోధప్రబంధాన్ని తయారు చేశాడు. ఎంతో చక్కని అంశంపైన మరెంతో చక్కని పద్ధతిలో పరిశోధన జరగడం నాకెంత సంతోషాన్ని కలిగించిందో మాటలలో చెప్పలేను. డా. రాజగోపాలన్ కార్యదీక్షకు, పట్టుదలకు ఈ పరిశోధన చక్కని నిదర్శనంగా నిలిచిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

మహాకవిసార్వభౌములు శ్రీ కూరేశమిశ్రులు విశిష్టాద్వైత మతస్థాపనాచార్యులైన భగవద్రామానుజుల సమకాలికులు. వీరిని శ్రీవత్సాంకమిశ్రులని, కూరేశమిశ్రులని, కూరనాథులని పిలిచేవారు. భక్తి జ్ఞాన వైరాగ్యాల స్వరూపమే కూరేశమిశ్రులు. వీరు ప్రపన్నశిరోమణులు.

***సోఽయం రామానుజమునిరపి స్వీయముక్తిం కరస్థాం***
***యత్సంబంధాదమనుత కథం వర్ణ్యతే కూరనాథః ?***

శ్రీ రామానుజులు వీరి సంబంధంవల్ల తనకు ముక్తి సులభాతిసులభమని భావించారంటే వీరి ప్రపన్నతకు ఇంకే ఉదాహరణం కావాలి ? వీరు రచించిన 1. శ్రీవైకుంఠస్తవం 2. అతిమానుషస్తవం 3. సుందరబాహుస్తవం 4. వరదరాజస్తవం 5. శ్రీస్తవం అనే అయిదు స్తవాలకే పంచస్తవి అనిపేరు. శ్రీ వైష్ణవ సిద్ధాంతాలను విశిష్టాద్వైత తత్త్వాన్ని రంగరించి ఈ స్తోత్రాలలో నింపిన మహానుభావులు శ్రీవత్సాంకమిశ్రులు వారి కవిత

అనన్యసాధారణం. అద్వితీయం. ఆనందమందాకినీ ప్రవాహం. చూడండి-

**సుచారు చాపద్వయ విభ్రమం భ్రువోః**
**యుగం సునేత్రాహ్వ సహస్రపత్రయోః ।**
**ఉపాన్తగం వా మధుపావళీయుగం**
**విరాజతే సుందరబాహు సంశ్రయమ్ ॥**

ఈ సిద్ధాంతవ్యాసాన్ని డా. రాజగోపాలన్ అయిదు అధ్యాయాలుగా విభజించుకొని ప్రథమాధ్యాయంలో స్తోత్రసాహిత్యోత్పత్తి - వికాసాలను, పంచస్తవి క్రమాన్ని చక్కగా పరామర్శించాడు. ద్వితీయాధ్యాయంలో శ్రీ కూరేశమిశ్రుల జీవితవిశేషాలను, తృతీయాధ్యాయంలో విశిష్టాద్వైతసిద్ధాంతాన్ననుసరించి భగవంతుని కల్యాణగుణాలను, నవవిధసంబంధాన్ని, అర్థపంచకాన్ని, లక్ష్మీపురుషకారాన్ని, ఆచార్యానుగ్రహాన్ని చక్కగా విశదీకరించాడు. చతుర్థాధ్యాయంలో పంచస్తవిలోని కవితా సౌందర్యాన్ని సోదాహరణంగా నిరూపించాడు. పంచమాధ్యాయంలో ప్రతిపాదితాంశాల ఉపసంహారం చక్కగా చేయబడింది.

అందువల్లనే ఈ సిద్ధాంతవ్యాసం విశిష్టాద్వైతసిద్ధాంత స్వరూపాన్ని శ్రీకూరేశమిశ్రుల జీవితాన్ని వారి రచనలను, ప్రత్యేకంగా పంచస్తవీ వైశిష్ట్యాన్ని తెలిసికోవాలనే వారికి పెన్నిధిలాంటిది. ఇంత చక్కని పరిశోధన చేసిన డా. కె. రాజగోపాలన్‌ను మనసారా అభినందిస్తున్నాను.

ఇలాగే స్తోత్రవాఙ్మయంలో ఆణిముత్యాలలాంటి ఇతర స్తోత్రాలను కూడా నిశితమైన బుద్ధితో నిష్పక్షపాతంగా పరిశోధించి డా॥రాజగోపాలన్ కవి పండితుల అభినందనలకు పాత్రుడౌతాడని ఆశిస్తున్నాను.

***కూరేశమిశ్రరచితా విశిష్టాద్వైతదర్శినీ ।***
***ఇష్టాం పంచస్తవీ నిత్యం రాజగోపాలసంస్తుతా ॥***

తిరుపతి

౨-౨-౧౨౨౨ — **- రఘునాథాచార్య**

*Prof. M. Narasimhachary*
Professor & Head

Department of Vaishnavism
**University of Madras**
Chennai - 600 005

# FOREWORD

I have immense pleasure in writing this Foreword to the present publication of Sri K. Rajgopalan, "The Pañcastavi of Kūrattālavān with special reference to Viśiṣṭādvaita Philosophy", which earned for its authour the Degree of Doctor of Philosophy in Sanskrit from Sri Venkateswara University, Tirupati in the year 1996. Dr. Rajagopalan worked under the able guidance of the eminent sanskrit scholar, Prof. S.B. Raghunathacharya and thus the present study bears the stamp of authority and authenticity.

The Pañcastavi comprising five hymns entitled Śrīvaikuṇṭhastava, Atimānuṣastava, Sundarabāhustava, Varadarājastava and Śrīstava set in different metres, occupies an important place in the Śrīvaiṣṇava Religious Literature. Coming from the pen of Śrī Kūreśa, the foremost and trusted disciple of Śrī Rāmānuja, it has set the basic concepts of the Śrīvaiṣṇava Religion and Philosophy in a sweet and succinct poetic style. These hymns are known for their excellent poetic diction. The author of the present work, Dr. Rajagopalan has brought out the poetic merits of these hymns in terms of the sentiments delineated, styles adopted, Figures of Speech employed (both of sound and sense) and such related points in a highly commendable way in Chapter Four of this

work. Chapter Two explains the biographical details about Kūreśa and the like, which are quite informative and interesting. It may be stated in this context that the composition of the Śrībhāṣya by Śrī Rāmānuja was completed three-fourths before the persecution by the-then Chola King. For this, Kūreśa acted as the scribe. Rāmānuja left the Tamil country for Karnataka, due to the timely intervention of his dearest disciple Kūreśa. Kūreśa faced the wrath of the fanatic king who blinded him. Kūreśa survived the agony - both physical and mental, till the return of his great master from exile, after 14 long years. But since Kūrattālvān was blind, he could not be his scribe for the rest of the Śrībhāṣya. This task was undertaken by Viṣṇucitta (Eñgalālvān) who was a younger contemporary and disciple of Rāmānuja. Viṣṇucitta is the famous author of the commentary on the Viṣṇupurāṇa, which is known after him, as "Viṣṇucittīya".

The Pañcastavi is quite interesting in that it clothes philosophical ideas in a poetic language which of course, was the tradition set earlier by Yāmuna (Ālavandār) who composed the Catusślokī and the Stotraratna, two hymns on Goddess Lakshmi and Her Consort Nārāyaṇa, comprising the basic concepts of the Śrīvaiṣṇava Religion and Philosophy.

In the Atimānuṣastava, the author poses some interesting questions to the Lord Who incarnated Himself as Srirama and Srikrishna. One instance may be cited :

*pṛcchāmi kiñcana yadā kila rāghavatve*

*māyāmṛgasya vaśago manujatva maugdhyāt .*

*sītāviyogavivaśo na ca tadgatijñaḥ*

*prādās tadā paragatim hi katham khagāya ?* (II. 17)

Roughly translated, it runs as follows : "(O Lord!) I am curious to know one thing from you. When you incarnated yourself as Rāghava, you considered yourself to be an ordinary human being and accordingly, you were attracted by the deceitful deer. Consequently, you suffered pangs of separation from Sita and were ignorant of her location. If this be true, tell me : how could you then confer upon the vulture king Jaṭāyus the higher worlds?"

In the Rāmāyaṇa (III.iii.10) we have Srirama telling the dying Jaṭāyus :

*māyā tvam samanujñātah gaccha lokān anuttamān*

(You are permitted by me; O noble person! Go to the higher worlds.) "If Rama were an ordinary mortal, how could he grant this boon to Jaṭāyus?" This is the question of Kūreśa to the Lord. So, although the Lord tried His best to hide His Divine Nature in the Rāmāvatāra, He did not succeed in His efforts since He betrayed His divinity in a few instances as the one cited above.

This illustrates how keen a student of the Rāmāyaṇa Kūreśa was. Well, all such beauties of the Pañcastavi have been ably brought out by Dr. Rajagopalan in the present study. The study is complete with historical, religious, philosophical and poetic dimensions fully delineated by the learned author. The style of the language (Telugu) employed by him is simple and sweet, dignified and distinguished. I

congratulate the author for his excellent work. I would also urge him to prepare English/Sanskrit translations of the work so that the fruits of his labour would reach a wide network of Sanskrit lovers and scholars all over the world.

It is also my ardent hope that Dr. Rajagopalan would continue his post-Doctoral studies and bring out many useful works of this nature for the benefit of many scholars and students interested in this kind of literature.

Chennai
Sri Hayagriva Jayanti — **M. NARASIMHACHARY**
26-8-1999

# ప్రస్తావన

సమగ్ర సంస్కృత సాహిత్యమున స్తోత్రవాఙ్మయము అద్వితీయ స్థానము నాక్రమించినది. శ్రీ వైష్ణవధర్మమున స్తోత్రసాహిత్యమునకు గల స్థానము అన్యాదృశము. భగవద్రామానుజులకు అంతరంగశిష్యులు శ్రీ కూరేశమిశ్రులు. వారి రచనలలో పేరెన్నికగన్నది పంచస్తవి. సకల శాస్త్రనిష్ణాతులు అనితరసాధారణ ప్రతిభాసంపన్నులు అగు శ్రీ కూరేశమిశ్రుల ప్రతిభకు పంచస్తవి నికషోపలముగా నిలబడినది.

శ్రీ వైష్ణవసాహిత్యమున స్తోత్రవాఙ్మయమునకుగల విశిష్టస్థానము నుగ్గడించుచు విశిష్టాద్వైతసిద్ధాంతనేపథ్యమున శ్రీవత్సాంక మిశ్రుల పంచస్తవిని అనేక దృక్కోణములలో పరిశీలించుటయే ఈ పరిశోధనకు పరమోద్దేశ్యము.

ఈ లక్ష్యమును సాధించుటకు సిద్ధాంత వ్యాసమును అయిదు అధ్యాయములుగా విభజించుకొని దిగువ పేర్కొనినట్లు పరిశీలించుట జరిగినది.

**ప్రథమాధ్యాయమున** స్తోత్రసాహిత్యోత్పత్తి వికాసములు సమీక్షించబడి స్తోత్ర లక్షణ శబ్దార్థములు పేర్కొనబడి, స్తోత్రభేదములు విశదీకరింపబడినవి. శ్రీ వైష్ణవస్తోత్ర వైవిధ్యము నిరూపింపబడి శ్రీ వైకుంఠస్తవము అతిమానుషస్తవము సుందరబాహుస్తవము, వరదరాజస్తవము శ్రీస్తవమను పంచస్తవముల క్రమభేదము పరామర్శింపబడినది.

**ద్వితీయాధ్యాయమున** శ్రీ కూరేశమిశ్రుల బాల్య విద్యాభ్యాసాదులు, వివాహ తదీయారాధనాదులు, భగవద్రామానుజ శిష్యరికము

వివరింపబడినవి. కూరేశమిశ్రులకు పుత్రులు కలుగుట, శ్రీభాష్య లేఖనము, గురుప్రాణరక్షణము, పంచస్తవరచన, కాంచీపురాగమనము, పరమపదప్రాప్తి మొ॥ అంశములు విశదీకరింపబడినవి.

**తృతీయాధ్యాయమున** విశిష్టాద్వైతసిద్ధాంత స్వరూపము, అందలి ప్రధాన తత్త్వములు కర్మ జ్ఞాన భక్తిమార్గములు పేర్కొనబడినవి. శ్రీమన్నారాయణుని కళ్యాణగుణములు, నవవిధసంబంధములు, భగవంతుని పంచస్వరూపములు, అర్థపంచకము, ఆకారత్రయ సంపన్నత, లక్ష్మీపురుషకారము, ఆచార్యానుగ్రహము మొ॥ అంశములు విశదీకరింపబడినవి.

**చతుర్థాధ్యాయమున** పంచస్తవిలోని కవితా సౌందర్యము విస్తరముగా నిరూపింపబడినది. అందు గుణములు, వృత్తులు, రసములు, రీతులు, శబ్దాలంకారములు, అర్థాలంకారములు ఈ స్తవములయందు ఎట్లెట్లు కలవో ప్రతిపాదింపబడినవి. పంచస్తవిపై విశిష్టాద్వైతతత్త్వప్రభావము ఎంతవరకు కలదను అంశము ఇందు నిరూపింపబడినది.

**పంచమాధ్యాయమున** ఈ సిద్ధాంతవ్యాసమున నిరూపింపబడిన ప్రధానాంశములలోని సారాంశములు ఉపసంహార వ్యాజమున ప్రతిపాదింపబడినవి.

## కృతజ్ఞతాంజలి

లోకకళ్యాణకారకమైన శ్రీవైష్ణవసిద్ధాంతమునకు నిత్యనూతనాలంకారమువంటిది స్తోత్రసాహిత్యము. బాల్యము నుండియు శ్రీ వైష్ణవ స్తోత్ర వాఙ్మయమున నాకు మక్కువ ఎక్కువగా నుండెడిది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమున ఎం.ఎ. పట్టమునందిన తరువాత స్తోత్రవాఙ్మయమును పరిశీలించవలెనను నాలోని అభిలాషను

గ్రహించిన మా ఆచార్యవర్యులు, వివిధశాస్త్రనిష్ణాతులు ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారు శ్రీ కూరేశమిశ్రుల పంచస్తవిపై పరిశోధన సల్పిన బాగుండునని సూచించిరి. నా భాగ్య విశేషము వలన శ్రీ ఆచార్యులవారే నా పరిశోధనమునకు మార్గదర్శకత్వమున కంగీకరించిరి. శిష్యవాత్సల్య సంపన్నులైన వారి అమూల్య సమయమును నాకొసంగి తగిన సూచనలతో నా పరిశోధనమును సఫలము చేసిరి. ప్రస్తుతము ఈ గ్రంథమునకు '**వరివస్య**' రూపంలో అభిప్రాయమును వ్రాసి నన్ననుగ్రహించిన శిష్యవత్సలులు ఉత్తమ పరిపాలనాదక్షులు, ''ఆర్షవిజ్ఞాననిధి'' శ్రీ వేంకటేశ్వర ఉన్నత వేద అధ్యయన సంస్థ డైరెక్టర్ జనరల్ **ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్యుల** వారికి హార్దమగు కృతజ్ఞతా కుసుమాంజలులనందించుచున్నాను.

శ్రీ కూరేశమిశ్రుల సాహితీవైభవమును సమీక్షించుటలో అనేక సూచనల నొసంగి సాహాయ్యమొనర్చిన గురువర్యులు బహుభాషా సాహితీకోవిదులు విద్యావాచస్పతులు **ప్రొఫెసర్ ఎస్.సి.వి. నరసింహాచార్యుల** వారికి హృదయపూర్వక కృతజ్ఞతా మందారములను సమర్పించుచున్నాను.

ఈ ప్రబంధ ప్రచురణసమయంలో ప్రొఫెసర్ ఎమ్. నరసింహాచార్యుల వారిని ఈ గ్రంథముపై అభిప్రాయమును ఆశీస్సులను అందించమని కోరాను. అడిగిన వెంటనే నా పై వాత్సల్యంతో FORE-WORD రూపంలో వారి ఆశీస్సులను అందజేశారు. విద్వద్వరేణ్యులు **ప్రొఫెసర్ ఎమ్. నరసింహాచార్యులవారికి** కృతజ్ఞతా కుముదాంజలుల నందించుచున్నాను.

నా పరిశోధన సఫలమగుటకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంస్కృత విభాగమునందలి అధ్యాపకులందరు ప్రత్యక్షముగనో, పరోక్షముగనో నాకు సాహాయ్యమొనర్చిరి వారందరికీ నా కృతజ్ఞతలు.

గ్రంథ ప్రచురణకు ద్రవ్య సహాయమొనర్చిన తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

బాల్యమునుండి నా విద్యాభివృద్ధికి దోహదమొనర్చిన మా తల్లిదండ్రులకు, సోదర సోదరీమణులకు -

పరిశోధ ప్రబంధ వ్రాత ప్రతిని తీర్చిదిద్దుటయందు సహాయపడిన మిత్రులు శ్రీ ఎస్.బి.ఎస్. పాణి గారికి -

వ్రాత ప్రతిని సంవదించుటలో సహాయపడిన సోదరి సౌ॥రుక్మిణికణ్ణన్‌కి -

నా కృతజ్ఞతా సుమాంజలి.

తిరుపతి — విద్వజ్జన విధేయుడు

18-9-99 — **కె. రాజగోపాలన్**

# విషయానుక్రమణి


| | | |
|---|---|---|
| **1** | **ప్రథమాధ్యాయము** | **1-18** |
| 1.1 | సంస్కృతస్తోత్ర సాహిత్యము : ఉత్పత్తి వికాసములు | 1 |
| 1.1.1 | స్తోత్రలక్షణము | 5 |
| 1.1.2 | స్తోత్రశబ్దార్థము | 6 |
| 1.1.3 | స్తోత్రభేదములు | 6 |
| 1.2 | శ్రీవైష్ణవస్తోత్రసాహిత్యము | 9 |
| 1.2.1 | ఉత్పత్తి : వికాసములు | 9 |
| 1.2.2 | శ్రీవైష్ణవసంప్రదాయమున స్తోత్రముల స్థానము | 11 |
| 1.2.3 | శ్రీవైష్ణవస్తోత్రవైవిధ్యము | 13 |
| 1.3 | పంచస్తవి | 14 |
| 1.3.1 | శ్రీవైకుంఠస్తవము | 14 |
| 1.3.2 | అతిమానుషస్తవము | 14 |
| 1.3.3 | సుందరబాహుస్తవము | 15 |
| 1.3.4 | వరదరాజస్తవము | 15 |
| 1.3.5 | శ్రీస్తవము | 15 |
| 1.3.6 | స్తవక్రమ భేదము | 16 |
| | | |
| **2** | **ద్వితీయాధ్యాయము** | **19-48** |
| 2.1 | శ్రీకూరేశమిశ్రుల జీవితము రచనలు | 19 |
| 2.1.1 | బాల్యము | 20 |
| 2.1.2 | విద్యాభ్యాసము | 20 |
| 2.1.3 | కూరగ్రామాధిపత్యము | 21 |
| 2.1.4 | వివాహము | 21 |
| 2.1.5 | తదీయారాధనము | 22 |

| | | |
|---|---|---|
| 2.1.6 | మహావైరాగ్యకారణము | 23 |
| 2.1.7 | భగవద్రామానుజశిష్యరికము | 24 |
| 2.1.8 | త్రిదండయజ్ఞోపవీతములు | 25 |
| 2.1.9 | కార్యదీక్ష | 26 |
| 2.1.10 | కఠినపరీక్ష | 26 |
| 2.1.11 | పుత్రోదయము | 28 |
| 2.1.12 | అహంకారరాహిత్యము | 28 |
| 2.1.13 | శిష్యుడైనగురువు | 29 |
| 2.1.14 | ఏకసంధాగ్రాహి | 29 |
| 2.1.15 | శ్రీభాష్యలేఖనము | 30 |
| 2.1.16 | మహాపూర్ణానుగ్రహము | 32 |
| 2.1.17 | గురుప్రాణరక్షణము | 32 |
| 2.1.18 | పంచస్తవీ రచన | 35 |
| 2.1.19 | కాంచీపురాగమనము | 35 |
| 2.1.20 | పరమపదప్రాప్తి | 37 |
| 2.2 | కూరేశమిశ్రులపై భగవద్రామానుజ ప్రభావము | 38 |
| 2.2.1 | మిశ్రుల జీవితముపై రామానుజుల ప్రభావము | 39 |
| 2.2.2 | రచనలపై రామానుజ ప్రభావము | 40 |
| 2.3 | రచనలు | 41 |
| 2.3.1 | శ్రీవైకుంఠస్తవము | 41 |
| 2.3.2 | అతిమానుషస్తవము | 42 |
| 2.3.3 | సుందరబాహుస్తవము | 43 |
| 2.3.4. | వరదరాజస్తవము | 44 |
| 2.3.5 | శ్రీస్తవము | 46 |
| 2.3.6 | యమకరత్నాకరము | 47 |
| 2.3.7 | కూరేశవిజయము | 48 |
| 2.3.8 | ఇతరరచనలు | 48 |

| | | |
|---|---|---|
| **3** | **తృతీయాధ్యాయము** | **49-77** |
| 3.1 | విశిష్టాద్వైతసిద్ధాంతము | 50 |
| 3.1.1 | విశిష్టాద్వైతశబ్దార్థము | 51 |
| 3.1.2 | ఈశ్వరుడు | 52 |
| 3.1.3 | జీవుడు | 53 |
| 3.1.4 | ప్రకృతి | 54 |
| 3.1.5 | ప్రపంచసత్యత్వము | 55 |
| 3.1.6 | సంసారము | 56 |
| 3.1.7 | మోక్షము | 56 |
| 3.1.8 | మోక్షోపాయములు | 56 |
| 3.1.8.1 | కర్మమార్గము | 56 |
| 3.1.8.2 | జ్ఞానమార్గము | 57 |
| 3.1.8.3 | భక్తిమార్గము | 57 |
| 3.1.8.4 | శరణాగతి | 58 |
| 3.1.9 | శ్రీమన్నారాయణుడే సర్వేశ్వరుడు | 59 |
| 3.1.10 | కళ్యాణగుణములు | 60 |
| 3.1.11 | నవవిధసంబంధములు | 61 |
| 3.1.11.1 | పితాపుత్ర సంబంధము | 62 |
| 3.1.11.2 | రక్ష్య రక్షక సంబంధము | 63 |
| 3.1.11.3 | శేషశేషి సంబంధము | 63 |
| 3.1.11.4 | భర్తృ భార్యా సంబంధము | 64 |
| 3.1.11.5 | జ్ఞాతృజ్ఞేయ సంబంధము | 64 |
| 3.1.11.6 | స్వస్వామి సంబంధము | 64 |
| 3.1.11.7 | ఆధారాధేయ సంబంధము | 65 |
| 3.1.11.8 | శరీర శరీరి సంబంధము | 65 |
| 3.1.11.9 | భోక్తృ భోగ్య సంబంధము | 66 |
| 3.1.12 | తత్త్వమసి | 66 |

| | | |
|---|---|---|
| 3.1.13 | భగవంతుని పంచస్వరూపములు | 67 |
| 3.1.13.1 | పరస్వరూపము | 67 |
| 3.1.13.2 | వ్యూహస్వరూపము | 67 |
| 3.1.13.3 | విభవస్వరూపము | 68 |
| 3.1.13.4 | అంతర్యామిస్వరూపము | 68 |
| 3.1.13.5 | అర్చాస్వరూపము | 68 |
| 3.1.14 | భాగవతలక్షణము | 70 |
| 3.1.14.1 | అర్థపంచకము | 70 |
| 3.1.14.2 | పంచసంస్కారములు | 71 |
| 3.1.14.3 | ఆకారత్రయ సంపన్నత | 72 |
| 3.1.15 | లక్ష్మీ పురుషకారము | 73 |
| 3.1.16 | ఆచార్యానుగ్రహము | 76 |
| **4** | **చతుర్థాధ్యాయము** | **78-157** |
| 4.1 | శ్రీవైష్ణవ స్తోత్రములలో పంచస్తవి స్థానము | 78 |
| 4.2 | పంచస్తవి : కవితా సౌందర్యము | 79 |
| 4.2.1 | గుణములు | 80 |
| 4.2.1.1 | శ్లేష | 80 |
| 4.2.1.2 | ప్రసాదము | 81 |
| 4.2.1.3 | సమత | 81 |
| 4.2.1.4 | మాధుర్యము | 82 |
| 4.2.1.5 | సౌకుమార్యము | 82 |
| 4.2.1.6 | అర్థవ్యక్తి | 82 |
| 4.2.1.7 | కాంతి | 83 |
| 4.2.1.8 | ఔదార్యము | 83 |
| 4.2.1.9 | ఉదాత్తత | 84 |
| 4.2.1.10 | ఓజస్సు | 84 |

| | | |
|---|---|---|
| 4.2.1.11 | సుశబ్దత | 85 |
| 4.2.1.12 | ప్రేయము | 85 |
| 4.2.1.13 | ఊర్జితము | 86 |
| 4.2.1.14 | సమాధి | 86 |
| 4.2.1.15 | విస్తరము | 86 |
| 4.2.1.16 | సమ్మితత్వము | 87 |
| 4.2.1.17 | గాంభీర్యము | 87 |
| 4.2.1.18 | సంక్షేపము | 87 |
| 4.2.1.19 | సౌక్ష్మ్యము | 88 |
| 4.2.1.20 | ప్రౌఢి | 89 |
| 4.2.1.21 | ఉక్తి | 89 |
| 4.2.1.22 | రీతి | 89 |
| 4.2.1.23 | భావికము | 90 |
| 4.2.1.24 | గతి | 90 |
| 4.2.1.2 | వృత్తులు | 91 |
| 4.2.2.1 | కైశికి | 91 |
| 4.2.2.1.1 | శృంగారరసము | 91 |
| 4.2.2.2 | ఆరభటి | 92 |
| 4.2.2.2.1 | రౌద్రరసము | 93 |
| 4.2.2.3 | భారతి | 93 |
| 4.2.2.3.1 | హాస్యరసము | 93 |
| 4.2.2.3.2 | అద్భుతరసము | 94 |
| 4.2.2.3.3 | శాంతరసము | 95 |
| 4.2.2.4 | సాత్త్వతి | 95 |
| 4.2.2.4.1 | వీరరసము | 96 |
| 4.2.2.4.2 | భయానకరసము | 96 |
| 4.2.3 | రీతులు | 97 |

| | | |
|---|---|---|
| 4.2.3.1 | వైదర్భి | 97 |
| 4.2.3.2 | గౌడి | 98 |
| 4.2.3.3 | పాంచాలి | 98 |
| 4.2.4 | శయ్యా | 98 |
| 4.2.5 | శబ్దాలంకారములు | 99 |
| 4.2.5.1 | ఉపనాగరిక | 100 |
| 4.2.5.2 | ఛేకానుప్రాస | 100 |
| 4.2.5.3 | యమకాలంకారము | 100 |
| 4.2.5.4 | వృత్త్యనుప్రాసము | 101 |
| 4.2.6 | అర్థాలంకారములు | 101 |
| 4.2.6.1 | ఉపమాలంకారము | 101 |
| 4.2.6.2 | రూపకాలంకారము | 102 |
| 4.2.6.3 | ఉత్ప్రేక్షాలంకారము | 103 |
| 4.2.6.4 | అతిశయోక్త్యలంకారము | 104 |
| 4.2.6.5 | విభావనాలంకారము | 105 |
| 4.2.6.6 | విశేషోక్త్యలంకారము | 105 |
| 4.2.6.7 | తుల్యయోగితాలంకారము | 106 |
| 4.2.6.8 | ప్రతివస్తూపమాలంకారము | 107 |
| 4.2.6.9 | దృష్టాంతాలంకారము | 108 |
| 4.2.6.10 | వ్యతిరేకాలంకారము | 108 |
| 4.2.6.11 | వ్యాజస్తుతి | 109 |
| 4.2.6.12 | పర్యాయాలంకారము | 110 |
| 4.2.6.13 | అర్థాంతరన్యాసము | 111 |
| 4.2.6.14 | ఉదాత్తాలంకారము | 111 |
| 4.2.6.15 | ఆగమప్రమాణాలంకారము | 112 |
| 4.2.6.16 | అసమాలంకారము | 113 |
| 4.2.6.17 | విషమాలంకారము | 114 |

| | | |
|---|---|---|
| 4.2.6.18 | భావికాలంకారము | 114 |
| 4.2.6.19 | సందేహాలంకారము | 115 |
| 4.2.6.20 | విరోధాభాసము | 116 |
| 4.2.6.21 | ప్రతీపాలంకారము | 116 |
| 4.2.6.22 | విశేషాలంకారము | 117 |
| 4.2.6.23 | అధికాలంకారము | 118 |
| 4.2.6.24 | హేత్వలంకారము | 119 |
| 4.3 | పంచస్తవిపై విశిష్టాద్వైతతత్త్వప్రభావము | 120 |
| 4.3.1 | తత్త్వత్రయము | 120 |
| 4.3.1.1 | ఈశ్వరుడు | 120 |
| 4.3.1.2 | జీవుడు | 121 |
| 4.3.1.3 | ప్రకృతి | 122 |
| 4.3.2 | అర్థపంచకము | 123 |
| 4.3.3 | శ్రీమన్నారాయణుడే సర్వేశ్వరుడు | 124 |
| 4.3.4 | పరతత్త్వనిర్ణయము | 125 |
| 4.3.5 | మోక్షోపాయములు | 126 |
| 4.3.5.1 | భక్తియోగము | 126 |
| 4.3.5.2 | పరభక్తి పరజ్ఞాన పరమభక్తులు | 127 |
| 4.3.5.3 | ప్రపత్తి/ శరణాగతి | 128 |
| 4.3.6 | శ్రియఃపతిత్వము | 130 |
| 4.3.7 | కళ్యాణగుణములు | 130 |
| 4.3.7.1 | సౌశీల్యము | 131 |
| 4.3.7.2 | వాత్సల్యము | 131 |
| 4.3.7.3 | మృదుత్వము | 131 |
| 4.3.7.4 | సౌహార్దము | 131 |
| 4.3.7.5 | సౌమ్యము | 132 |
| 4.3.7.6 | ఆర్జవము | 132 |

| | | |
|---|---|---|
| 4.3.7.7 | ధైర్యము | 132 |
| 4.3.7.8 | స్థైర్యము | 132 |
| 4.3.7.9 | వీర్యము | 132 |
| 4.3.7.10 | శౌర్యము | 132 |
| 4.3.7.11 | కృతితా | 132 |
| 4.3.7.12 | గాంభీర్యము | 133 |
| 4.3.7.13 | చాతుర్యము | 133 |
| 4.3.7.14 | సౌందర్యము | 133 |
| 4.3.7.15 | సౌకుమార్యము | 133 |
| 4.3.7.16 | సమత | 133 |
| 4.3.7.17 | లావణ్యము | 133 |
| 4.3.8 | క్షాంతి | 134 |
| 4.3.9 | షాడ్గుణ్యపరిపూర్ణుడు | 135 |
| 4.3.9.1 | వీర్యగుణప్రభావము | 136 |
| 4.3.9.2 | దయాగుణప్రాధాన్యము | 137 |
| 4.3.10 | శేషశేషిభావము | 137 |
| 4.3.11 | అవతారప్రయోజనము | 138 |
| 4.3.12 | పరమాత్మ పంచస్వరూపములు | 139 |
| 4.3.13 | నిత్యోదిత శాంతోదిత దశలు | 141 |
| 4.3.13.1 | నిత్యోదితదశ | 141 |
| 4.3.13.2 | శాంతోదితదశ | 141 |
| 4.3.14 | మంత్రరత్నము | 142 |
| 4.3.14.1 | పూర్వభాగము | 142 |
| 4.3.14.1.1 | నారాయణ శబ్దార్థము | 144 |
| 4.3.14.2 | ఉత్తరభాగము | 145 |
| 4.3.15 | ఉభయవిభూతినాయకుడు | 145 |
| 4.3.16 | లక్ష్మీపురుషకారము | 146 |

| | | |
|---|---|---|
| 4.3.17 | ఊర్ధ్వపుండ్రములు | 147 |
| 4.3.18 | భాగవతాపచారము | 148 |
| 4.3.19 | ఆచార్యానుగ్రహము | 148 |
| 4.3.20 | సాత్త్వికపురాణ గ్రాహ్యత్వము | 149 |
| 4.4 | పంచస్తవిపై ఉపనిషత్తుల ప్రభావము | 150 |
| 4.4.1 | శ్రీవైకుంఠస్తవము | 150 |
| 4.4.2 | అతిమానుషస్తవము | 153 |
| 4.4.3 | సుందరబాహుస్తవము | 154 |
| 4.4.4 | వరదరాజస్తవము | 156 |
| 4.4.5 | శ్రీస్తవము | 157 |
| **5** | **పంచమాధ్యాయము** | **158-159** |
| 5.1 | ఉపసంహారము | 158 |
| | **ఉపయుక్త గ్రంథసూచి (BIBLIOGRAPHY)** | **160-172** |
| | 1. మూల గ్రంథములు (ORIGINAL BOOKS) | 160 |
| | 2. పరిశీలనలు (STUDIES) | 167 |
| | 3. పరిశోధన పత్రములు (RESEARCH PAPERS) | 171 |
| | 1. తెలుగు | 171 |
| | 2. ENGLISH | 172 |
| | **సంకేత పదసూచి** | **173** |

# విశిష్టాద్వైతవేదాన్తనేపథ్యమున

# పంచస్తవి

- ఒక పరిశీలన

## 1. ప్రథమాధ్యాయము

### 1.1. సంస్కృత స్తోత్ర సాహిత్యము - ఉత్పత్తి వికాసములు :-

వివిధ వాఙ్మయరంగమున మహోన్నతసింహాసనము నధిష్ఠించినది సంస్కృత వాఙ్మయము. సంస్కృతము అతిప్రాచీన భాష. కావుననే దీనిని ''సంస్కృతం నామ దైవీవాక్ అన్వాఖ్యాతా మహర్షిభిః''[1] అని దండ్యాచార్యుడు ప్రశంసించినాడు. అందునను దేవవాణియగు సంస్కృతభాషలో ఆవిష్కృతమైన ఋగ్వేదమును ప్రపంచమునందే ప్రథమరచనగా పేర్కొనవచ్చును.

ఆదిమానవుడు పరిసరములలో తనకు గోచరించుచున్న, తన జీవనమునకు ముఖ్యములైన ఎన్నో పదార్థములను జూచి వాని బాహ్యశక్తినే గాక అంతఃశక్తినికూడ గమనింపగల మేధాసమృద్ధిని పొందినాడు. ఆయా వస్తువులను దేవతా రూపములుగా భావించి

---

1 కావ్యా । 33

ఆరాధింపబూనినాడు. ఒక వస్తువుపై ఆరాధనా భావమేర్పడినప్పడు, శ్లాఘ్యగుణములు తోచినపుడు మాటలునేర్చిన మానవుడు దానిని గొప్పగా వర్ణించుటకు ప్రయత్నించును. ఈ విధముగా భావనాశక్తిని పెంపొందించుకొన్న తరువాత ప్రాచీనఋషులు ప్రకృతిలోనున్న వైవిధ్యమును, శక్తులను, దానిస్రష్టకున్న సర్వజ్ఞత్వ, సర్వశక్తత్వాది గుణములను ఆశ్చర్య పరీత మనస్కులై స్తుతించిరి. ఈ స్తోత్రములు వివిధ దేవతాస్తుతిపరములై లెక్కకు మిక్కిలిగా కనబడుచున్నవి. ఇందలి వర్ణనావైవిధ్యము మాటలకందనిది.[2]

భగవంతునకు నిశ్వాసరూపములైన వేదములను నిరంతర తపస్సమాధినిమగ్నులైన మహర్షులు దర్శనము చేసిరి. అందువలననే వారు మంత్రద్రష్టలైరి. వేదములు పురుషనిర్మితములు కావు గాన అపౌరుషేయములను ప్రసిద్ధికలిగినది.

ప్రపంచ వాఙ్మయమునందు ప్రథమముగా ఆవిర్భవించినది వేదవాఙ్మయమే. అందున ''ఋచస్సామాని జజ్ఞిరే''[3] అన్నట్లు ప్రథమముగా ఆవిర్భవించినది ఋగ్వేదము. ప్రపంచ పుస్తక భాండాగారమునందు ఋగ్వేదమును ప్రథమ పుస్తకముగా పేర్కొనవచ్చును. ఋగ్వేదము 'ఋక్' శబ్దఘటితమై వ్యవహరింపబడుచున్నది. ఇందాశ్చర్యకరమైన ముఖ్యాంశమేమనగా- ''ఋక్'' అను శబ్దమునకు 'ఋచస్తుతౌ'[4] అనునది మూలధాతువు ''సర్వం నామ చ ధాతుజమాహ వ్యాకరణే శకటస్య చ తోకమ్''[5] అన్న రీతిగ నామవాచకములన్నియు ధాతువులనుండి పుట్టినవే. కాగా, 'ఋచ్యతే

2. Jan Gonda. A History of Indian Literature, Vol. II. Fasc. 1. Medieval Religious literature in Sanskrit, p.51. Otto Harrassowitz wiesbaden, 1977.

3 పు.సూ 4

4 వై సి కౌ । 380

5 ని వి పు 32

స్తూయతే అనయా' - అనగా దీనిచే (మంత్రముచే) దేవతాదికము స్తుతింపబడుచున్నది అను అర్థమున ధాతువుపై 'క్విప్' ప్రత్యయము చేరగా 'ఋ' అను పదమేర్పడుచున్నది. 'ఋచ్యతే స్వయం దేవతాత్వాత్' ఋగ్వేదవేం దేవతాస్వరూపవైనది. కావున తానే స్తుతి పాత్రవంగుచున్నది.[6] కాన దానికి 'ఋక్' అని పేరు. (ధాతు ప్రత్యయములు పైన పేర్కొన్నవే) ప్రథమగ్రంథ వాచక ఋక్ శబ్దమునకు అర్థము స్తోత్రము. కాగా వాఙ్మయావతారమే స్తోత్రముతో ఆరంభమైనది.

స్తోత్ర వాఙ్మయమునకున్న ప్రాధాన్యమును, మహిమను దాని స్థానమును బోధించుటకు ఈ ఒక్క హేతువే చాలును. అది మొదలు క్రమముగా శాఖోపశాఖలుగా అన్ని మతములయందును స్తోత్ర వాఙ్మయము విస్తరిల్లినది. వాఙ్మయమునందు ఒక విశిష్టమైన స్థానమునాక్రమించుకొనినది స్తోత్ర వాఙ్మయము. కావ్యములనుగాని, తెలుగు పద్యములనుగాని, శ్లోకములనుగాని తెలియనివారుందురేమో గానీ కొన్నైనను ఇష్టదేవతా స్తుతిపరములైన శ్లోకములు తెలియనివారు, కంఠస్థముచేయనివారు లోకములో నుండరు. ద్వైత - అద్వైత- విశిష్టాద్వైత మతపరములైన స్తోత్రములు వందలకొలది యట్లుండగా, జైనబౌద్ధమతములకు సంబంధించిన స్తోత్రములను లెక్కించుట కష్టసాధ్యమే.

స్తోత్రవాఙ్మయమును పరిశీలించిన కర్మ - జ్ఞాన - భక్తి ప్రపత్తి మార్గములను సాధనములుగాగొని భగవత్ప్రాప్తికై వీటి రచన చేయబడినదని తెలియుచున్నది. శ్రీమద్భాగవతములో పేర్కొన్న నవవిధ భక్తులను అరసియనుష్ఠించుటలో స్తోత్రములు ప్రముఖపాత్ర

---

6. The earliest literary anticedent of Sanskrit devotional poetry and hymnology is to be found in the Rg-Veda. Which consists almost entirely of hymns of praise and prayer centering round some specific God or Gods.

A.S.L. p. 101

వహించును. కీర్తనభక్తిని స్తవమేయని పేర్కొనవచ్చును. స్తవమునకు వాగ్వ్యాపారమే ప్రధానము. భావుకుడైన భక్తుడు స్తోత్రమును పఠించుచు భగవద్గుణానుసంధానము చేయునపుడు మనస్సు భావావేశమునంది స్పందించును. ఆదేశానుగుణముగ ప్రదక్షిణ నమస్కారాదులను కూడా పారవశ్యమున చేయుచున్నాడు. అనగా వాగ్వ్యాపారము ప్రధానమైనను మనోవాక్కాయములనెడు త్రికరణములకు ఇందు వినియోగమున్నది.

ఈశావాస్యము, నారాయణ, కైవల్య మొదలగు ప్రముఖ ఉపనిషత్తులనుండి కొన్ని స్తోత్రములు సంగ్రహింపబడినవి. ఇతిహాస పురాణములనుండి ఎన్నియో స్తోత్రములు సంగ్రహింపబడి మానవ జీవనమున నిత్యదేవతారాధనలయందుపయోగపడుచున్నవి. వేదవ్యాసమహర్షి అష్టాదశపురాణములందును, భారతభాగవతాదులందును ఎన్నియో స్తోత్రములను నిక్షిప్తముగావించియున్నారు. భగవన్నామము, జపము, స్తోత్రాదులు నిరంతరము భగవత్స్మృతికి ప్రధానసాధనములు ''నామ వ్యాహరణం విష్ణోః యతస్తద్విషయా మతిః''[7] అని కదా భాగవతోపదేశము. మహాభారతమునందు భగవత్ప్రాప్తికనుకూలమగు, సాధనభూతములగు స్తోత్రములలో విష్ణుసహస్రనామస్తోత్రము ముఖ్యతమము. ఇంకను శివసహస్రనామస్తోత్రము, భీష్మరాజస్తవము, అర్జునకృతదుర్గాస్తుతి మొదలగు స్తోత్రములెన్నియో ఈ గ్రంథమున కలవు.

శ్రీమద్భాగవతాంతర్గతములగు స్తోత్రముల సంఖ్య అగణ్యము. అందలి భీష్మకృత శ్రీకృష్ణస్తుతి, నారాయణకవచము, ప్రహ్లాదకృత నృసింహస్తుతి, గజేంద్రకృత స్తుతి సుప్రసిద్ధములు. ఇవిగాక దశమస్కంధమునందంతర్నిగూఢములైన కొన్ని స్తోత్రములు స్తోత్రరూపముననున్న వేదాంతశాస్త్రమేయనవచ్చును. ఇవిగాక విష్ణు, బ్రహ్మాండ, మార్కండేయ, పాద్మ, స్కంద, బ్రహ్మవైవర్త, దేవీభాగవతాది

---

7 శ్రీ భాగ 6 2 10

పురాణములనుండి సుప్రసిద్ధ స్తోత్రములనెన్నింటినో సంగ్రహించి వాటిని దేవాలయములందు, గృహములలోను, దేవతారాధనలయందు ఉపయోగించుచున్నారు.

### 1.1.1. స్తోత్రలక్షణము :-

స్తోత్రములు అనేకవిధములుగానుండుటచేత సకల స్తోత్రములకు సమానమగు లక్షణమును నిర్దేశించుట సాధ్యముకాదు. కానీ మన పూర్వాచార్యులు కొందరు స్తోత్రలక్షణమును సాధించుటకు ప్రయత్నించిరి.

''అన్యత్ర అతద్గుణోక్తిః''[8] అన్నట్లు లేని గుణములను ఉన్నట్లు ఆరోపించి చెప్పటయు, ఉన్న గుణములను పరిపూర్ణముగా వర్ణించి చెప్పటయు స్తోత్రమనబడును. ''యతో వాచో నివర్తంతే''[9], ''అవిజ్ఞాతం విజానతాం''[10] అన్నట్లు విశ్లేషించిచెప్పటకు సాధ్యముకాని భగవద్గుణానుభవము స్తోత్రమనబడును. ఈ విషయమునే ప్రధానముగాగైకొని కూరేశులు స్తోత్రమును వర్ణించిన తీరు మిక్కిలి రమణీయము, కడుశ్లాఘ్యము. ''లేని గుణములను వర్ణించవలెనన్న నీయందు లేనిగుణములు లోకములో ఎక్కడను లేవు. ఉన్న గుణములను పూర్తిగా వర్ణించుటకు బ్రహ్మాదులకు కూడ శక్యముగాదు. కనుక నిన్ను స్తుతించుట అశక్యము''[11] అని భంగ్యంతరమున కూరేశులు చెప్పిన స్తోత్రలక్షణము ఎంతో ప్రశస్తము.

వ్యక్తీకరించుటకు సాధ్యము కాకపోయినను ''స్తవ్యః స్తవప్రియః''[12] అనుట చేత భగవంతునికి ప్రీతికరమైనందున భగవద్వ్యతికర శబ్దము లేనందువలన స్తోత్రమనవచ్చును.

---

8 శ్రీరంస్త 119

9 తై ఉ 2 4

10 కే ఉ 2 3

11 శ్రీ స్త 1

12 వి స స్తో 73

### 1.1.2. స్తోత్రశబ్దార్థము :-

స్తోత్రము అను శబ్దము ష్టుఞ్=స్తుతౌ అను ధాతువు నుండి నిష్పన్నమగుచున్నది. స్తవః, స్తోత్రం, స్తుతిః, నుతిః, అనునవి స్తోత్ర శబ్దమునకు పర్యాయపదములు.[13] ష్టు (ఞ్) ధాతువునకు 'అప్' అను ప్రత్యయము చేరగా 'స్తవః' అని, 'ష్ట్రన్' ప్రత్యయము చేరగా 'స్తోత్రమ్' అనియు, 'క్తిన్' ప్రత్యయము చేరగా 'స్తుతిః' అనియు శబ్దములు ఏర్పడుచున్నవి. అన్నింటికిని అర్థము సమానమే.

స్తోత్ర శబ్దమునకు 'స్తూయతే అనేనేతిస్తోత్రమ్' అను వ్యుత్పత్తిని చెప్పవచ్చును. అనగా దీనిచే భగవంతుడు స్తుతింపబడుచున్నాడు. కావున రచనా విశేషమునకు స్తోత్రమనిపేరు. ''గుణినిష్ఠగుణాభిధానం స్తోత్రమ్''[14] అని స్తోత్రశబ్దమునకు నిర్వచనము. అనగా అపారగుణ సాగరుడగు భగవంతుని గుణములలో కొన్నింటిని శక్తికొలది కీర్తించి పొగడుట స్తోత్రమనబడును. 'స్తవ్యః స్తవప్రియః స్తోత్రమ్, స్తుతఃస్తోతా'[15] అనుటవలన భగవంతుడు స్తోత్రప్రియుడు. కాని సామాన్యునకు భగవంతునకు ఒక భేదమున్నది భగవంతుడు స్తోత్రములను విని భక్తులను అనుగ్రహించును. సామాన్యుడు నిజమెరుగుట కూడా దుర్ఘటమే.

### 1.1.3. స్తోత్రభేదములు :-

స్తోత్రములు అనేక రీతులలో లభ్యమగుచున్నవి స్తోత్రమునకే విశిష్టాద్వైత పరిభాషలో శస్త్రము అని కూడా వ్యవహారము కలదు. ప్రగీత మంత్రసాధ్యమైనచో దానిని స్తోత్రమనియు, అప్రగీత మంత్ర సాధ్యమైనచో దానిని శస్త్రమనియు అందురు. గుణవంతుని యెడనున్న

---

13 స్తవః స్తోత్రమ్ స్తుతిర్నుతిః

అ కో ౹ ౹ ౧౬౮

14 వి కో పు ౨౭౦

15 వి స స్తో 73

గుణములు రెండుచోట్ల సమానమే అయినను సంగీత వైశిష్ట్యమున్న దానిని స్తోత్రమనియు, తద్రహిత సాధారణ మంత్రమును శస్త్రమనియు నిర్వచింతురు.

ప్రగీతమంత్రసాధ్యగుణినిష్ఠగుణాభిధానం గానవిశిష్టం మంత్రోచ్చారణం స్తోత్రమ్.[16] అప్రగీతమంత్రసాధ్యగుణినిష్ఠ గుణాభిధానం గానరహితం ఏకశ్రుతిరూపోచ్చారణమ్ శస్త్రమ్.[17]

మత్స్యపురాణమొకదృష్టితో స్తోత్రములను నాలుగు రీతులుగా విభజించినది.[18]

1. **ద్రవ్యస్తోత్రము :-** ద్రవ్యస్తోత్రమనగా యజ్ఞాద్యనుష్ఠానాదులందు భగవదారాధనార్థమై ఉపయుక్తములైన పవిత్రద్రవ్యములను స్తుతించుట.
2. **కర్మస్తోత్రము :-** కర్మ అనగ క్రియ. యాగాదిక్రియలయందు ఆరాధనాద్యనుష్ఠానములను పొగడెడి గ్రంథభాగమును కర్మస్తోత్రమందురు.
3. **విధిస్తోత్రము :-** ''ఇట్లు చేయవలెను,'' ''ఇది చేయవలెను''- అని బోధింపబడు విధులను (విధానములను) ప్రశంసించెడి గ్రంథభాగమును విధిస్తోత్రమందురు.
4. **అభిజన స్తోత్రము :-** అభిజనమనగా కులము లేదా వంశము వశిష్ఠ, విశ్వామిత్రాది వంశములను, నానావిధ రాజవంశములను వర్ణించెడి భాగమును అభిజన స్తోత్రమందురు. స్తోత్రముల విషయమున ఇతర ప్రబంధములందువలె సంస్కృతభాషలో గొప్ప వైశిష్ట్యమున్నది.

---

16 వి కో పు 290

17 అందులోనే పు 25।

18 ద్రవ్యస్తోత్రం కర్మస్తోత్రం విధిస్తోత్రం తథైవ చ।
తథైవాభిజనస్తోత్రం స్తోత్రమేతచ్చతుర్విధమ్॥
మ పు । 202

మతవైవిధ్యము, దృష్టినానాత్వము, శైలీసౌందర్యము, ఛందోవైచిత్రి, నానావిధ కావ్యధర్మ పరిష్కృతము, భక్తిభావనా ప్రాభవము మొదలగు ఎన్నోరీతుల వైలక్షణ్య విరాజితమైయుండుట సంస్కృత స్తోత్రములలోని గొప్పదనము. ఛందోబద్ధములైన స్తోత్రములే గాక దండకములు, గద్యములుకూడా స్తోత్ర వాఙ్మయమునకు వింతసొబగు నొడగూర్చుచున్నవి.

గోపికాగీతలు, ఉద్ధవగీతలు, భ్రమరగీతలు వంటి కోకొల్లలైన గీతలు పురాణములనుండి ఇతిహాసముల నుండి సేకరించి పదిలపరచబడినవి. పెక్కు భంగుల సహస్రనామములు ( విష్ణు, శివ, లలితా సహస్రనామములు) శతకములు, అష్టకాదిస్తవములు వగైరాలను లెక్కించుటే కష్టము. ఇవిగాక ఆయామతాచార్యులు, భక్తులు రచించిన స్తోత్రములు బహుసంఖ్యాకములు. మానవుడు మోక్షముపొందన భిలషించుటే గాక బ్రతికియున్నంతకాలము బాధలులేక జీవింపవలెనను అభిలాషయు సహజమే. అందుచేతనే మాంగల్యవివృద్ధి స్తోత్రము, అపామార్జన స్తోత్రము మొ॥ వాటియందు చెప్పిన తీరుగా సకలవ్యాధిపరిహారమును సర్వపీడానివారణమును కోరుచు చేయుస్తోత్రములు, సుప్రభాత స్తోత్రములు మొ॥ ఎన్నియోగలవు.

సద్గతి కోరుకొను ప్రతి వ్యక్తియును ఇష్టదేవతాస్తుతి చేయవలసినదే. ఆ స్తోత్రములు ఇన్ని విధములని నిష్కర్షించిచెప్పట దుర్ఘటమే. స్తుతించువాని మనోధర్మమును బట్టియు, అక్కరను బట్టియు, తన మతవైశిష్ట్యమును బట్టియు స్తోత్రములు పలుతీరులైయుండును. ఈ స్తోత్రములు అన్ని మతముల వారికిని, అన్ని తీరులవారికిని పరమోపాదేయములు బౌద్ధ, జైన మతాచార్యుల స్తోత్రములు ( ఉదా॥ భక్తామరస్తోత్రము) చాలా కాలమునుండియు ప్రచారములోనున్నవి.

శంకరభగవత్పాద కర్తృకములుగా కొన్ని రచనలు ప్రచారములో

నున్నవి. వాటిలో కొన్ని ఆదిశంకరుల రచనలు కావచ్చును, మఱికొన్ని ఇతరులచే రచింపబడి వారిపేరుతో ప్రచారములోనుండి యుండవచ్చును. నీలకంఠదీక్షితుల రచనలు సుప్రసిద్ధముగా నున్నవి.

**1.2. శ్రీవైష్ణవస్తోత్రసాహిత్యము :-**

స్తోత్రవాఙ్మయమున శ్రీవైష్ణవస్తోత్రములకు ప్రత్యేక స్థానముకలదు. శ్రీవైష్ణవ సంప్రదాయమున మోక్షమును సాధించుటకు ప్రపత్తికే ప్రముఖస్థానమివ్వబడినది. ప్రపత్తిమార్గము ఆధారముగాగొని భగవంతుని వాత్సల్యాది గుణములను అనుసంధానము చేయుచు భక్తితో భావావేశముతో పూర్వాచార్యులు అనేకస్తోత్రములను రచించియున్నారు. శ్రీవైష్ణవస్తోత్రఉత్పత్తి వికాసములను గూర్చి ఇంచుక పరిశీలింతము.

**1.2.1. ఉత్పత్తి - వికాసములు :-**

వైష్ణవ సంప్రదాయమున ముఖ్యముగా గమనింపవలసిన స్తోత్రమొకటి కలదు. ''జితంతే పుండరీకాక్ష నమస్తే విశ్వభావన!''[౨] అని ఆరంభమగు ఒక స్తుతికదంబమున్నది. దానిని జితంతే స్తోత్రమని వ్యవహరించుచున్నారు. ఇందు 'ప్రథమ జితంత' యని ఆరంభించి 'షష్ఠ జితంత' యని ఆరుభాగములు ఉపలబ్ధములు, ముద్రితములు. ఇవి శ్రీవైష్ణవభక్తకర్తృములు కావు. అపౌరుషేయములు. ఇవి ఋగ్వేదమునకు చెందినవి. ఈ స్తోత్రమును ఋగ్వేదఖిలమందురు. 'ఖిల' మనగా బాగుగా వాడుకలోలేక మరుగుపడినది అనగా ఈస్తోత్రము ఋగ్వేదమునకు చెందినదైనను కారణాంతరముల వలన వాడుకనుండి తప్పినది. కొందరు మహాత్ములు కనుగొని ఉద్ధరించి ఆ స్తోత్రములను వాడుకలోనికి తెచ్చిరి. దీనికున్న వైశిష్ట్యమసాధారణము.

నూటయెనిమిది దివ్యతిరుపతులని ప్రసిద్ధిపొందిన విష్ణు దివ్యస్థలములందు వెలసియున్న అర్చామూర్తుల స్తోత్రములు,

---

। ౨ జి స్తో ।

నూటయెనిమిది దివ్యతిరుపతులేగాక అంతగానే ప్రసిద్ధిగాంచిన దివ్యస్థలాంతరములందలి దేవతామూర్తుల స్తోత్రములు - ఇట్లిన్నోరీతుల వైష్ణవస్తోత్రసాహిత్యము వెల్లివిరిసినది. సుప్రభాత స్తోత్రములసంఖ్య పెద్దదగుటయేగాక విషయవైవిధ్యముతో అలరారుచు పారాయణ చేయదగినవెన్నో కలవు. ఇట్లిల్ల విరాడ్రూపమై వైష్ణవస్తోత్రములు విస్తరిల్లినవి. వీనిలో వైష్ణవ భాగవతుల (పరమాచార్యుల) స్తోత్రములకున్న వైశిష్ట్యము వర్ణింపనలవి గాదు.

వైష్ణవస్తోత్రములలో ప్రథమముగా పేర్కొనదగినది కులశేఖరదివ్యసూరిచే విరచితమైన ముకుందమాలాస్తోత్రము. తరువాత శ్రీయామునాచార్యుల స్తోత్రరత్నమునకు చాలా ప్రాముఖ్యము కలదు. శ్రీవిష్ణుపురాణమునకు పురాణరత్నమని ఖ్యాతియున్నట్లు, ఈ స్తోత్రమునకొక్కదానికే స్తోత్రరత్నమని అసాధారణ నామధేయముండుట పేర్కొనదగినది. యామునాచార్యులవారి చరిత్రనుబట్టి చూసినచో వీరు భగవద్రామానుజులకు పరమాచార్యులు, లేదా రామానుజులు వీరికి ఏకలవ్యశిష్యులు. స్తోత్రరత్నము తరువాత స్థానము నాక్రమించినది శ్రీకాంచీపూర్ణ విరచితమైన దేవరాజాష్టకము. అటుతరువాత మహామహిమోపేతములగు స్తోత్రములున్నను శ్రీవత్సాంకులవారి పంచస్తవములు పేర్కొనదగినవి. పిమ్మట వీరి పుత్రులును శ్రీరంగనాయకీ, శ్రీరంగనాథ ప్రసాదలబ్ధులై అవతరించిన శ్రీ పరాశర భట్టరువారి శ్రీరంగరాజస్తవరూపములగు రెండు శతకములకును, శ్రీగుణరత్నకోశమునకును ఉన్న స్థానము వైష్ణవలోకమున అత్యున్నతము. వీరు అత్యల్పజీవితకాలమునందే భగవద్గుణదర్పణమనెడు శ్రీవిష్ణుసహస్రనామభాష్యముతోబాటు ఎన్నోసంప్రదాయ గ్రంథములు, శాస్త్రగంథములను రచించి బహుళ ప్రశస్తి గాంచినవారు వైష్ణవ భాగవతులలో మహాప్రతిభావంతులుగా లెక్కింపబడు కొందరిలో వీరు ప్రముఖులు.

వైష్ణవస్తోత్రములసంఖ్యాకములుగా లభించుచున్నవి. అందు

ఏకశ్లోకి, ద్విశ్లోకి, చతుఃశ్లోకి, షట్కము, అష్టకము, షోడశి, వింశతిక, పంచాశత్, శతకము మొదలుకొని వేల పర్యంతము శ్లోకములుగల స్తోత్రములు వైష్ణవ సంప్రదాయమున ఎన్నోకలవు. దయాశతకము, లక్ష్మీ సహస్రము, పాదుకా సహస్రము మొ॥ బహుళ ప్రచారములో నున్నవి. ఇది సర్వజన విదితము.

మయూరుని సూర్యశతకమువలె, బాణుని చండీ శతకమువలె 'సుదర్శన శతకము' అను మహాప్రసిద్ధమైన స్తోత్రమొకటున్నది. ఈ సుదర్శన శతకము ఒక మహాపురుషుని రోగనిర్ముక్తుని చేయుటకుగాను ఒక సహృదయకవి వ్రాసి ఆయన వ్యాధిని నిర్మూలించెనట.

రంగేశ విజ్ఞప్తికరామయస్య
చకార చక్రేశ నుతిం నివృత్తయే ।
సమాశ్రయేఽహం వరపూణీం యః
తం కూరనారాయయణ నామకం మునిమ్ ॥[20]

శ్రీరంగమందలి స్వామి సన్నిధియందున్న ఒక భాగవతునకు (అరయర్) ఏదో వ్యాధి కలుగగా దానిని పరిహరించుటకై కోర్కెను ఈడేర్చ శ్రీసుదర్శన శతకమును శ్రీకూరనారాయణ జీయర్ అనువారు రచించిరి. పైశ్లోకము గ్రంథకర్తకు ప్రణామాంజలి ఘటించుచు రచింపబడినది.

### 1.2.2. శ్రీవైష్ణవ సంప్రదాయమున స్తోత్రముల స్థానము :-

శ్రీవైష్ణవసంప్రదాయమున స్తోత్రములు ప్రముఖస్థానము నాక్రమించినవి. శాస్త్రగ్రంథములలోనున్న సారాంశమును స్తుతికర్తలు తమస్తోత్రములయందు అంతర్నిగూఢము గావించి రచించిరి ఆళ్వారులుకూడా తమ దివ్యప్రబంధములను స్తోత్రరూపమున రచించిరి. నేటికిని కొన్ని దివ్యదేశములయందు దివ్యప్రబంధములు గానముచేయబడుచున్నవి. శ్రీవైష్ణవసంప్రదాయమున మోక్షప్రాప్తికి

---

౨౦ సు శ ప్రార్థన శ్లో ॥

ప్రపత్తియే ప్రధానసాధనము. భగవంతునిగూర్చి భగవత్ప్రాప్తికొరకు రచించిన ఈ స్తోత్రవములలో ప్రపత్తియే ప్రధాన విషయము. మితమతులైన సామాన్యమానవులకుకూడా శాస్త్రాభ్యాసావసరము లేకయే వాటిని అనుసంధించి భగవత్ప్రాప్తికనుకూలముగా పయనింప వీలు కల్పించునది వైష్ణవస్తోత్రసాహిత్యము. చరిత్రను పరిశీలించినచో మన పూర్వాచార్యులందురు అనేక స్తోత్రగ్రంథములు రచించిరని స్పష్టమగుచున్నది. వీటన్నిటినిబట్టి శ్రీవైష్ణవసంప్రదాయమున స్తోత్రములు ప్రముఖస్థానమునాక్రమించుకొనినవని ఘంటాపథముగా చెప్పవచ్చును.

భగవదనుగ్రహమును సంపాదింప శ్రీమన్నారాయణుని గుణగరిమను శ్లాఘింపవలయును, అందులకై స్తోత్రముల ఆవశ్యకత ఎంతైనను కలదు. ఈ దృక్పథముతో శ్రీవైష్ణవస్తోత్రసాహిత్యరచన సాగినది. ఈ విష్ణుపురాణ వచనమును అవధరింపుడు -

ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞైస్త్రేతాయాం ద్వాపరేఽర్చయన్।
యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్ ॥[2]

కృతయుగమున ధ్యానము (తపస్సు) చేయవలెను. త్రేతాయుగమున యజ్ఞమునసుష్ఠింపవలెను. ద్వాపరయుగమున ఆరాధన చేయవలెను. ఉత్తరోత్తరము కంటె పూర్వపూర్వము కష్టసాధ్యతరము. తపోయజ్ఞధ్యానాది కృత క్లేశములు లేకుండగనే కలియుగమందు నామసంకీర్తనము చేసిన చాలును. భక్తితోడ కేశవనామసంకీర్తనము చేయువానికి మోక్షము కరతలామలకము. అందువలననే ''కలిస్సాధుః'' అన్నమాట పుట్టినది.

కాగా కలియుగమున నామసంకీర్తన ప్రాముఖ్యము హెచ్చినది. అందువలననే వైష్ణవసంప్రదాయమున స్తోత్రములు మహోర్ఘసింహాసనము నధిష్ఠించినవి. విష్ణులీలలు, అవతారములు, కృత్యములు అసంఖ్యాకములగుటచేత వానిని వర్ణించెడి స్తోత్రముల సంఖ్యకూడా పెరిగినది.

---

2। వి పు 6 2 17

**1.2.3. శ్రీవైష్ణవస్తోత్రవైవిధ్యము :-**

అతివిస్తృత స్తోత్రవాఙ్మయమునందు శ్రీవైష్ణవ స్తోత్రములను పరిశీలించినచో ఆ సంప్రదాయానుసారముగా రచింపబడియుండుట గమనింపవచ్చును. శ్రీవైష్ణవులు మహావిష్ణువునే ప్రధానదైవముగా భావింతురు. దేవతాంతరస్తుతి ఈ స్తోత్రములందు కానరాదు. వైష్ణవులు పరబ్రహ్మను దివ్యసుందరమంగళవిగ్రహుడనియు, కళ్యాణ గుణాకరుడనియు వర్ణింతురు. అందులో కొన్నిగుణములు భగవంతుని ఆశ్రయించుటకు అనుకూలమగు సౌశీల్యసౌలభ్యాదులు. మరికొన్ని ఆశ్రయించిన వారికి సౌకర్యమును కలిగించునవి. శక్తిమత్వ జ్ఞానత్వాదులీకోవకు చెందినవి. ఈ సంప్రదాయము మిగత స్తోత్రములకన్న వైష్ణవ స్తోత్రములలో ప్రస్ఫుటముగ కన్పించును.

ముకుందమాలయందు కులశేఖరులు శ్రీవైష్ణవులకు వినయమతిప్రధానమని పేర్కొన్నారు. వినయమనగా తాను గొప్పవాడైనను అట్లు భావింపక తనను తాను చాలాచిన్నవానిగా తలచుకొని భక్తితో మెలగుటగాగమనింపదగును.

త్వద్భృత్యభృత్యపరిచారకభృత్యభృత్య
భృత్యస్య భృత్య ఇతి మాం స్మరలోక నాథ ॥[22]

వైష్ణవ స్తోత్రములలో శరణాగతి ప్రధానము. క్రింది శ్లోకములో యామునుల శరణాగతి -

న ధర్మనిష్ఠోఽస్మి న చాత్మవేదీ
న భక్తి మాం స్త్వచ్చరణార విందే।
అకించనోఽనన్యగతి శ్శరణ్య
త్వత్పాదమూలం శరణం ప్రపద్యే ॥[23]

---

22 ము.మా.27.

23 స్తో.ర 22

వైష్ణవస్తోత్రములలో భాగవతులు శ్రేష్ఠతములనియు, భగవంతునికన్నా భాగవతులకే ప్రాధాన్యము కలదనియు, వారిని పూజించుటయే ఆయనకు మిక్కిలి ఆనందసంధాయకమనియు, భాగవత నిష్ఠ (సేవ) పాటించినవాడే శ్రీవైష్ణవుడనియు పేర్కొనబడినది. శ్రీవైష్ణవసంప్రదాయవిషయసౌరభముతో ప్రకాశించు వైష్ణవ స్తోత్రములు స్తోత్రసాహిత్యమున ఒక విశిష్టస్థానమున వెలసియున్నవి.

**1.3. పంచస్తవి :-**

విశిష్టాద్వైతతత్త్వసౌరభమును వెదజల్లుచు స్తోత్రసాహిత్యమున ఒక ప్రత్యేకస్థానమున విరాజిల్లుచున్న 'పంచస్తవి'ని రచించినది శ్రీవత్సాంకమిశ్రులు. వీరు రామానుజుల శిష్యోత్తములు. పంచస్తవములు- 1. శ్రీవైకుంఠస్తవము 2. అతిమానుషస్తవము 3. సుందరబాహుస్తవము 4. వరదరాజస్తవము 5. శ్రీస్తవము.

**1.3.1. శ్రీవైకుంఠస్తవము :-**

భగవద్రామానుజులసన్నిధియందేయుండి వారినుండి నిఖిల వేదాంతతత్త్వములను అరసిన శ్రీవత్సచిహ్నమిశ్రులు పంచస్తవీ వ్యాజమున ప్రథమమున వైకుంఠస్తవమును రచించిరి. ఈ స్తవమునందు వైష్ణవులకు అవశ్యవిజ్ఞేయములైన అర్థపంచకమును వివరింపదలచి మొట్టమొదట వైకుంఠలోకమును అకుంఠవైభవుడైన వైకుంఠనాథుని స్వరూపరూపగుణములను వర్ణించిరి. ఈ విధముగా శ్రీమన్నారాయణుని పంచావతారములలో పరావతారమును స్తుతించిరి.

**1.3.2. అతిమానుషస్తవము :-**

వ్యూహావతారము పరమపదమువలె మానవదుర్లభమై వైకుంఠమువంటిదే గనుక వ్యూహనాథ స్తోత్రమునుపేక్షించి, సౌలభ్య సౌశీల్యాది గుణప్రకర్షప్రకటనకనుకూలమగు విభవావతార

మాహాత్మ్యమును వర్ణింపబూని ఆయా అవతారములందు విష్ణుమూర్తి ప్రదర్శించిన అతిమానుషాశ్చర్యకర చిత్ర వైచిత్ర్యములను వర్ణించుచు అతిమానుషస్తవమును రచించిరి.

### 1.3.3. సుందరబాహు స్తవము :-

శ్రీవైష్ణవులకు అత్యంత భక్తి శ్రద్ధలకు ఆలవాలమ్మైన అర్చావతార స్తోత్రము అవశ్యకర్తవ్యము. కనుక మిశ్రులు ఆశ్రితభక్తజనసర్వాభీష్ట ప్రదాత, వనగిరిమందిరవాసరసికుడైన సుందరబాహుస్వామిని స్తుతించుచూ సుందరబాహు స్తవమును రచించిరి.

### 1.3.4. వరదరాజస్తవము :-

అనంతరము కాంచీనివాసరసికుడైన వరదరాజస్వామిని స్తోత్రముగావించుచు వరదరాజస్తవమును రచించిరి. ఈ స్తవము అర్థగాంభీర్యమునకు మారుపేరుగా నున్నది.

### 1.3.5. శ్రీస్తవము :-

చివరగా పురుషకారస్వరూపిణి, జగన్మాతయగు శ్రీదేవిని ప్రసన్నురాలిని చేసుకొనుటకై శ్రీస్తవమును రచించిరి.

ఈ ఐదు స్తోత్రములందు ప్రతిపాదింపబడిన విషయములను పరిశీలించిన అందలి గొప్పతనము గోచరముకాగలదు. పంచస్తవిలో వైష్ణవసిద్ధాంత ప్రధానాంశములు ఎన్నో వివరింపబడియుండుట ముఖ్యముగ గమనింపవలెను. ఎన్నో ఉపనిషత్సారాంశములు, విశిష్టాద్వైతతత్త్వములుమాత్రమేగాక, కేవలము సాహిత్యదృష్టితో చూచినను అందలి కవితాశిల్పమత్యున్నతమ్మై సాహితీరసికులకుకూడ పరమతృప్తిని కలిగించును. కావ్యసౌందర్యరూపాంశము చతుర్థాధ్యాయమున వివరింపబడియున్నది.

**1.3.6. స్తవక్రమభేదము :-**

ప్రశస్తవములైన పంచస్తవములను 1 శ్రీవైకుంఠస్తవము 2. అతిమానుష స్తవము 3. సుందరబాహుస్తవము 4 వరదరాజస్తవము 5. శ్రీస్తవము అను క్రమములోనే శ్రీవత్సాంకులు రచించిరని తెలియుచున్నది. పంచస్తవములకు సంస్కృతవ్యాఖ్యాతయగు శ్రీనివాసాచార్యులుకూడా ఈ క్రమములోనే వ్యాఖ్యానించిరి. కూరేశమిశ్రులు పై క్రమములోనే స్తవరచన చేసిరనుటకు ప్రమాణము ఈ క్రింది విధముగా ఊహించవచ్చును.

కూరేశులు సకలవేదవేదాంతార్థములను యామునముని కులతిలకుడైన భగవద్రామానుజమునివరులనుండి గ్రహించిరి. ఆచార్య సంప్రదాయానుసరణము అవశ్యకర్తవ్యమని తలచిరి. కావుననే ప్రాచార్యులైన యామునాచార్యుల మార్గముననుసరించి స్తోత్రరచన సమాప్తిచేయసంకల్పించిరి. శ్రీయామునాచార్యులు -

> నమోఽచిన్త్యాద్భుతా క్లిష్ట జ్ఞాన వైరాగ్య రాశయే।
> నాథాయ మునయేఽగాధ భగవద్భక్తి సింధవే॥[24]

అని యాచార్యాభివందనముతో స్తోత్రమారంభించి

> అకృత్రిమ త్వచ్చరణారవింద ప్రేమప్రకర్షావధిమాత్మవంతమ్।
> పితామహం నాథమునిం విలోక్య ప్రసీద మద్వృత్త మచింతయిత్వా॥[25]

అనుచు, వలసినంత యోగ్యత నాయందు లేదు. కావున నా మీద నీ కనుగ్రహము కలుగ నవకాశము లేకున్నను "నాథో పజ్ఞం ప్రవృత్తమ్"[26] అన్నట్లు వైష్ణవ సంప్రదాయమునకే మూలపురుషులైన మా

24 స్తో ర ।
25 అందులోనే 65
26 త ము క - అ స । 30

పితామహులగు శ్రీనాథమునుల ముఖమునుజూచి వారి మనుమడు గదా! యని నాపై దయజూపుము'' అనుచు స్తోత్రరత్నమును పూర్తిచేసి, జగజ్జననియగు లక్ష్మీదేవి స్తుతిరూపమగు ''చతుశ్శ్లోకి''ని రచించినారు.

అట్టి ప్రాచార్యుల పద్ధతిననుసరించి -

యోఽనిత్య మచ్యుత పదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయమేనే।
అస్మద్గురోర్భగవతోఽస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే॥[27]

అనుచు స్వాచార్య ప్రతిపత్తిని చాటిచెప్పి వైకుంఠస్తవ, అతిమానుషస్తవ, సుందరబాహుస్తవ, వరదరాజస్తవములనెడి ప్రబంధచతుష్టయిని సమాప్తము గావించిరి. గురుపరాధీన వృత్తులు కూరేశులు యామునాచార్యులవలెనే నైచ్యానుసంధానముచేయుచు, అంతకంటే గొప్పగ ఆచార్యపరంపరానుసంధానము చేసి, ''అట్టి ఉత్తమాచార్యుల శ్రీపాదసంబంధియై దాసుడనైనాను నేను. వరదరాజప్రభూ! ఆ సంబంధము పురస్కరించుకొని నాపై కటాక్షము ప్రసరింపజేయుము'' అని ప్రార్థించిరి. ఈ శ్లోకమిట అనుసంధేయము -

రామానుజాంఘ్రి శరణోఽస్మి కులప్రదీప
స్త్వాసీత్సయామునమునే స్స చ నాథవంశ్యః।
వంశ్యః పరాంకుశమునే స్స చసోఽపి దేవ్యా
దాస స్తవేతి వరదాఽస్మి తవేక్షణీయః॥[28]

యామునాచార్యుల వారికంటెను వీరి యాచార్యప్రతిపత్తి కడు శ్లాఘ్యముగానున్నది. పైశ్లోకములో తెల్పినవిధముగా తన వంశమునకు సాక్షాత్తూ శ్రీదేవితోడ సంబంధము కలుపుకొనినారు శ్రీవత్సాంకులు.

27 వైస్త ।

28 వస ।02

తరువాత పురుషకారస్వరూపిణియగు శ్రీదేవిని ప్రసన్నురాలిని చేసుకొనుటకు పదునొకండు శ్లోకములతో స్తుతించి శ్రీస్తవమును రచించిరి.

ఇక్కడ ఒక వింతసంఘటన. శ్రీయామునాచార్యులు 65 శ్లోకముల స్తోత్రమును పూర్తిచేసి నాలుగే శ్లోకములతో (చతుఃశ్లోకి) లక్ష్మీస్తుతి చేసిరి. శ్రీకూరేశులుకూడ 328 శ్లోకవములుగల శ్లోక చతుష్టయిని వ్రాసి చివరగా పదునొకండు శ్లోకములతో శ్రీస్తవమును రచించిరని చెప్పవచ్చును.

కొందరు శ్రీస్తవమే ప్రథమకృతియని మరికొందరు సుందర బాహుస్తవమే మొదటికృతియని చెప్పదురు. కాని ఆధారములను పరిశీలింప వైకుంఠస్తవ, అతిమానుషస్తవ, సుందరబాహుస్తవ, వరదరాజస్తవ, శ్రీస్తవములను కూరేశులు క్రమముగా రచియించిరని పేర్కొనవచ్చును.

* * *

# 2. ద్వితీయాధ్యాయము

## 2.1 శ్రీకూరేశమిశ్రుల జీవితము : రచనలు

శ్రీవిశిష్టాద్వైత మతప్రవర్తకులు ఆసేతుశీతాచలము లక్షాధిక శిష్యబృందముగల భగవద్రామానుజాచార్యుల ఆంతరంగికశిష్యులలో సర్వప్రథములు శ్రీకూరేశమిశ్రులు. భక్తి, జ్ఞాన, వైరాగ్యముల పరాకాష్టనధిరోహించిన ప్రపన్నశిరోమణులగు కూరేశుల జీవితమును సమగ్రముగ సమీక్షించుట ఎవరికిని శక్యము కాదు.

అర్వాంచో యత్పద సరసిజ ద్వంద్వమాశ్రిత్య పూర్వే
మూర్ధ్నా యస్యాన్వయ ముపగతాః దేశికా ముక్తిమాపుః।
సోఽయం రామానుజమునిరపి స్వీయముక్తిం కరస్థాం
యత్సంబంధా దమనుత కథం వర్ణ్యతే కూరనాథః॥[1]

ఇట్లు సాక్షాత్తు శ్రీరామానుజులే శ్రీవత్సాంకుల సంబంధముచేత తనకు ముక్తి తప్పక లభించునని భావించిరి. అందువలన ఈ మహనీయుని జీవితమెంత మహత్తరమైనదో మనమూహింప వచ్చును.

''శ్రియఃపతి వైభవమునైనను వర్ణింపవచ్చును గాని

---

1 కూ వై. పు 57

భగవద్రామానుజుల వైభవమును వర్ణింపలేమ''[2]ని రామానుజుల మహిమను దాశరథి, గోవింద (ఎంబార్) మొదలగు వారు పేర్కొనిరి. ''రామానుజాచార్యుల వారి మహిమనభివర్ణించుట కెవరో ఒక్కరు సమర్థులుండవచ్చును కాని కూరేశమిశ్రుల మాహాత్మ్యమును ఊహించుటకు కూడ ఎవరికిని శక్తిలేద''[3]ని పూర్వాచార్యులందరూ పేర్కొనిరి.

## 2.1.1 బాల్యము

కాంచీపురమునకు సమీపమున 'కూర' మను గ్రామము గలదు. ఆ గ్రామమున క్రీ.శ.1008వ సంవత్సరమున 'పుష్య' మాసమున 'హస్తా' నక్షత్రమున శ్రీమదనంత భట్టార్యునకు కుమారులుగా శ్రీవత్సాంకులు జన్మించిరి. కూరగ్రామాధిపతియగు అనంత భట్టారకులు ఐశ్వర్యవంతులే గాక సదాచార సంపన్నులు కూడా. దయాశీలురైన వీరు శ్రీరామభక్తులు. ఇటువంటి మహనీయునికి భగవదవతారముగా భావించెడు శ్రీవత్సాంకులు కుమారులుగా జన్మించుట అందరికు ఆనందహేతువయ్యెను. వీరికే శ్రీకూరేశమిశ్రులనియు కూరత్తాళ్వాన్ అనియు ప్రసిద్ధమగు వ్యవహారనామములు కలవు. 'కూర' గ్రామాధిపత్యముచే కూరేశులను ప్రసిద్ధి కలిగినది.

## 2.1.2 విద్యాభ్యాసము :-

'పూవు పుట్టగనే పరిమళించును' అన్న సామెత ననుసరించి కూరేశులు బాల్యమునుండియే విద్యయందు బృహస్పతిగా వెలుగొందుచుండెను. కవికుల గురువగు కాళిదాసు ''ఆజన్మ

2 శ్రియ: పత్యుర్వైభవమపి వర్ణయితుం ప్రభూయతే న తు లక్ష్మణ మునీన్ద్రాణామ్
శ్రీ.మ. పు 2

3 రామానుజార్యాణాం మహిమానం అభివర్ణయితుం కశ్చిత్ప్రభవేదపి. కూరనాథానాం మాహాత్మ్య ముద్భావయితుం న కశ్చిదీశిత
అందులోనే పు 2

శుద్ధానాం''[4] అని పేర్కొన్నట్లు కూరేశులయందు ఆజన్మ శుద్ధియను గుణము పుష్కలముగా నున్నది. దినదినప్రవర్ధమానుడగుచున్న ఆ బాలునకు వారి తండ్రి సకాలములో అక్షరాభ్యాసము గావించి క్రమముగా సకలశాస్త్రములను బోధించెను. అత్యంత శ్రద్ధాసక్తులతో సకల విద్యలను నేర్చుకున్న కూరేశులు యుక్త వయస్సు వచ్చునప్పటికి వేదవేదాంతాది శాస్త్రములందు అసమానప్రతిభతో మహావిద్వాంసులుగా ప్రసిద్ధినందినారు. మహాసముద్రమువంటి వ్యాకరణశాస్త్రమును ఆపోశనము పట్టిన మహామహులు వీరు. ''నడయాడు పతంజలి'' అని వీరిని అందరూ కీర్తించుచుందురు. మహాప్రజ్ఞాశాలియగు వీరు మూర్తీభవించిన పతంజలి మహాభాష్యముగా సమకాలికులచే ప్రస్తుతింపబడెడివారు.

### 2.1.3 కూర గ్రామాధిపత్యము :-

అనంతభట్టారకులు కూరగ్రామాధిపత్యమును యుక్త-వయస్సులో నున్న శ్రీవత్సాంకుల కప్పగించిరి. శ్రీవత్సాంకులు తన తండ్రివలె అగ్రహారములోని వ్యవహారములను సమర్థతతో నిర్వహించుచు గ్రామస్థుల యంతఃకలహములను, వివాదములను చక్కగా పరిష్కరించుచు కూర గ్రామమును పాలించుచుండిరి.

### 2.1.4 వివాహము :-

కూరేశమిశ్రులు తమ తండ్రి ద్వారా సంక్రమించిన గ్రామాధిపత్యమును ధర్మబద్ధముగ నిర్వహించుచుండిరి. ఒకనాటి రాత్రి కూరేశులు తమ విధి నిర్వహణలో భాగముగా మారువేషమున నగరమున సంచరించుచుండగా ఒక బ్రాహ్మణకుటుంబము మరణించుటకు సిద్ధపడిన సంఘటన వారి కంట పడినది తమ కుమార్తెను ఎవ్వరైనను వివాహము చేసికొన్నచో ఆమె జాతకములోని

---

4 రఘు । 5

దోషము వలన వరుడు వెంటనే మరణించును. కనుక తమ కూతురిని వివాహము చేసికొను వారెవరును దొరకరని దుఃఖించి వారందరూ మరణించుటకు సిద్ధపడిరి. ఈ విషయమును తెలిసికొన్న మిశ్రులు మరుసటి దినము వారిని రాజసభకు పిలిపించి రాత్రి మీ గృహమునందు జరిగిన వృత్తాంతమును చెప్పమనిరి. ఆ దంపతులు జరిగిన విషయమును రాజునకు విన్నవించిరి. ప్రజల కష్టములను తీర్చుటే ప్రభువుల ధర్మము కనుక నీ కుమార్తెను నేను వివాహమాడెదననిరి. వారు, ''అటుల జరిగిన చక్రవర్తులకు మరణము సంభవించును గదా!'' అని సంశయించుచుండిరి. వారి సంశయమును తెలిసికొనిన కూరేశమిశ్రులు ''వధువు వద్ద అల్పానందమునపేక్షించిన గదా ! మాకటువంటి దోషము కలుగును; మాకు దానియందు కొంచెము కూడా ఆసక్తి లేదు'' అనిరి.

''వివాహమునకు 1. ధర్మానుష్ఠానము 2. సంతానము అను రెండు ఫలములు గలవు. కేవలము ధర్మానుష్ఠానమునకు తప్ప సంతానార్థినై ఈ వివాహమునకు సమ్మతించుటలేదు'', అని చెప్పి ఆ కన్యను మిశ్రులు వివాహము చేసికొనిరి. ఆండాళ్ అను పేరు గల ఆ సాధ్వీమణి భర్తృ నియమమునకు భంగమువాటిల్లకుండా నడచుకొనుచూ జ్ఞాన భక్తి వైరాగ్యములతో భర్తపై అనురాగముతో సహధర్మచారిణియై వారికి సపర్యలు గావించుచుండెను.

### 2.1.5 తదీయారాధనము :-

కూర గ్రామము నందు వీరి రాజ ప్రాసాదము దేవేంద్ర భవనము నతిశయించి యుండెను. వీరి భవన మహాద్వారపు తలుపులకున్న చిఱుగంటల ధ్వని కొన్ని క్రోశముల ఆవలనున్న కాంచీపురమునకు విన్పించు చుండెడిదట. దానిని బట్టి వీరి ఐశ్వర్యాతిశయమెంతటిదో తెలియుచున్నది. అటువంటి సంపదను కలిగిన వీరు తమ భవనమునందు ఒక ధర్మశాలను కట్టించి సూర్యోదయము మొదలు

రాత్రి రెండవ ఝామువరకు ప్రతినిత్యము బీదలకు సాధువులకు నిరతాన్నదానము చేయుచు మహాధార్మికులుగా ప్రసిద్ధి పొందిరి.

ప్రతిదినము కంచిలో వరదరాజస్వామి సన్నిధిలో రాత్రి తిరువారాధనమంతయు ముగిసి ప్రధాన ద్వారపు తలుపులు మూయబడినయనంతరమే వీరి యొక్క భవనపు తలుపులు మూయబడుచుండుట ఆచారముగా నుండెడిది.

**2.1.6 మహావైరాగ్య కారణము :-**

ఈ విధముగా అనేక సంవత్సరములు అఖండాన్నదానము జరుగుచుండగా ఒకనాటి రాత్రి కాంచీపురమున వరదరాజస్వామి సన్నిధిలో ఏకాంతసేవ ముగియుటకు ఆలస్యమైనది. ఆలయమున నియమిత కాలమున ద్వారపు తలుపులు మూయబడక పోయినను ఆ విషయము తెలియని కూరేశప్రాసాద ద్వారపాలకులు తలుపులు మూసివేసిరి. ఆ తలుపులకున్న చిఱుగంటల ధ్వని కంచిలోనున్న స్వామివారికి అమ్మవారికి చెవినబడెను. దానిని ఆలకించిన స్వామి కాంచీపూర్ణులను చూచి 'ఆశ్చర్యముగా నున్నది, ఏకాంతసేవ ముగియుటకు ముందే తలుపులు మూయబడినవెందులకు ?' అని ప్రశ్నించగా, ''ఈ ధ్వని ఇచ్చటిది కాదు చాలా దూరమున నున్న శ్రీవత్సాంకుల భవన కవాట ధ్వని'' అని కాంచీపూర్ణులు స్వామికి విన్నవించిరి. అప్పుడు వరదరాజస్వామి కూరేశుల ఐశ్వర్యాతిశయము మనలనిట్లు భ్రమింప జేసినదా! అనుకొనిరి.

ఈ విధముగా కాంచీపూర్ణులకును వరదరాజ స్వామికిని జరిగిన సంభాషణమును అర్చకుల మూలముగ విన్న కూరేశులు అత్యంత వైరాగ్య కారణంబగు విషాదము అంకురించి ఇట్లు చింతింపసాగిరి. 'పురుషాధముడనైన నేను పురుషోత్తముడైన శ్రీవరదరాజ స్వామి మరియు దేవేరిలను భ్రమింప జేసితిని మహాపాపిని.' ఇట్లు దుఃఖించి కూరేశమిశ్రులు తన సకల విధైశ్వర్యములను తృణప్రాయముగ నెంచి

త్యజించి మహర్షులు, మోక్షేచ్ఛారతులగు యోగీశ్వరులవలంబించిన మార్గమునే అనుసరింపదలచి ప్రతినిత్యము స్వామివారి పాదసేవ చేయవలెనని సంకల్పించిరి. ప్రతి బ్రాహ్మణునకు ఉపనయన కాలమున వేదవిహితముగా ఉపదేశింపబడిన ఉంఛవృత్తి (భిక్షాటనము) నే స్వీకరించుటకు నిశ్చయించి ధర్మపత్నికి తన మనఃసంకల్పము తెలియబరచెను. ఆ సాధ్వీమణి తన పతి సంకల్పమునకు సంపూర్ణాంగీకారమును తెలిపెను. వెంటనే కూరేశులు తమ ఐశ్వర్యమునంతటిని బీదలకు దానముచేసి సామాన్యవస్త్రములను ధరించి రామానుజపాదములను ఆశ్రయించవలెనని బయలుదేరిరి.

ఇట్లు ప్రయాణించుచుండగ మార్గమధ్యమున మధురాంతక సమీపమున అడవిలో అర్ధరాత్రి సమయమున తన పతియందు అత్యంతానురక్తురాలైన ఆండాళమ్మ శ్రీవత్సాంకులతో ''ఈ అర్ధరాత్రి సమయమున మనము ఒంటరిగా అరణ్యమార్గమున పయనించుచుండుటచే చోరులు వచ్చి మనలను బాధింతురేమో! నాకు భయముగ నున్నది'' అనెను. శ్రీవత్సాంకులు ''ఒడిలో బరువుండిన గదా! త్రోవలో భయముండునది. అటుల నీ వద్ద ఏదైనను కలదా ?'' అని అడిగిరి. ''నాథా ! మీ కెప్పుడైనా దాహమైనచో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చుటకై ఒక చిన్న స్వర్ణపాత్రను మాత్రము తెచ్చితిని, లేని యెడల దాహార్తి తీర్చుకొనుట కష్టము గదా !'' అని ఆ స్వర్ణపాత్రను శ్రీవత్సాంకుల చేతికిచ్చెను. దానికి కూరేశులు ''బీదవారు బంగారు గిన్నెతో దాహము తీర్చుకొనుట చూసితివా'' ? యని ఆ గిన్నెను అడవిలో దూరముగా పారవైచెను. అనంతరము మధురాంతకమునకు వెళ్ళి అక్కడ వెలసియున్న స్వామికి (ఏరికాత్త పెరుమాళ్) అంజలి ఘటించి అక్కడి నుంచి రామానుజుల నద్దకు పయనము సాగించెను.

**2.1.7 భగవద్రామానుజుల శిష్యరికము :-**

ఇట్లు శ్రీరంగమునకు వచ్చిన శ్రీవత్సాంకులు రామానుజులనే

గురువుగా భావించి వారి పాదముల నాశ్రయించిరి. అప్పటికే కూరేశుల గొప్పతనమును, సద్గుణములను గూర్చి వినియున్న రామానుజులు వారిని తమ అంతరంగ శిష్యులుగా చేసికొనినారు. కూరేశులకు, దాశరథి అను వారికి రామానుజులు వేదవేదాంతములలోని రహస్యములను ఉపదేశించిరి.

## 2.1.8 త్రిదండ యజ్ఞోపవీతములు :-

భగవద్రామానుజాచార్యులు, ఆ కాలమున వైష్ణవాచార్యులలో అగ్రగణ్యులు ప్రముఖులు అయిన గోష్ఠీపూర్ణుల వారి వద్ద అష్టాక్షరీ మంత్రోపదేశము పొందవలెనని నిశ్చయించుకొని అనేకమార్లు వారి వద్దకు వెళ్ళి మంత్రోపదేశము చేయుడని ప్రార్థించిరి. కాని గోష్ఠీపూర్ణులు మంత్రోపదేశము చేయకుండిరి. పట్టుదలతో రామానుజులు మరల మరల వారి వద్దకు వెళ్ళి ప్రార్థించగా రామానుజుల అర్హతను గుర్తించి త్రిదండ యజ్ఞోపవీతములతో ఒంటరిగా రమ్మని ఆదేశించిరి. మరుసటి దినమున రామానుజులు కూరేశ దాశరథులను వెంటబెట్టుకొని వెళ్ళిరి. తన ఆదేశమునకు విరుద్ధముగా ఇరువురితో వచ్చిన రామానుజులను చూడగనే ''ఒంటరిగా రమ్మనిన ఇరువురిని వెంటబెట్టుకొని వచ్చితివేమి?'' అని ప్రశ్నించిరి. అప్పుడు రామానుజులు ''గురువర్యా ! మీరు ఆనతిచ్చినట్లుగనే త్రిదండ యజ్ఞోపవీతములతో మాత్రము వచ్చితిని. వీరిద్దరు నాకు త్రిదండయజ్ఞోపవీతములు'' అని తన వెంటనున్న కూరేశ-దాశరథులను చూపించిరి. గోష్ఠీపూర్ణులు ఆశ్చర్యముతో 'ఇందులో ఎవరు త్రిదండము, ఎవరు యజ్ఞోపవీతము?' అని అడుగగా దానికి రామానుజులు 'దాశరథి త్రిదండము, కూరేశులు యజ్ఞోపవీతము' అని చెప్పిరి. అప్పుడు గోష్ఠీపూర్ణులు రామానుజుల శిష్యవాత్సల్యమునకు ముగ్ధులై ముగ్గురికి మంత్రోపదేశము గావించిరి.

ఇచ్చట గమనింప వలసిన విషయము - యజ్ఞోపవీతము పరమ పవిత్రమైనది. శరీరమునుంచి తొలగింపరానిది యజ్ఞోపవీతముతోనే

బ్రాహ్మణులు పవిత్రులగుదురు. యజ్ఞోపవీతమే బ్రాహ్మణులకు సత్కార్యములను ఆచరించు అర్హతనిచ్చుచున్నది. అటువంటి పరమపావనమైన యజ్ఞోపవీతముతో కూరేశులను పోల్చుట మిశ్రుల మహత్త్వమును చాటుచున్నది.

**2.1.9 కార్యదీక్ష :-**

ఈ విధముగ అష్టాక్షరీ మంత్రోపదేశమును పొందిన శ్రీవత్సాంకులు రామానుజులకు అత్యంత భక్తితో శుశ్రూష చేయుచు తనకు చరమశ్లోక రహస్యార్థమును ఉపదేశించమని ప్రార్థించిరి. దానికి రామానుజులు - ''నియమముతో ఒక సంవత్సర కాలము గురు శుశ్రూష చేయువారికే ఈ రహస్యార్థమును ఉపదేశించమని మా ఆచార్యవరేణ్యుల ఆనతి'' అనిరి. అది విన్న శ్రీవత్సాంకులు ''ఆత్మకు సంబంధించిన శరీరములు మెరుపు కన్న అస్థిరములు'' అన్న దివ్యప్రబంధపాశురమును[5] మదిలో తలచి ఆచార్యా ! ఈ శరీరము అస్థిరము గదా ! అస్థిరమైన ఈ శరీరముతో ఒక సంవత్సరకాలము గడపగలనో లేనో యని సందేహము కలుగుచున్నది. ఆ అర్థవిశేషము తెలిసికొనినగాని మోక్షార్హత లేదు. కనుక ''ఆచార్యసన్నిధియందు ఒక మాసము ఉపవాసముండుట సంవత్సరకాల మొనర్చిన శుశ్రూషతో సమానమగును.'' అన్న శాస్త్రవచనానుసారము ఒకమాసము ఉపవాసముండి నిగూఢమైన చరమశ్లోక రహస్యార్థమును తెలుసుకొందునని ప్రార్థించి అట్లే ఉపదేశమునందిరి ఇది శ్రీవత్సాంకుల కార్యదీక్షా తత్పరతకు తార్కాణము.

**2.1.10 కఠిన పరీక్ష :-**

శ్రీవత్సాంకులు తమ సంపదనంతయు త్యజించి భాష్యకారుల శ్రీపాదముల నాశ్రయించినది మొదలు శ్రీరంగము నందు భిక్షాటనముచే జీవనము సాగించసాగిరి. ఒక దినము ఆకాశమంతయు

5 తి మొ । 2 2

మేఘావృతమై ఉరుములు మెరుపులతో ఎడతెరపి లేక వర్షము కురియుచుండుటచే ఆ దినము భిక్షాటనమునకు వెళ్ళుటకు సాధ్యపడక శ్రీవత్సాంకులు, ఆయన సతీమణి నిరాహారులై నీరు మాత్రము త్రాగి ''భుజించు అన్నము, త్రాగు నీరు, తిను తమలపాకులు అంతయును మాకు స్వామియైన కృష్ణుడే''[౦] అనునట్లు దివ్యప్రబంధానుసంధానము చేయుచు నిదురించిరి. ఆ రాత్రి భర్త గాఢనిద్రలో ఉన్న సమయమున శ్రీరంగనాయకస్వామివారికి నివేదన జరుగుచుండగ ఆండాళమ్మ ఆ ఘంటానాదమును విని ''స్వామీ! మీ భక్తులు నిరాహారులైయుండ నీవు మాత్రము షడ్రసోపేతమైన పాయసాన్న భక్ష్యాదులతో నివేదనము గైకొనుచుంటివా ?'' యని తన మనమున తలంచెను. సర్వజ్ఞుడైన రంగనాథుడు ఆమె తలంపునెరిగి వెంటనే దేవాలయ కార్యనిర్వాహకులైన ఉత్తమనంబికి కలలో కనిపించి ''నా భక్తులైన కూరేశులును ఆయన సతీమణియు నిరాహారులై ఆకలితో పరుండి యున్నారు. కాన, నీవు ప్రసాదమును గొనిపోయి వారలకొసగుము'' అని ఆజ్ఞాపించెను. ఉత్తమనంబి ఒక బంగారు పళ్ళెమున ప్రసాదమునుంచి ఆ పళ్ళెరమును శిరముపై నుంచుకొని మంగళవాద్యములతో సకలజన పరివారముతో కూరేశుల గృహమునకు వచ్చి స్వామి ఆజ్ఞను విన్నవించి ఆ ప్రసాదమును అచట నుంచి వెడలిపోయెను. శ్రీవత్సాంకులు, భక్తవత్సలుడైన భగవంతునియొక్క అవ్యాజమైన కృపాకటాక్షమునకు ఆశ్చర్యపడి తన్మయీభావము నందిరి. అనంతరము ఆ ప్రసాదమును రెండు భాగములుగా చేసి ఒక భాగము తా[illegible]రగించి రెండవ భాగము తన భార్య కొసంగిరి.

స్వామివారేల ప్రసాదమును పంపిరో తెలియజాలక తన సతిని పిలిచి నీవేమైనను రంగనాథుని ప్రార్థించితివా ? అని అడిగెను అందులకామె జరిగిన దంతయూ కూరేశులకు తెలియపఱచగా ''జగతః

---

౦ తి మొ ౦ 7 ।

పితరులైన రంగనాథస్వామిపై ఇటువంటి చెడు అభిప్రాయము మనమున రానివ్వడము మహాపచారము'' అని ఆమెను కోపపడి తన సతి చేసిన అపరాధము క్షమించవలసినదిగ రంగనాథుని ప్రార్థించిరి. ఆ సాధ్వీమణి కూడా అపరాధమునకు పశ్చాత్తాపపడినది

**2.1.11 పుత్రోదయము :-**

అట్టి మహిమోపేతమైన భగవత్ప్రసాదము నారగించుటచే ఆ సతీమణి గర్భము దాల్చి నవమాసములు పూర్తియైన పిదప ఒక శుభదినమున శుభలగ్నమున ఇరువురు పుత్రులకు జన్మనిచ్చినది. రామానుజయతీంద్రులు ఆ ఇరువురు పుత్రులను చూసి అత్యంతానందభరితులై పూర్వము తాము ఆళవందారులకు చేసిన మూడు ప్రతిజ్ఞలలో భాగముగా విశిష్టాద్వైత సిద్ధాంతమున కత్యంతోపకారము గావించిన శ్రీవేదవ్యాసమహర్షి, శ్రీపరాశర మహర్షులయొక్క ఉపకార స్మృతికై ఈ ఇరువురు బాలురకు శ్రీవేదవ్యాసభట్టర్, శ్రీపరాశరభట్టర్ అని నామకరణము గావించిరి. పిదప ఆ పుత్రద్వయము దిన దిన ప్రవర్థమానులై బాల్యము నుండియే అనితర మేధా సంపత్తిచే వేదవేదాంగాది చతుర్దశ విద్యలయందు పారీణులైరి. అందులో శ్రీపరాశర భట్టార్యులు రంగనాయకస్వామి స్వీకారపుత్రులుగా స్వామిచే స్వీకరింపబడి శ్రీరంగమున దర్శన స్థాపకాచార్యులుగ నుండిరి. వీరు - 1. శ్రీరంగరాజస్తవము, 2. శ్రీగుణరత్నకోశము, 3. భగవద్గుణదర్పణము (విష్ణుసహస్రనామ భాష్యము), 4. అష్టశ్లోకి, 5. ద్వయశ్లోకి, తనిశ్లోకి మొదలగు ఉత్కృష్ట గ్రంథములను రచించిరి.

**2.1.12 అహంకార రాహిత్యము :-**

సకల శాస్త్ర పారంగతులైన కూరేశమిశ్రులకు విద్వాంసుడనన్న అహంకారమేమాత్రమును లేదు. వీరి అహంకార రాహిత్యము నిరూపించుటకు క్రింది సంఘటనను నిదర్శనముగా పేర్కొనవచ్చును

**2.1.13 శిష్యుడైన గురువు :-**

ఒకసారి ఒక ఆచార్యుడు రామానుజుల వద్దకు వచ్చి ''స్వామీ ! నేను సంప్రదాయరహస్యార్థములను తెలుసుకొనవలెనన్న ఆసక్తితో నున్నాను. కానీ వృత్తిరీత్యా అచార్యుడనైనందున బహిరంగముగా జనసామాన్యము నెదుట విద్యను నేర్చుకొనుట అగౌరవముగ భావించుచున్నాను. కనుక రహస్యముగా విద్య నుపదేశింపు''డని ప్రార్థించెను. ఆ ఆచార్యుని అజ్ఞానమునకు బాధపడిన రామానుజులు వారిని శ్రీవత్సాంకుల నాశ్రయించమని పంపివేసిరి. శ్రీవత్సాంకులు ఆ ఆచార్యుల అభ్యర్థనకంగీకరించి మధ్యాహ్నకాలము దేవాలయ ప్రాంగణము నిర్జనప్రదేశముగనెంచి అక్కడ ప్రతిదినము ఆ ఆచార్యునకు సంప్రదాయ రహస్యార్థములను ఉపదేశించుచుండిరి. ఒక దినమున కూరేశులు ఆచార్యునకుపదేశము గావించుచుండు సమయమున కొందరు రాజభటులు ఆ ప్రాంగణములో ప్రవేశించిరి. వారిని చూసిన ఆ ఆచార్యుడు చాల బాధతో ఖిన్నవదనుడై తాను ఒక ఆచార్యుడుగ ఉండి ఇతరుల వద్ద విదాభ్యాసము చేయుచుండుట వారు చూచినచో తనక గౌరవమేర్పడునేయని తలంచుచుండిరి. అతని మనస్సులోని భావనను బాధను గుర్తించిన మిత్రులు అతని చేతిలోనున్న పుస్తకమును తాను తీసికొని ఆచార్యపురుషుడుపదేశించుచున్నట్లును, వారి వద్ద తాను విద్యాభ్యాసము చేయుచున్నట్లును అచ్చటికి వచ్చిన మనుష్యుల ఎదుట అభినయించి ఆ ఆచార్యుని మనఃక్లేశమును తీర్చుటయే గాక సకల విద్యాపారంగతులైన కూరేశులంతటి వారికి కూడ ఉపదేశించగలడీ ఆచార్యుడు అని అతని కీర్తిని ఇనుమడింపజేసిరి.

**2.1.14 ఏక సంధాగ్రాహి :-**

రామానుజులు యామునాచార్యులకు చేసిన మూడు ప్రతిజ్ఞలలో భాగముగా భగవదంశసంభూతులగు వేదవ్యాస మహర్షిచే లోకోజ్జీవనార్థమై రచింపబడిన బ్రహ్మసూత్రములకు విస్తృతమైన

భాష్యమును రచింప ఉద్యుక్తులైరి. అందులకై శ్రీబోధాయన మహర్షి బ్రహ్మసూత్రములపై రచించిన 'బోధాయనవృత్తి' అను గ్రంథము కాశ్మీర దేశములో శారదా పీఠమునకు చెందిన సరస్వతీ భాండారమున నున్నదని నిశ్చయించుకొని రామానుజాచార్యులు తమ శిష్యులగు కూరేశాదులతో కాశ్మీర దేశమునకు పయనమయ్యిరి. అచటి విద్వాంసులను వాదమున జయించి బోధాయనవృత్తిని సంపాదించి తమ శిష్యులతో గూడ అధ్యయనము చేయుచుండిరి. రామానుజులు మొదటి అధ్యాయము పరిశీలించుచుండగ మిశ్రులు రెండవ అధ్యాయమునుండి గ్రంథము చివరి వరకు అధ్యయనము చేసి హృదయమున నింపుకొనిరి. రామానుజులు మొదటి అధ్యాయము చదివి ముగించిన వెంటనే అచటనున్న మతాంతరస్థుల ఉద్బోధచే సరస్వతీ భాండార నిర్వాహకులు ఆ గ్రంథమును తీసికొని భద్రపరిచిరి.

శ్రీవత్సాంకులు విచారవదనులైయున్న రామానుజులను చూసి ''స్వామీ! బోధాయనవృత్తి లేదని మీరు చింతింపవలదు. ఆ గ్రంథము యొక్క ఏ భాగమునందైనను నన్ను పరీక్షించి చూడుడు. నేను ఆ గ్రంథములోని వాక్యములను ఆమూలాగ్రము చెప్పగలను. గ్రంథము లేదను విచారమువలద''ని చెప్పెను. అపుడు రామానుజులు, మిగిలిన శిష్యులు కూరేశులను పలు విషయములపై ప్రశ్నించిరి. అందులకు కూరేశులు కొంచెమైనను తడబడకుండా ఆమూలాగ్రము గ్రంథస్థవాక్యములనే చెప్పినందులకు ఆ మహనీయుని అద్భుత జ్ఞాపకశక్తికి, ఏకసంధాగ్రాహిత్వమునకును అందఱుఅత్యంతాశ్చర్యముతో గ్రంథము పోలేదని మనుష్యరూపమును ధరించి తమతో గూడ నడచి వచ్చుచున్నదని కూరేశుల నభినందించిరి.

### 2.1.15 శ్రీభాష్య లేఖనము :-

ఒకానొక శుభదినమున భగవద్రామానుజులు శ్రీభాష్యరచనమారంభము చేయ సంకల్పించి శ్రీవత్సాంకులను

లేఖకులుగా నియమించిరి.[7] రామానుజులు కూరేశులతో నేను వృత్తిగ్రంథము పూర్తిగా చదువలేదు. కనుక కొన్ని విషయముల యందు భాష్యము వృత్తిగ్రంథముతో భేదించవచ్చును; అట్టి సమయమున "వృత్తిగ్రంథమున ఈ విషయమిట్లున్నది" అని తెలియజేయవలెననిరి. అందుకు కూరేశులు సర్వజ్ఞులైన గురువర్యులకు మనము తెలియజేయుటయా ! ఇది మహాపచారమని తలచి సమ్మతిని తెలుపకుండెను. అనంతరము గురుశిష్యులిరువురు ఒక సంకేతమును ఏర్పరుచుకొనిరి. దాని ప్రకారము "తాము చెప్పెడి భాష్య పంక్తులు నిస్సంశయముగనున్నవని తోచిన వ్రాయవలసినదనియు, మనసునకు ఏమాత్రము తృప్తి కలగనిచో సంశయనిపించినచో దానిని వ్రాయక నిలిపి వేయడు" అని ఆజ్ఞాపించి "అఖిలభువన జన్మ స్థేమ భంగాది లీలే"[8] యని మొదలిడి రామానుజులు చెప్పచుండగ శ్రీవత్సాంకులు అత్యంతోత్సాహముతో వ్రాయనారంభించిరి. కొన్ని సందర్భములయందు తన మనమున కిచ్చగింపక పై సంకేతము ప్రకారము వ్రాయుట నిలిపివేసెను. పిమ్మట రామానుజులే తాము చెప్పిన యర్థము పొసగదని తెలిసికొని సరియైన అర్థము చెప్పగ మొత్తము శ్రీభాష్యమును పూర్తి గావించిరి. శ్రీభాష్యలేఖనమును పూర్తిగావించి రామానుజులు -

భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ ।
త్వయా పుత్రేణ ధర్మాత్మా న సంవృత్తః పితామమ ॥[9]

అని లక్ష్మణుని రాముడు కొనియాడినట్లు 'మీరుండగా ఆళవందారులు పరమపదమునకు చేరినట్లు నేను తలచుట లేదు', అని శ్రీవత్సాంకుల మహామహిమత్వమును ప్రస్తుతించిరి.

---

7 కూరనాథ లేఖినీ నికషదృషదుల్లేఖన పరీక్షితైః సువర్ణైః సుగృహీతమ్
రా చం. FISC, I. 1.P. 440

౮ శ్రీ భా ఉపక్రమణిక.

౯ వా రా అర. ।౫ ౨౯

## 2.1.16 మహాపూర్ణానుగ్రహము :-

కులోత్తుంగ చోళుడను రాజువలన శైవ వైష్ణవ ద్వేషములు ఎక్కువగా ప్రబలిన ఆ రోజులలో రాజు శైవ మతస్థుడైనందున శైవమత ప్రచారమునకై వైష్ణవాలయములను భిన్నము గావించుచు పౌరులందఱను శైవ మతమునను సరించునట్లు నిర్బంధించుచుండెను. దావానలమువలె ఈ వార్త శ్రీరంగమునందలి వైష్ణవులకు తెలిసి రంగనాథస్వామికి ఏ ఆపద రానున్నదోయని ఖిన్న మనస్కులైరి.

ఆ సమయమున అక్కడకు వచ్చిన మహాపూర్ణులు అచ్చటి వైష్ణవుల మనఃక్లేశమును తెలిసికొని దీనికి పరిష్కార మార్గమాలోచించి రామానుజులను సమీపించి రాజోపద్రవమునుంచి ఆలయ సంరక్షణకు ఆలయము చుట్టూ ప్రదక్షిణ చేయవలెనని, అందుకు తనతో పాటు అర్హత గల వ్యక్తిని నియమింపుడని ప్రార్థించిరి. రామానుజులు ఆ అర్హత కూరేశులకు కలదని తెలిసినను మహాపూర్ణుల ఉద్దేశ్యమేమిటో తెలిసి కొనదలచి అట్టి వారెవ్వరూ లేరనెను. అంతట మహాపూర్ణులు 'సకలార్హతలు గల కూరేశులు లేరా? అతనికవకాశ మివ్వరాదా!' అని అడిగిరి. మహాపూర్ణులంతటి వారు మిశ్రుల అర్హతను గుర్తించి అనుగ్రహించి నందులకు రామానుజులు మిగుల సంతసించి కూరేశులను మహాపూర్ణులతో ఆలయ ప్రదక్షిణమునకు పంపించిరి.

ఆ మహాభక్తులిరువురు శ్రీరంగనాథ ఆలయమును ప్రదక్షిణము చేయుట చేతనే మిగిలిన దేవాలయములకు రాజోపద్రవము కల్గినను ఆ ఆలయమునకు మాత్రము ఎటువంటి హాని జరుగలేదు. మహనీయులగు కూరేశుల భక్తి తత్పరత ఎట్టిదో దీనివలన తెలియు చున్నది.

## 2.1.17 గురుప్రాణ రక్షణము :-

చోళ రాజ్యమును కులోత్తుంగ చోళుడను రాజు పరిపాలించు

చుండెను. ఈ రాజ్యమునకే రాజేంద్రచోళపురమనియు నామాంతరము కలదు. శైవమతస్థుడైన ఈ రాజు మతద్వేషముతో వైష్ణవాలయములలోని విగ్రహములను భిన్నముగావించుచు, వైష్ణవులను బాధించుచు వారిని శైవమతావలంబులుగా మారునట్లు వత్తిడి చేయుచు అనేక క్రూర కృత్యములను చేయుచుండెను. అట్లు శైవ మతమును అనుసరించని యెడల హింసించి దేశబహిష్కార శిక్షవిధించుచుండెను. అనేకమంది వైష్ణవులను రాజసభకు పిలిపించి '' శివాత్పరతరం నాస్తి'' అని వ్రాసి సంతకము చేయమనుచుండెను. కొందరు ప్రభువు ఆజ్ఞకు భయపడి, మరికొందరు ద్రవ్యమునకు ఆశపడియు అట్లే చేసిరి.

అపుడు ఆ రాజునకు అంతరంగుడైయున్న నాలూరాన్ అనునొక వైష్ణవుడు ''ఓ రాజా! మీరల్పజ్ఞులగు అనేక మంది వైష్ణవుల చేత శైవమతమునంగీకరింపజేసినను అంతగా ప్రయోజనముండదు. ఇపుడు దేశ దేశాంతరవములలో వ్యాపించియున్న సకల వైష్ణవజన సంస్థానవములకెల్ల ఆచార్యులు శ్రీమద్రామానుజ యతీంద్రులు. అటువంటి వారిచే శైవమతము నంగీకరింపజేసిన, ప్రపంచమంతయు వ్యాపించియున్న వైష్ణవబృందము కూడా వారి శిష్యులే కావున శైవ మతాను సారులుగా మారుదు''రని చెప్పెను. అది విన్న రాజు రామానుజులను పిలుచుకొనిరమ్మని భటుల నాజ్ఞాపించెను. రాజ భటులు శ్రీరంగములోని రామానుజుల ఆశ్రమమునకు వచ్చి ''చోళరాజు రామానుజులను తత్క్షణము పిలుచు కొని రమ్మని ఆజ్ఞాపించెను'' అనిరి. లోపలనున్న శ్రీవత్సాంకులు ఆ మాటలు విని తమ గురువర్యులకు రానున్న ఆపదను గ్రహించి వారు స్నానార్థము సమీపములోని కొలనుకు వెళ్ళియుండుట వలన తాను గృహస్థుడైనను గురు ప్రాణ రక్షణకై వారి కాషాయ వస్త్రములను త్రిదండమును ధరించి తానే రామానుజులనని రాజ భటులకు చెప్పి వారి వెంట రాజసభకు బయలు దేరెను. పెరియనంబి అనబడు మహాపూర్ణులు కూడా కూరేశులతో పాటు రాజ సభకు బయలు దేరిరి.

కూరేశులు కాషాయ త్రిదండములతో రాజసభలో అడుగిడిన వెంటనే వారి ముఖవర్చస్సును చూసి రామానుజయతీంద్రులే యనెడి భ్రమచే సభలోని వారందరు లేచి నమస్కరించిరి. అపుడు రాజు '' స్వామీ! మీరు జగద్విఖ్యాత పండితాగ్రేసరులు. మా ఆస్థానపండితులతో వాదించి మీ విష్ణుపరత్త్వమును నిరూపించుమనిరి. కూరేశులు శ్రీమన్నారాయణుడే పరాత్పరుడని శ్రుతి స్మృతి పురాణేతిహాసములను ఉదాహరించుచు సప్రమాణముగా వాదించిరి. అసూయావిష్టుడైన రాజు నిజమును గ్రహించక పోగా తనకే పరాజయ మేర్పడినట్లు భావించినాడు. వెంటనే ఒక తాటి ఆకుపై 'శివాత్పరతరం నాస్తి' అని వ్రాయమని నిర్బంధించెను. మిశ్రులు తమ అధ్యవసాయమునకు భంగము వాటిల్లకుండా ఆ వాక్యము క్రింద 'ద్రోణమస్తి తతః పరమ్' అని వ్రాసిరి.

రెండర్థములుగల శివ, ద్రోణ శబ్దములు ప్రసిద్ధార్థములనే గాక రెండు కొలతపాత్రలు అన్న అర్థమును కూడా బోధించును. శివునికంటే పరదైవము లేదు అని యంగీకరించునట్లు వ్రాయమని రాజు కోరెను. కాని శ్రీవత్సాంకులు శివ శబ్దమునకు కొలతపాత్ర అను అర్థమును గైకొని 'శివ' మున కంటే పెద్దపాత్ర లేదనుట తప్పు. ద్రోణము (కుంచము) అను పాత్రయున్నది అను అర్థము వచ్చునట్లు వాక్యమును పూరించెను.

ఆలస్యముగా ఈ అర్థమును గ్రహించిన రాజు దురాగ్రహముతో కూరేశుల నేత్రములను పీకివేయడని నిండుసభలో భటులనాజ్ఞాపించెను. క్రూరుడగు ఆ రాజు యొక్క పైశాచిక ప్రవృత్తికి భయపడక కూరేశ మిశ్రులు ''భగవంతుని ద్వేషించిన నీ వంటి పాపాత్ముల ముఖమును చూచిన ఈ కన్నులతో నా ఆచార్యుల ముఖమునెట్లు చూడగలను? కనుక నాకు ఈ నేత్రములు పోవుటయే మంచిది'' అనుచు తమ నేత్రములను తామే పీకివేసికొనిరి. ఆ పై రాజాజ్ఞచే భటులు కూరేశుల వెంటవచ్చిన మహాపూర్ణుల నేత్రములను పీకి వేసి ఇరువురను

చిత్రహింసలకు గురిచేసిరి. అపుడు ఆ సభయందున్న ఒక భక్తురాలు ఆ క్రూరకృత్యమును చూసి నిశ్చేష్టురాలై మిగుల దుఃఖించుచు వారిని సభ నుండి వెలుపలకు తీసికొనివచ్చి తాత్కాలిక ఉపచారములను చేసి శ్రీరంగమునకు మార్గము చూపెను. మహాపూర్ణులు వయోవృద్ధులగుటచే నేత్రబాధను ఓర్వలేక మార్గ మధ్యముననే పరమపదించిరి. కూరేశులు వారికి చరమసంస్కారములను నిర్వర్తించి శ్రీరంగమునకు బయలుదేరిరి.

### 2.1.18 పంచస్తవీ రచన :-

ఇట్లు శ్రీరంగమునకు ప్రయాణమైన కూరేశ మిశ్రులు మార్గమధ్యమున తమ నేత్ర బాధ మనోవ్యథలు జ్ఞప్తికి రాకుండుటకై శ్రీమన్నారాయణుని స్వరూప రూప గుణ విభూతులను అనుసంధానము చేసికొనుచు శ్రీవైకుంఠస్తవము, అతిమానుషస్తవము అనెడి రెండు స్తోత్రములను రచించిరి. అనంతరము తిరుమాలిరుంశోలై అను ప్రదేశమునకు వెళ్ళి అక్కడ వెలసియున్న అర్చావతార స్వరూపుడగు సుందరబాహుస్వామిని వర్ణించుచు సుందరబాహు స్తవమును రచించిరి. అంతలో మహా పాతకుడగు చోళరాజు మరణించెనన్న వార్తవిని తమ ఆచార్యవర్యులను వెదకుచు శ్రీరంగమునకు పయనము సాగించిరి.

రామానుజులు కూడా చోళుని మరణ వార్తను తెలిసికొని శ్రీరంగమునకు విచ్చేసిరి. శ్రీవత్సాంకులను చూసి ఆనందముతో ఆలింగనము చేసికొని '' మీరు ఈ విశిష్టాద్వైత దర్శనమునకు నేత్ర సములు. మీకిట్లు నేత్రములు పోవలయునా?'' అని మిగుల దుఃఖించి ఇరువురు ఆశ్రమమునకు వెళ్ళిరి. మరుసటి దినము కూరేశులు తాము రచించిన మూడు స్తవములను రామానుజులకు వినిపించిరి.

### 2.1.19 కాంచీపురాగమనము :-

రామానుజులు శ్రీవత్సాంకులతో ''కాంచీపురములో

భక్తవత్సలుడైన వరదరాజ స్వామి కోరిన దంతయు ఇచ్చుటలో అవ్యాజమైన ఔదార్యము కలవాడు మీరు ఆ స్వామినుద్దేశించి నేత్ర సాక్షాత్కారమునకై ఒక స్తోత్రమును రచింపవలెను'' అనగా మొదట కూరేశులంగీకరింపక అనంతరము గురువు ఆజ్ఞమీరలేక వరద రాజస్తవమును రచించిరి.

ఆ స్తవమునందు -

నీలమేఘనిభ మంజన పుంజ
శ్యామ కుంతల మనంతశయం త్వాం।
అబ్జ పాణి పద మంబుజ నేత్రం
నేత్ర సాత్కురు కరీశ! సదా మే ॥[10]

అని రచించి స్వామికి విన్నవించగా, ఆ నాటి రాత్రి కూరేశులకు స్వామి స్వప్నమున సాక్షాత్కరించి '' నీవు కోరినట్లే నేత్రములను ప్రసాదించితిని'' అనెను. కూరేశులు వెంటనే లేచి వరదరాజస్తవమును పూర్తిగావించి రామానుజులకు వినిపించెను. రామానుజులు ఆ స్తవమును పూర్తిగా విని ''స్వామి ఎదుట ఈ స్తవమును విన్నవించెదము'' అని ఇరువురు కంచికి చేరి వరదరాజస్వామి సన్నిధిలో ఆయన ఎదుట విన్న వించుచుండగా, రామానుజులు ప్రదక్షిణముకొరకు ప్రక్కకు వెళ్ళిరి. అప్పడు ఆ స్తవము నాలకించిన వరదరాజస్వామి ప్రసన్నులై కూరేశులకు సాక్షాత్కరించి ''నీకు కావలసినది కోరుకొనుము'' అనెను. అపుడు కూరేశులు రామానుజుల ఇష్ట ప్రకారము నేత్రములను కాంక్షింపక నాలూరాన్‌నకు మోక్షము నిమ్మని ప్రార్థించిరి స్వామియు అట్లేయని యనుగ్రహించిరి.

చోళరాజునకు సన్నిహితుడైన నాలూరాన్ అను వైష్ణవుడే రామానుజులు శ్రీరంగము విడిచి వెళ్ళుటకు, తనకు నేత్రములు పోవుటకును, మహాపూర్ణులు మరణించుటకును కారణము.

10 వ. స 23

ఈవిధముగా శ్రీవైష్ణవ దర్శనమునకే మహాపరాధియైన నాలూరాన్‌నకు క్రూరమైన నరకము తప్పదని, ఒక వైష్ణవుడు నరకమునకు పోవుట తగదని పరమద్రోహియైన అతనికి కూడా సద్గతిని ప్రసాదించమని వేడిరి. ద్రోహుల విషయమునను ప్రీతికలిగి యుండుట కూరేశుల అసాధారణమైన గుణము.

ఈ విషయమును గ్రహించిన రామానుజులు కూరేశులను చూసి మాకోరికను పూర్తి చేయలేదేయని మిగుల తప్త హృదయులై యుండ వరదరాజస్వామి '' రామానుజా! కూరేశులు మిమ్ము, మమ్ము చూచునపుడు అంతర్నేత్రములతో చూడగలరు'' అను వరమునొసగిరి. శ్రీవత్సాంకులు స్వామిని, ఆచార్యులను సేవించి తరించిరి.

**2.1.20 పరమపద ప్రాప్తి :-**

ఆచార్యుని చరణకమలములను సదా సేవించుకొనుచున్న కూరేశులు ఒకనాడు తిరువాయ్‌మొళి ఉపన్యాస సమయమున ఒక పాశురమునకు అర్థమును విశదీకరించుచు ''పరమ పదమునకు ముందు వేంచేసిన వారు తరువాత వేంచుయువారి నెదుర్కొని ఉపచారములను గావింతురు''[1] అన్న విషయమును తెలిసికొని సంశయముతో తమ ఆచార్యుల తరువాత పరమపద ప్రాప్తి పొందినచో వారు నాకు ఉపచారములను గావింప వలసివచ్చును కదా! ఇది మహాపచారము కనుక ఆచార్యులకన్నా తామే ముందుగ పరమపదమును పొందవలెనని నిశ్చయించుకొని స్వామి సన్నిధికి వెళ్ళి అంజలి బద్ధుడై నిలబడి స్వామిని ప్రార్థించెను. భక్తవత్సలుడైన స్వామి కూరేశులకు ప్రత్యక్షమై ''వలసిన వరమును కోరుకొమ్మనెను'' కూరేశులు సంతోషముతో ''నాకు పరమపదమును గ్రహింపవలసినదని'' ప్రార్థించెను. వెంటనే స్వామి ''కూరేశా! నీకా సంశయమక్కరలేదు. నీకు, నీకుసంబంధించిన వారికిని కూడా

---

1. తి మొ 10 9 1

పరమపదము నిశ్చయము'' అని కూరేశులకు మోక్షమిచ్చిరి.

ఈ విషయమును తెలిసికొనిన రామానుజులు కూరేశులను వదలి జీవించుట బాధగా తోచినను ''నాకు కూరేశుల సంబంధము కలదు కనుక మోక్షము నిశ్చయము'' అని సంతసించిరి. వెంటనే కూరేశుల వద్దకు వచ్చి ఆ సమయమున ద్వయ మంత్రమును బోధించిరి. అనంతరము ఆచార్యుల పాదపద్మములకు సాష్టాంగ ప్రణామములాచరించి భగవద్ధ్యానముతో పరమపద ప్రాప్తి నొందిరి.

ఇంతటి మహనీయతగల కూరేశమిశ్రులను శిష్యబృందమీ విధముగా స్తోత్రము చేయుదురు.

శ్రీవత్సచిహ్నమిశ్రేభ్యో నమోవాక మధీమహే।
యదుక్తయ స్త్రయీకంఠే యాంతి మంగళ సూత్రతామ్ ॥

''ఏ మహనీయుని వాక్కులు వేద త్రయియను కాంతయొక్క కంఠమునందు మంగళసూత్రముగా అగుచున్నవో అటువంటి కూరేశులనునామాంతరముగల శ్రీవత్సాంక మిశ్రులకు నమోవాకములు''.

**2.2 కూరేశమిశ్రులపై భగవద్రామానుజ ప్రభావము :-**

భగవద్రామానుజులకు ప్రియశిష్యుడై, దాసాను దాసుడై తన జీవితమంతటిని ఆయన సేవలో గడిపిన మహామనీషి కూరేశమిశ్రులు మిశ్రులకు గల ఆచార్యాభిమానము వర్ణనాతీతము. అంతటి మహాభక్తులగు కూరేశమిశ్రులపై రామానుజుల ప్రభావము అపారముగనున్నది. మిశ్రులపై గల రామానుజ ప్రభావము స్థాలీపులాకముగ నిచట పరిశీలింప బడుచున్నది.

ఒక వ్యక్తిపై ఇంకొక వ్యక్తి ప్రభావమెంత కలదని నిర్ణయించుటకు అనేకాంశములను పరిగణన లోనికి తీసుకొనవలసి వచ్చును ప్రభావితుడైన వ్యక్తికి ప్రభావింప జేసిన వ్యక్తికి గల సంబంధము

ప్రభావితుడైన వ్యక్తికి గల సామాన్య సంస్కారము, విద్యావిషయకమగు సంస్కారము - ఈ విషయములను క్షుణ్ణముగ పరిశీలించినగాని అతడిపై ఎంత ప్రభావమున్నదను అంశమును నిర్ధారణ చేయుటకు వీలుపడదు.

ఇచట ప్రభావమును నెఱపినది భగవద్రామానుజులు. వారు వైష్ణవ ధర్మమును దిగంతవ్యాప్త మొనర్చిన మహనీయులు. కనుక వారి ప్రభావము సమాజముపై నుండుటలో ఆశ్చర్యము లేదు. అందులోను ఎన్నియో సంవత్సరములు వారికి సహచరులుగ నుండి వైష్ణవ ధర్మ ప్రచారోద్యమమున తన జీవిత సర్వస్వమునే త్యాగము చేసిన మహానుభావులు కూరేశమిశ్రులపై వారి ప్రభావముండుటలో ఆశ్చర్యము లేదు. ఆ ప్రభావమును రెండు విధములుగ అంచనా వేయుటకు అవకాశమున్నది. 1. మిశ్రుల జీవితముపై రామానుజ ప్రభావము అందు మొదటిది 2. మిశ్రుల రచనలపై రామానుజుల ప్రభావము రెండవది. ఈ రెండు అంశములు ఇచట స్పష్టముగ ప్రతిపాదింప బడుచున్నవి.

**2.2.1 మిశ్రుల జీవితముపై రామానుజ ప్రభావము :-**

రామానుజుల సన్నిధిలో చిరకాలము జీవితము గడిపిన మిశ్రులు ధన్యాతిధన్యులనుటలో సందేహము లేదు. వారు లోకమునకు చాటి చెప్పిన వైష్ణవధర్మమునందలి ఉత్కృష్ట నియమములను అక్షరశః అనుసరించి ఆదర్శ శిష్యులుగా చరిత్రలో మిశ్రులు నిలబడి పోయిరి

వైరాగ్యమునకు స్వరూపమే భగవద్రామానుజులు. వారికి పరమ శిష్యులైన కూరేశమిశ్రులు కూడా ప్రాపంచిక విషయములపై ఎక్కువ అభిమానము పెంచుకొనక ఆచార్యులతో సమమైన వైరాగ్య సంపదను పెంపొందించుకొనగల్గిరి. కూరగ్రామాధిపత్యమున్నప్పటికిని వారు అహంకారమును పెంచుకొనక మహావైరాగ్య సంపన్నులై సహధర్మచారిణితో కలసి నిరంతరము శ్రీవైష్ణవ తదీయారాధన చేయుట ఇందుకు తార్కాణము.

శ్రీరంగమునకు పోవునపుడు మార్గమధ్యమున దొంగలు దోచుకుందురేమో! అని భయపడుచున్న శ్రీమతినుండి బంగారు పాత్రను తీసుకొని, అరణ్యములో విసిరివేసిన వారి తెగింపునకు ఆచార్యుల వైరాగ్యమే ముఖ్యకారణము.

తాను శ్రమలకు గురియైనను ఇతరులకు క్షేమమును కలిగించవలెనను ఆచార్యుల దృక్పథము తిరుక్కోట్టియూర్ రాజగోపురము నుండి అందరికు తిరుమంత్రమును ఉపదేశించుటలో ప్రస్ఫుటమగుచున్నది. గురూపదేశమును ధిక్కరించిన తాను నరకమునకు పోయినను తిరుమంత్ర ప్రభావముచే ఎందరో జీవులు మోక్షమును పొందుదురు గదా! అను రామానుజుల త్యాగభావన శిష్యుడగు కూరేశ మిశ్రులపై ఎనలేని ప్రభావమును చూపినది. చోళరాజు రామానుజుల కపకారము తలపెట్టినపుడు భటులను తానే రామానుజుడనని నమ్మించి సభకేగి గురు ప్రాణ రక్షణ మొనర్చుట కూరేశమిశ్రుల ఆచార్య పారమ్యమునకు త్యాగ నిరతికి మచ్చుతునకగా నిలిచినది.

ఇట్లు కూరేశమిశ్రుల జీవితముపై రామానుజ ప్రభావమును ఎన్నో సందర్భములలో నిరూపించవచ్చును.

**2.2.2 రచనలపై రామానుజప్రభావము :-**

కూరేశమిశ్రుల రచనలన్నింటిలోను రామానుజదర్శన ప్రభావమెంతగనో ఉన్నది. ప్రత్యేకించి ఈ దిగువపేర్కొన్న సందర్భములలో అది స్పష్టమగుచున్నది.

పురుషకార స్వరూపిణియగు లక్ష్మీదేవిని శరణాగతి గద్యమున రామానుజులు " దేవదేవ దివ్య మహిషీం "[2] అని పేర్కొనగా శ్రీస్తవమున కూరేశ మిశ్రులు -

---

2 శ.గ. 1

''తాం దేవ దేవ మహిషీం శ్రియ మాశ్రయామః''[13]

అని వర్ణించుటలో మిశ్రులపై రామానుజ ప్రభావమెంత కలదో అర్థము చేసికొనవచ్చును.

అట్లే శరణాగతి గద్యమున భగవదపచార, భాగవతాపచార, అసహ్యాపచారములను రామానుజులు కీర్తించగ కూరేశమిశ్రులు అతిమానుషస్తవమున -

''అద్యాపి నాస్త్యుపరతి స్త్రివిధాపచారాత్''[14]

అని త్రివిధాపచారములను పేర్కొనుట ఆయనచే ప్రభావితుడగుట వలననే యని తెలియుచున్నది.

ఇట్లు కూరేశమిశ్రుల రచనలను పరిశీలించిన భావములందును, భాషలోను, పద ప్రయోగములందును రామానుజ ప్రభావమెంతో కలదని స్పష్టమగుచున్నది.

**2.3 రచనలు :-**

**2.3.1 వైకుంఠస్తవము :-**

శ్రీవత్సాంకులు రచించిన పంచస్తవములలో మొదటిది శ్రీవైకుంఠస్తవము. ఇందు నూట ఒక్కశ్లోకములు కలవు. ఈ శ్లోకములన్నియు దాదాపు పూర్తిగా వసంతతిలకా వృత్తములో అమరియున్నవి. శ్రుతి ప్రతిపాద్యమైన పరత్త్వమును విశిష్టాద్వైత సిద్ధాంత పరముగ వివరించి వైకుంఠమునందలి నిత్యముక్తులు వెలసియుండుస్థితిని, పరమపదనాథుని వర్ణించుచు మోక్షమునకు భక్తియే ప్రధానమని ఈ స్తవమున తెలియజేసిరి.[15]

---

13 శ్రీ స్త 10

14 అ స్త 59

15 వై స 16

పరతత్త్వమగు శ్రీమన్నారాయణుడవు నీవే వేదసార రూపుడవు ఓంకార పదవాచ్యుడవగు పరమేశ్వరుడవు నీవే. ''అకారో విష్ణు రుచ్యతే''[16] ''అక్షరాణాం అకారోస్మి''[17] అనుచు వైకుంఠనాథుని యందు వేదాభిముఖ్యమును ఈ క్రింది శ్లోకములో వివరించుచున్నారు.

యః ఖల్వణో రణుతరో మహతో మహీయాన్
ఆత్మాజనస్య జనకో జగతశ్చ యో భూత్।
వేదాత్మక ప్రణవకారణ వర్ణవాచ్యం
తం త్వాం వయం తు పరమేశ్వర మామనామః॥[18]

**2.3.2 అతిమానుషస్తవము :-**

శ్రీవత్సాంకుల పంచస్తవీ రచనలో రెండవ రచనగా పేర్కొన దగినది అతిమానుషస్తవము. విభవావతారమందాసక్తులై శ్రీవత్సాంకులు ఈ స్తవమును రచించిరి ఈ స్తవమునందు అనేక అవతారముల ప్రసక్తి యున్నప్పటికిని ప్రధానముగా పరిపూర్ణావతారములైన రామకృష్ణా ద్యవతారములనే పేర్కొనినారు. శ్లోకములు కూడ చాలా వరకు ఈ రెండు అవతారములకు సంబంధించియే యున్నవి. మానవాతీతములైన రామకృష్ణుల లీలలను వర్ణించుటచే అతిమానుషస్తవమని దీనికి పేరేర్పడినది. ఈ స్తవము నందు మొత్తము అరువది యొక్క శ్లోకములు కలవు.

కూరేశులు రచించిన పంచస్తవములు దేనికది సాటియైనను ఈ స్తవమందు శబ్దగుంభనము అర్థగాంభీర్యము రమణీయత నిస్సమాభ్యధికమై యుండును. తాను మానవుడై పుట్టి ''రామం

16 పా సం చ 23 10
17 భ గీ 10 33
18 వై స 19

దశరథాత్మజమ్''[19] అని; '' ఆత్మానం మానుషం మన్యే''[20] అని '' అహం వో బాంధవో జాతః''[21] అన్నప్పటికిని శివధనుర్భంగ మొనరించుట. జటాయువునకు మోక్షమొసగుట, సప్తతాళములను ఒకే బాణముతో భేదించుట, సముద్రమున వారధి కట్టుట, ఉదరమున చతుర్దశ భువనములను ధరించుట, గోవర్ధనగిరి నెత్తుట, సాందీపుని పుత్రుని బ్రతికించుట, విశ్వరూపమును దర్శింప జేయుట, మొదలగు దివ్య చేష్టితములన్నియు మనమున తలచుటకు కూడా దుర్లభములై యుండుట వలన రెండు విభవావతారముల యందును ఆయన దివ్యత్వము నిరూపింపబడినది. భగవంతుని అతిమానుషలీలలన్నియు ఈ స్తోత్రమున వర్ణింప బడినవి.

**2.3.3 సుందర బాహుస్తవము :-**

పంచస్తవిలో మూడవ కృతి సుందరబాహుస్తవము శ్రీవత్సాంకులు సుందరగిరి (తిరుమాలిరుంశోలై) అను దివ్య తిరుపతి యందు వెలసియున్న అర్చావతారమూర్తియగు సుందరబాహు స్వామిని నఖ శిఖ పర్యంతము వర్ణించుచు నూటముప్పది రెండు శ్లోకములతో ఈ స్తవమును రచించిరి. ఈ స్తవమునందు వేదాంతశాస్త్రపాండిత్యము చాలా ఉత్కృష్ట స్థాయిలో నున్నది. ఇందలి శ్లోకములు కొన్ని కేవలము ఉపనిషదర్థములతోనే గాక ఉపనిషద్వాక్యములతో కూడ రచింపబడినవి. చూడుడు -

'పతిం విశ్వస్యాత్మేశ్వర' మితి పరం బ్రహ్మ పురుషః
పరం జ్యోతిస్తత్త్వం పరమితి చ నారాయణ ఇతి ।
శ్రుతిర్బ్రహ్మేశాదీం స్తదుదిత విభూతీం స్తు గృణతీ
యమాహోరూఢ శ్రీ స్స వనగిరిధామా విజయతే ॥[22]

19 వా రా యుద్ధ । 20 ।
20 అందులోనే । 20 । ।
21 వి పు 5 । 3 । 3
22 సుం స । 7

ఇందు గిరి వర్ణనముతో ప్రారంభించి సుందరబాహుస్వామిని తనివి తీర వర్ణించిరి. విశిష్టాద్వైత సిద్ధాంత పరముగా ఈ స్తవము ఒక ప్రత్యేకతను సంతరించు కొన్నది. అనేక సంప్రదాయార్థముల గుంభనముతో నూట ముప్పది రెండు శ్లోకములతో పంచస్తవములలోను అతి పెద్ద స్తవముగా రచింపబడినది.

ఈ పంచస్తవములలో చాలావరకు ఉపనిషద్వాక్యసారాంశము, ఆళ్వారుల దివ్యప్రబంధ విషయములతో అర్థసాదృశ్యము కనుపించుచున్నది.

**2.3.4 వరదరాజస్తవము :-**

ఆచార్యుల ఆజ్ఞచే నేత్రములను పొందుటకై కంచిలో వెలసియున్న వరదరాజస్వామిని స్తుతించుచు రచించిన స్తవమే వరదరాజస్తవము. ఈ స్తవములో కూరేశుల కవితా ప్రతిభ, భావనాశక్తి అనన్యసామాన్యమై యున్నది. ఇందు నూటరెండు శ్లోకములు కలవు. కూరేశమిశ్రులు ఒక్కొక్క దశకము ఒక్కొక్క వృత్తములో వర్ణించి, సర్వవృత్తములలోను కవితా సరస్వతిని ఆరాధించెను ''అన్యదేవాస్య గాంభీర్యం అన్యద్ధైర్యం మహీపతేః''[23] అన్నట్లు ఈ స్తవములోని ప్రపత్తి నిష్ఠకొక ప్రత్యేకత గలదు. ఈ స్తవమును మంత్రరత్నములకు వివరణముగా పేర్కొనవచ్చును. ఇందు ''శ్రీనిధిం నిధి మపార మర్థినాం[24]'' అను శ్లోకముచే మంత్రరత్నస్థమగు శ్రీమత్పదమును వర్ణించి, నారాయణ పదైక దేశమగు నారపదమున కర్థముగా స్వామి నివాసమగు కరిగిరిని ప్రథమ దశకముచే వర్ణించి, స్వామివారి కళ్యాణ గుణములను ద్వితీయ దశకముచే వర్ణించిరి. కృతావతారుడగు వరదరాజ స్వామినే నారాయణ శబ్దార్థముగా ప్రతిపాదించి ఆ చరణములందే శరణు పొందదలచి -

---

23 కు అ పు. 38

24 వ స 2

అనుజో రావణస్యాఽహం తేన చాస్మ్యవమానితః।
త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః॥[25]

అని శ్రీరాముని విభీషణుడు శరణు పొందినట్లు సమస్త దోషనిలయుడనగు నేను నిన్నే శరణముగా వరించితిని అని ' వరద! శరణమిత్యహం త్వాం వృణే.[26] ''వరద ముదయంగతిం త్వాం వృణే[27]'' అని శరణుజొచ్చిరి.

ఈ స్తవము రచించునాటికి కూరేశులు పరిపక్వ హృదయులై బ్రహ్మాది పదములను కూడా తృణీకరించు దశకు వచ్చిరి.[28]

కనుకనే ఈ స్తవమందు పలుతావుల '' ప్రసహ్య మాం ప్రాపయ దాస్య మేవ తే''[29] ''కదా విధాస్యే వరివస్యనం తవ''[30] అని మోక్షమునందు సైతము భగవద్దాస్యమునకు ఆరాటపడిరి.

ఈ స్తవమందు ఒక్కొక్క దశకము ఒక్కొక్క వృత్తమున కూర్చబడిన విధము క్రింద పేర్కొనబడుచున్నది.

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రథమదశకము | - | రథోద్ధతా |
| 2. | ద్వితీయదశకము | - | శిఖరిణీ |
| 3. | తృతీయదశకము | - | స్వాగతా |
| 4. | చతుర్థదశకము | - | ఉపజాతి |
| 5. | పంచమదశకము | - | ప్రహర్షిణీ |

25. వా. రా. యుద్ధ. 19 42
26. వ. స్త. 82.
27. అందులోనే. 83
28 అందులోనే. 81.
29 అందులోనే. 93.
30 అందులోనే 96

| | | | |
|---|---|---|---|
| 6. | షష్ఠదశకము | - | మన్దాక్రాన్తా |
| 7. | సప్తమదశకము | - | స్రగ్ధరాది వృత్తకదంబమ్ |
| 8. | అష్టమదశకము | - | వసంతతిలక |
| 9. | నవమదశకము | - | గౌరీ |
| 10. | దశమదశకము | - | వంశస్థమ్ |
| | రామానుజాంఘ్రి | - | వసంతతిలక |

**2.3.5 శ్రీస్తవము :-**

అఖిల జగన్మాత భగవన్నిరూపిక యగు లక్ష్మీదేవిని గూర్చి కూరేశమిశ్రులు రచించిన చివరి స్తోత్రము శ్రీస్తవము. శ్రీదేవి పురుషకార స్వరూపిణి. శ్రీదేవి లేక భగవంతుని నిరూపించుట సాధ్యము కాదు. శ్రీదేవిని విడిచియుండు స్థితి భగవంతునకు లేదు. కనుకనే పరాశర భట్టరు భగవంతుని స్వరూపము ''త్వదాశ్లేషోత్కర్షా ధ్ధ్వతి''[3] అన్నారు. లక్ష్మీనివాసము విష్ణువు వక్షఃస్థలము కదా! అందుకే భగవద్రామానుజులు శరణాగతి గద్యములో చెప్పినట్లుగా శ్రీమన్నారాయణునకు అభిమత ములైన యనురూపములై అసంఖ్యేయ కళ్యాణ గుణములుగల నిత్యానపాయిని, దేవదేవ దివ్య మహిషి, నిరుపాధిక లోకజనని, అశరణ్యశరణ్యయగు శ్రీదేవిని పదునొకండు శ్లోకములచే స్తోత్రము చేసిరి

ఇందలి శ్లోకములు అతివిలక్షణశైలిలో పరమ గంభీరమైన కూరేశుల కవితా నైపుణ్యమునకు భావనా పటిమకు నిదర్శనములు. ఇందు కూరేశుల భావనలు అనిదం పూర్వములు.

సమస్తలోకాధిపతియగు శ్రీమన్నారాయణుడు శ్రీదేవి కను సన్నలలో ఎట్లు వర్తించునో అతిగంభీరముగా వర్ణించిన విధము కడు

3) శ్రీ గు ర కో 28

రమణీయము.[32] భగవద్వ్యతిరిక్త విషయములలో స్తోత్ర లక్షణమును ఇట్లు పేర్కొనినారు. "అన్యత్ర అతద్గుణోక్తిః"[33] అన్నట్లు లేని గుణములను ఉన్నట్లు చెప్పటయు, ఉన్న గుణములను పూర్తిగా వర్ణించి చెప్పటయు స్తోత్రమనబడును. కాని నీ యందు లేని గుణములు లోకములో ఎక్కడను లేవు. ఉన్న పూర్తిగా వర్ణించుటకు బ్రహ్మాదులకు కూడ శక్యము కాదు.[34] అయినను చకోరపక్షివలె నా దాహార్తి తీరువరకు నా శక్తి కొలది వర్ణించి కృతార్థుడనగుదును.[35]

అయినను భాగీరథిని పోలిన నీ కళ్యాణ గుణ ప్రశస్తిని నావంటి అల్పజ్ఞుడు ప్రశంసించుటకు వెనుకాడడు. ఏలయన, దాహముగొన్న శునకము భాగీరథినంటితినేయని సిగ్గు పడునా? కేవలము దప్పిక తీర్చుకొనును. అని కూరేశులు స్వనైచ్యాను సంధానముచే శ్రీదేవిని వర్ణించిన విధము అతి విలక్షణము,[36] కడు మధురము. ఇందలి భావనలు అద్వితీయములు.

**2.3.6 యమక రత్నాకరము :-**

కూరేశమిశ్రులు 'యమకరత్నాకర' మనెడి అద్భుతమైన గ్రంథము కూడా రచించి స్వయముగ దానికి వ్యాఖ్యానము వ్రాసినట్లు తెలియుచున్నది.[37] ఇది కృష్ణావతార చరిత్రమును విపులముగ తెలియపఱచు యమకమయమైన సంస్కృత కావ్యము. ఇందు పదహారు

32 శ్రీ. స్త. ౧.

33 శ్రీ. రం. స్త. ౧.౹౨.

34. శ్రీ స్త 3.

35 అందులోనే. 4

36 అందులోనే. 5.

37 ప్రణిపత్య పరమ పురుషం శ్రీవత్సాంకః పరాశరాన్యాహ్వః

స్వయమేవ యమక రత్నాకర వివృతిం కర్తు మారభతే ।

య ర ।

ఆశ్వాసములు కలవు. ఇది వ్యాఖ్యాన సహితముగా ఆంధ్రలిపిలో ముద్రించబడినది. ఇది యొక మహోత్కృష్టమైన రచన. మూలమును వ్యాఖ్యానమును కూడా కూరేశులే రచించిరని ప్రసిద్ధిగలదు. కొందరు ఈ కావ్యము కూరేశుల కుమారులైన పరాశర భట్టార్యులు రచించినట్లు చెప్పదురు.

**2.3.7 కూరేశ విజయము :-**

శ్రీవత్సాంకులు 'కూరేశ విజయ' మను ఒక చిన్న కావ్యము రచించిరని కొందరి అభిప్రాయము. ఈ కావ్యము చోళరాజు మహాసభలో 'శివాత్పరతరంనాస్తి' అను విషయమును ఖండించుచు విష్ణుపరత్త్వమును గూర్చిన ఉపన్యాసమాధారముగా వారి శిష్య ప్రశిష్యులలో ఎవరో ఒకరు రచించియుండవచ్చును. ఈ కావ్యమును కూరేశులు రచియింపలేదనుటకు ఇందలి ''విద్యారణ్యో క్షితత్వాత్''[38] అను శ్లోకమే తార్కాణము. కారణము - అనేక ఉపనిషత్తులకు భాష్యము రచించిన విద్యారణ్యస్వామి ఇచట ఉదాహరింపబడిరి. వీరు వేదాంత దేశికులకు సమకాలికులు. అట్లయినచో ఈ గ్రంథకర్త కూరేశమిశ్రులని నిర్ణయించుట పొరబాటు. వేదాంత దేశికులకు సమకాలికులగు విద్యారణ్య స్వామి కూరేశుల కన్నను రెండు శతాబ్దముల తరువాత వారు. కనుక ఈ గ్రంథకర్త అంత కన్నను అర్వాచీనుడని స్పష్టమగుచున్నది.

**2.3.8. ఇతర రచనలు :-**

కూరేశమిశ్రులు బుద్ధిస్తవము, కూరేశవిజ్ఞాపనము, నారాయణాష్టకము అను రచనలు గావించినట్లు తెలియుచున్నది. కాని ఇంతవరకు అవి ఎచ్చటను ముద్రించినట్లు తెలియుటలేదు.

* * *

---

38 కూ. వి. 10.

# 3. తృతీయాధ్యాయము

విశిష్టాద్వైత సిద్ధాంత వ్యవస్థాపనమున తమ ఆచార్యులగు భగవద్రామానుజులకు చేదోడువాదోడుగ నిలచిన కూరేశమిశ్రులు ఆ సిద్ధాంత తత్త్వములను సమగ్రముగ ఆకళించుకొనిన మహామనీషి. సిద్ధాంత పరిజ్ఞానముతోపాటు భాష్యకారుల అన్తేవాసిత్వమున ఆయనకు శ్రీవైష్ణవ ధర్మసారము కరతలామలకమ్మైనది. మిశ్రుల జీవితాంతమున సంభవించిన అనేకానేక దుష్కర స్థితులలోగూడ ఆయనకు గల మహావైరాగ్యము ఆచార్యనిష్ఠ, శరణాగతి వైభవము, ఆయననొక ఆదర్శవ్యక్తిగా పరమవైష్ణవ శిరోమణిగా నిలబెట్టినవి. శ్రియః పతియందలి మహా విశ్వాసము, సునిశితమ్మైన బుద్ధివైభవము విశిష్టాద్వైత సిద్ధాంతమునగల తలస్పర్శి పాండిత్యము ఆయన జీవితమును ప్రభావిత మొనర్చినవి. మనసా, వాచా, కర్మణా తాను నమ్మిన సిద్ధాంతములను చమత్కార సంభరితముగా తన రచనలలో చొప్పించుటకు ఆయన ప్రయత్నము చేయవలసిన అవసరము కలుగ లేదు. అప్రయత్న సిద్ధములుగనే పంచస్తవిలో ఆయా సందర్భములలో విశిష్టాద్వైత తత్త్వములు పొంగి పొర్లినవి. కొన్నిచోట్ల శ్రీవైష్ణవ సంప్రదాయ సర్వస్వము ఆయన కవితలో చోటుచేసికొన్నది. విశిష్టాద్వైత

సిద్ధాంతములకు, వైష్ణవ ధర్మమునకు పంచస్తవి ఒక చక్కని విపంచియైనది. ఈ అధ్యాయమున సంగ్రహముగ ప్రధానములైన విశిష్టాద్వైత సిద్ధాంతములను శ్రీవైష్ణవ ధర్మములను పేర్కొని తరువాత అవి పంచస్తవిలో ఎట్లు ప్రతిపాదింపబడినవో సంగ్రహముగ నిరూపించబడు చున్నది.

**3.1. విశిష్టాద్వైతసిద్ధాంతము :-**

విశిష్టాద్వైతసిద్ధాంతము అతి ప్రాచీనమైనది. భగవత్ రామానుజాచార్యులు ఈ సిద్ధాంత స్థాపకులు కారు, కేవలము వ్యవస్థాపకులు మాత్రమే. భగవద్రామానుజులు అంతకు పూర్వమే ఉన్న ఈ మతమును సంస్కరించి అవిచాల్యమై కల్పాంత స్థాయిగా ఉండునట్లు నెలకొనజేసిరి. ఈ మతము ప్రకారము శ్రీమన్నారాయణుడే ప్రధానదైవము. విష్ణువు తప్ప దేవతాంతర ఉపాసన ఇందు నిషిద్ధము మోక్షసాధనములలో భక్తియే ప్రధాన సాధనము.

విశిష్టాద్వైత సిద్ధాంతమును ఇంకను సంస్కరించి జగదుపకారము గావించుటకు ఎందరో మహానుభావులవతరించిరి అందు నాథముని, యామునాచార్యులది విశిష్టస్థానము. నాథమునులు శ్రీవైష్ణవ మతమునకు పునాదులు వేసి అది బాగా వేళ్లూనుకొని స్థిరపడునట్లు గావించినారు. అందువలననే "నాథోపజ్ఞం ప్రవృత్తమ్"[1] అనునట్లుగా ఈ మతము ప్రసిద్ధి చెందినది. యామునాచార్యులు కూడా ఈ సిద్ధాంతవ్యాప్తికి విశేష కృషి సల్పిరి. వీరు తమ కర్తవ్యములో భాగముగ అనేక రచనలతో ఈ మత ప్రచారమును గావించి విశిష్టాద్వైతసిద్ధాంతమునకు శాశ్వతత్వమును సంపాదించినారు యామునాచార్యులకు పరోక్ష శిష్యులైన భగవద్రామానుజులు బ్రహ్మసూత్రమునకు విపుల వ్యాఖ్యయగు శ్రీభాష్యమును రచించిరి

1 త ము త అద్రవ్యసర: । 30

పిమ్మట గీతా భాష్యము, వేదార్థ సంగ్రహము మున్నగు ప్రస్థాన గ్రంథములను రచించి ఈ మతమవిచాల్యమై కల్పాంత స్థాయిగా నుండునట్లు సుస్థిరమొనర్చిరి.

**3.1.1. విశిష్టాద్వైత శబ్దార్థము :-**

విశిష్టాద్వైతమను పదము రామానుజాచార్యుల చేతగాని అంతకు ముందుగల ఆచార్యులచే గాని ప్రయోగింపబడలేదు. రామానుజులు శ్రీభాష్యమునందు ''విశిష్ట ద్రవ్యముల ఐక్యమే **సామానాధికరణ్యము'' అని పేర్కొనెను[2]. రామానుజుల తరువాత వారిలో** క్రీ.శ. 1150కి చెందిన వరద నారాయణ భట్టార్యులు న్యాయ సుదర్శనమను గ్రంథమున 'ద్రవ్యైక్య' మను పదమును 'విశిష్టైక్య' మను అర్థమున ప్రయోగించిరి[3]

క్రీ.శ. 1300కి చెందిన సుదర్శన సూరి తను రచించిన శ్రుత ప్రదీపిక, తాత్పర్య దీపిక లందు విశిష్టాద్వైత పదమును ప్రథమముగా ప్రయోగించెను[4] రామానుజులు ప్రయోగించిన ఐక్యమను పదమును వివరించుచు సుదర్శన సూరి - ''కార్య కారణ నిబంధన మైక్యం నామ అవస్థాద్వయాపన్న చిద్విశిష్ట వస్త్వైక్యమ్ ఏవముభయవిధ విశేషణ విశిష్ట

---

విశిష్ట ద్రవ్యైక్య మేవ హి సామానాధికరణ్యస్యార్థ
శ్రీ భా పు । 84

ఉత్తరత్ర కార్యావస్థః కారణావస్థశ్చ పరమాత్మా ఏక ఏవేతి భాష్యేణ ఇదమేవ వాక్యం కార్యకారణ ద్రవ్యైక్య ప్రతిపాదన పరమిత్యపి వ్యాఖ్యాతమ్
న్యా సు పు । 3 । 7

) ఏవం సతి విశిష్టాద్వైతపరత్వే స్పష్ట ముపక్రమోపసంహారాది లింగషట్కమ్
శ్రు ప్రదీ - Śribhāṣya With Ten commemtaries. p.958.

। షడ్విధ తాత్పర్య లింగ మద్వైత విషయ మిత్యేత దభ్యుపేతమ్ తత్తు న నిర్విశేషాద్వైత విషయమ్ అపి తు విశిష్టాద్వైత విషయమ్
తా దీ పు 46

ధర్మైకత్వమైక్య శబ్దార్థః విశిష్టాంతర్భావ ఐక్యమిత్యర్థః''[5] అని పేర్కొనెను. న్యాయ సిద్ధాంజన వ్యాఖ్యానమగు రత్నపేటికయందు ఐక్య శబ్దము క్రింది విధముగా వివరింపబడినది.

''అశేష చిదచిద్విశిష్ట నిష్ఠ భేద ప్రతియోగితానవచ్ఛేదక
తాదృశ ధర్మవత్త్వం విశిష్టైక్యమితి ఫలితమ్।
ఇదమేవ విశిష్టాద్వైత మిత్యుచ్యతే''[6]

విశిష్టాద్వైత శబ్దమును రెండు విధములుగా వ్యుత్పాదనము చేయవచ్చును. 1) విశిష్టస్య అద్వైతమ్ 2) విశిష్టయోః అద్వైతం. విశిష్టస్య అద్వైతమ్ అను వ్యుత్పత్తిని వేదాంతదేశికులు ఈ విధముగా వివరించిరి.

''అశేష చిదచిత్ప్రకారం బ్రహ్మైకమేవ తత్త్వమ్।
తత్ర ప్రకార ప్రకారిణోః ప్రకారాణాం చ మిథోఽత్యంత
భేదేపి విశిష్టైక్యాది వివక్షయైకత్వ వ్యపదేశః,
తదితర నిషేధశ్చ।[7]

''విశిష్టయోః అద్వైతమ్'' అను వ్యుత్పత్తిని రామానుజులు శ్రీభాష్యమున క్రింది విధముగా నిర్వచించిరి -

''అతః స్థూల సూక్ష్మ చిదచిత్ప్రకారం బ్రహ్మైవ
కార్యం కారణం చేతి బ్రహ్మోపాదనం జగత్ సూక్ష్మ
చిదచిద్వస్తు శరీరకం బ్రహ్మైవ కారణమితి।[8]

### 3.1.2 ఈశ్వరుడు :-

ఈశ్వరుడనగా సర్వనియామకుడు అనగా సకల జగత్సృష్టి స్థితి

---

5. శ్రు. ప్రదీ. పు. 132.

6. న్యా. సి. ర. పే. పు.4

7 న్యా. సి. పు. 2

సంహారములకు కారణము పరబ్రహ్మయైన ఈశ్వరుడే సర్వకారణ భూతడు, షాడ్గుణ్యపరిపూర్ణుడు సకలకళ్యాణ గుణాశ్రయుడు, సర్వజ్ఞుడు సర్వాంతర్యామి సర్వవ్యాపి అయిన శ్రీమన్నారాయణుడే ఈశ్వరుడు ఇతడే ప్రపంచమునకు ఉపాదాన కారణము నిమిత్త కారణము పరబ్రహ్మయనబడు ఈశ్వరుడు ఆనంద స్వరూపుడు, రసస్వరూపుడు [9]

**3.1.3 జీవుడు :-**

జీవుడు నిర్మలుడు, జ్ఞానానంద స్వరూపి, జీవాత్మ నిత్యమైనది [10] జీవుని స్వరూపము అణు పరిమాణము గలది అణుపరిమాణముగల ఈ జీవుడు మనస్సు చేత మాత్రమే తెలుసుకొనదగిన వాడు [11] జీవాత్మకే 'చిత్' అని కూడా వ్యవహారము

చిత్పదార్థములనబడు జీవులు నిత్యులనియు, ముక్తులనియు, బద్ధులనియు మూడు విధములుగా నున్నారు

నిత్యులనగా భవసాగరమనెడు సంసారబంధమెన్నడును లేక జ్ఞాన స్వరూపులై ఎల్లప్పుడు నిత్యవిభూతి యనబడు వైకుంఠము నందుండు [12] అనంతుడు, గరుడుడు విష్వక్సేనుడు మున్నగువారు

ముక్తులనగా మొదట సంసారమునందుండి తరువాత

---

Visistadvaita is the philosophy of religion that recognises the eternal value of beauty and recognises Brahman as the beautiful and blissful

-P N Srinivasachari, Philosophy of Visistadvaita p 219

10 అజో నిత్యః శాశ్వతోఽయం పురాణః
క ఉ 2 । 8

11 ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః
ముం ఉ 3 । 9

12 నిత్యో నిత్యానామ్
క ఉ 5 । 13

బంధముక్తులై మోక్షము నొందినవారు. వీరు మోక్షము కొరకు ఎల్లప్పుడు భగవత్సమాశ్రయణమునే కోరువారు. లీలావిభూతియనబడు ఈ లోకమున అనాదిగా తాము చేసిన పుణ్యపాప కర్మములకు బాధ్యులై ప్రారబ్ధముల ననుభవించుచు భగవత్సేవా నిరతులై ఆచార్యోపదేశముచే జ్ఞానమును పొంది భక్తితత్పరులై పుణ్య పాపములను పోగొట్టుకొని సమస్త బంధములను వీడి మోక్షమును పొందినవారు. శుక, పరాశర, నాథముని, కూరేశాదులు ముక్తులు.

బద్ధులనగా అనాదిగా తామొనరించిన కర్మ బంధముచే ప్రకృతి సంబంధమునందు సంసారులై ఆ బ్రహ్మస్తంబ పర్యంతమున్న జీవాత్మలు.[3] మోక్షమునందని దేవమానవ తిర్యక్ స్థావరరూప సమస్త జీవరాసులు బద్ధులే యగుదురు.

### 3.1.4 ప్రకృతి :-

జడ పదార్థరూపమగు అచేతన ద్రవ్యమే ప్రకృతి యనబడును త్రిగుణాత్మకమైన ఈ ప్రకృతి జ్ఞానరహితమై మార్పు చెందునట్టిదై యుండును. ప్రకృతినే 'అచిత్' అని కూడా వ్యవహరింతురు. ప్రకృతి శుద్ధసత్త్వము, మిశ్రసత్త్వము సత్త్వశూన్యము అని మూడు విధములుగా నున్నది.

శుద్ధ సత్త్వమనగా కేవల సత్త్వా శ్రయమగునది. రజస్తమోగుణ సంబంధ రహితమైనది. శ్రీమన్నారాయణుని నివాసస్థానమగు వైకుంఠము నందలి గోపుర ప్రాకార మంటపాదులన్నియు శుద్ధ సత్త్వ మయములు. నిత్యులకు ముక్తులకు ఇది నివాస స్థానము.

చరాచరాత్మకమగు ఈ భూమండలమంతయు మిశ్ర

3 ఆబ్రహ్మస్తంబ పర్యన్తా జగదంతర్వ్యవస్థితాః
ప్రాణినః కర్మ జనితా స్సంసార వశవర్తినః ॥

సత్త్వమనబడును. ఇది సత్త్వరజస్తమో రూప త్రిగుణములకు నెలవైనది. రజస్తమోగుణముల ప్రభావము వలన ఇది జీవాత్మ అనుభవించు జ్ఞానాందములకు ప్రతిబంధక మగుచున్నది. కావున దీని 'కవిద్య' యని పేరు. మనకు నేత్రగోచరమగునటుల వివిధ ప్రపంచ సృష్టి చేయుట వలన 'మాయ' యనియు వ్యవహరింపబడుచున్నది.

సత్త్వ శూన్యమనగా కాలము. సత్త్వశూన్యమనగా సత్త్వ రజస్తమోరూప త్రిగుణ శూన్యమని అర్థము. కాలము ప్రకృతికిని, ప్రకృతి సంబంధములగు పదార్థములకును మార్పును కలుగజేయుచున్నది.

ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి ఈ మూడింటిని తత్త్వత్రయమందురు[14]

### 3.1.5 ప్రపంచ సత్యత్వము :-

జగత్తునకు పరమాత్మకు అవినాభావ సంబంధమున్నది. ఈ ప్రపంచమంతయు ఈశ్వరుని శరీరమని భగవంతుడు శరీరి యని శ్రుతులుద్ఘోషించుచున్నవి.[15] పరమాత్మ నిత్యవిభూతి నాయకుడు. ప్రపంచమునకు ఈశ్వరుడు ఉపాదాన కారణము, నిమిత్త కారణము కూడా. ఈశ్వరుడు నిత్యుడగుట వలన అతనిలో ఐక్యమందియుండు ప్రపంచమంతయు సత్యమే. బ్రహ్మయే జగత్తున కంతకు కారణభూతుడు. పరమాత్మయే జగత్తుగా పరిణమించినది.[16] బహ్మ సత్యము కనుక బ్రహ్మాత్మకమగు ప్రపంచము కూడా సత్యమే

14 తత్త్వత్రయమావతు - చిత్తుమ్, అచిత్తుమ్, ఈశ్వరునుమ్
త త్ర 2

15 యస్య పృథివీ శరీరమ్ యస్యాప: శరీరమ్, యస్యాత్మా శరీరమ్
బృ ఉ 3 7 4

16 తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి
ఛాం ఉ 6 2 3

**.1.6 సంసారము :-**

జీవుడు చేయు పుణ్యపాపములననుభవించుటకు భగవత్ ౦కల్పముచే పొందబడిన ప్రకృతి పరిణామమగు శరీరముయొక్క ౦బంధమే సంసారమనబడును.

**.1.7 మోక్షము :-**

శుద్ధ సత్త్వమయమై ప్రకృతి మండలమునకు ఆవలనున్న ివ్యలోకమునకే వైకుంఠమనియు, నిత్యవిభూతియనియు, పరమపదమనియు వ్యవహారము కలదు. నిత్య విభూతి యనగా నాశరహితమైనది ఈ వైకుంఠమున రజస్తమోగుణముల సంబంధములుండవు. కేవలము సత్త్వాశ్రయములే. మోక్షప్రాప్తి నందిన జీవాత్మలకు పునర్జన్మ ఉండదు. మోక్షప్రాప్తినందినవారు వైకుంఠమునందు సాయుజ్యపదవినే యభిలషింతురు.

**3.1.8 మోక్షోపాయములు :-**

మోక్షమును కర్మమార్గము, జ్ఞానమార్గము, భక్తి మార్గము, శరణాగతి అను నాలుగు ఉపాయముల ద్వారా సాధింపవచ్చును మనమనుసరించు పై నాలుగు మార్గములచే ప్రీతినంది భగవంతుడు మనకు మోక్షమునను గ్రహించుచున్నాడు. ఇది భగవంతుని నిర్హేతుక కృపచే గలుగునని మనమూహింపవచ్చును.

**3.1.8.1. కర్మమార్గము :-**

యజ్ఞము, దానము, తపస్సు మొ॥ నిత్య నైమిత్తిక కర్మల నాచరించి మోక్షము నర్థించుట కర్మమార్గమనబడును వర్ణాశ్రమ సంబంధములైన ఈ నిత్య నైమిత్తిక కర్మలు మనిషిని పావనమొనర్చును మహర్షులు యోగులు ఈ మార్గము నవలంబింతురు

### 3.1.8.2 జ్ఞానమార్గము :-

కర్మయోగము క్రియోపదేశకము కాగా జ్ఞానయోగము క్రియారహితమగు మార్గము కాని మనస్సును ఏకాగ్రతతో భగవంతునిపై కేంద్రీకరించి తదేక ధ్యానముతో నుండవలెను. ఈ మార్గమున మోక్షమును సాధించవలెనన్న మనస్సునందలి కోరికల నన్నింటిని విడిచిపెట్టి ఎల్లప్పుడు ఆత్మానందమునే అనుభవించు స్థితప్రజ్ఞస్థితిలో ఉండవలెను.[17]

### 3.1.8.3 భక్తిమార్గము :-

మోక్షకారణ సామగ్రిలో భక్తియే శ్రేష్ఠమైనది.[18] విశిష్టాద్వైత దర్శన ప్రవర్తకులైన రామానుజాచార్యులు కర్మజ్ఞానాది యోగములు భక్తి యోగమునకంగభూతములేయని నిరూపించుచు మోక్ష-సాధనోపాయములలో భక్తికే పట్టము గట్టిరి ఆళ్వారులు కూడా తమ దివ్యప్రబంధ వాఙ్మయములో భక్తికే ప్రాధాన్యము నొసంగిరి మోక్షసాధనములుగా వేదములందు పేర్కొనబడిన కర్మ జ్ఞాన యోగములు జనసామాన్యమునకు దుర్లభములైనవి. భక్తి వాఙ్మయ నందనారామమున కల్పవృక్షముగా శ్రీమద్భాగవతము బహుళ ప్రచారమందినది భగవద్రామానుజులు తమ శ్రీభాష్య ప్రార్థనాశ్లోకమున-

"భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా"[19]

అని భక్తి మార్గ మాహాత్మ్యమును ప్రవచించియున్నారు

---

17 ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్।
అత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే॥
భ గీ 2 55

18 మోక్షకారణ సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ
వి చూ 3।

19 శ్రీ భా ।

### 3.1.8.4 శరణాగతి :-

ప్రపత్తి, న్యాసము, ఆత్మనిక్షేపము - ఇవి శరణాగతికి పర్యాయపదములు. మోక్షార్థికి జ్ఞాన కర్మయోగములకంటె భక్తియోగము సులభమార్గము. మోక్షోపాయమైన ఈ భక్తి మార్గము కూడ కష్టసాధ్యమగుట వలన, ప్రపత్తి సులభసాధ్య మోక్షోపాయము అని పెద్దలు పదేశించినారు. ప్రపత్తి అనగా తనను రక్షించు భారమంతయు భగవంతునియందే నిక్షేపించుట. జీవుడు ముముక్షువైనచో తన రక్షణ భారము శ్రియఃపతి యందుంచుట తప్ప ఇతర సాధనమేదియు లేదని, భగవంతుడు తప్పక రక్షించునని పూర్ణవిశ్వాసముంచి ఆయనే ఉపాయము ఉపేయమూ అని నమ్మి ఆయననే యాచించుట శరణాగతి దీనినే న్యాస విద్య అనియు అందురు.

"అనన్యసాధ్యేస్వాభీష్టే మహావిశ్వాసపూర్వకమ్।
తదేకోపాయతా యాచ్ఞా ప్రపత్తిః శరణాగతిః॥"[20]

తన అభీష్టము ఉపాయాంతరాసాధ్యమని తెలిసికొని మహావిశ్వాసముతో స్వరక్షణకై భగవంతుడే ఉపాయమని నిర్ణయించుకొని ఆయననే యాచించుట శరణాగతి అదే ప్రపత్తి

కర్మ జ్ఞాన భక్తులను ఆచరింప శక్తిచాలని వారు ప్రపత్తిని ఆశ్రయింతురు. ప్రపత్తి చేసినవారికి మిగిలినవన్నియు పరిత్యాజ్యములే

"ప్రపత్తేః క్వచిదప్యేవం పరాపేక్షా న విద్యతే।
సా హి సర్వత్ర సర్వేషాం సర్వకామ ఫలప్రదా॥[21]"

ప్రపత్తికి ఉపాయాంతరాపేక్షలేదు. శరణాగతి అందరికి, అన్నివేళలా కోరిన అన్ని కోరికలూ నెరవేర్చునది అని ప్రశంసింపబడినది. భక్తి యొక్క

20 శ్రీ అ ని పు । 74

21 । శ్రీముడుంబై రామకృష్ణమాచార్యులు, భక్తిప్రపత్తుల తారతమ్యం పు । ౨౫ , శ్రీవైష్ణవ పత్రిక స్వర్ణోత్సవ సంచిక

పరిణామ స్థితియే ప్రపత్తి. భక్తి శరణాగతితో ముగియును. ఈ ప్రపత్తి ఐదువిధములైన అంగములు గలది.

> ''ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్ ।
> రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వవరణం తథా ॥
> ఆత్మనిక్షేప కార్పణ్యే ------------- ।[22]

1. ఆనుకూల్యస్య సంకల్పః = భగవంతునకు అనుకూలమైన వాని నాచరించవలెనను సంకల్పము.
2. ప్రాతికూల్యస్య వర్జనమ్ = ఆయనకు ప్రతికూలములైన వాటిని పరిత్యజించుట.
3. రక్షిష్యతీతి విశ్వాసః = భగవంతుడు తప్పక రక్షించుననెడి నమ్మకము.
4. గోప్తృత్వ వరణమ్ = అతనినే రక్షకునిగా ఆశ్రయించుట
5. ఆత్మనిక్షేపకార్పణ్యము = సంపూర్ణ విశ్వాసముతో; 'నీవే తప్ప ఇతఃపరంబెరుగ' అని దేవునకు తననర్పించు కొనటకు పరితపించుట.

ఈ ఐదు అనగా ఆనుకూల్యసంకల్పము, ప్రాతికూల్య వర్జనము, రక్షించునను నమ్మిక, కార్పణ్యము, రక్షకత్వవరణము - అంగములని, ఆత్మనిక్షేపము అంగి (ప్రధానము) అని పేర్కొందురు. పై ఐదింటి సంస్కార బలముచే నాదేమియు లేదని, భారమంతయు నీదేయని పూర్తి భారముతో పాటు భగవంతునికి ఆత్మ సమర్పణ చేసుకొనుట జరగవలెను. ఇది తిరుగులేని సులభమయిన మోక్షోపాయమని శ్రీవైష్ణవ సిద్ధాంతము.

### 3.1.9 శ్రీమన్నారాయణుడే సర్వేశ్వరుడు :-

ఈ సిద్ధాంతము ప్రకారము శ్రీమన్నారాయణుడే సర్వేశ్వరుడు ఇతడే సర్వనియామకుడు. ఇతనిని నియమించు వాడింకొకడులేడు.

---

22 అ సం 37 ॥ 27-28

"పతిం విశ్వస్యాత్మేశ్వరమ్"[23] అని కదా ఉపనిషత్తుల ఉద్ఘోష. అనగా ప్రపంచమునకు ఈశ్వరుడని ఆత్మేశ్వరుడని తెలియుచున్నది. ఆత్మేశ్వరుడనగా తనకు వేరు నియామకుడు లేడని తానే తనకు ఈశ్వరుడని తెలియపరచుచున్నది. అతడే చిదచిత్తులకు ఆధారభూతుడు.[24]

### 3.1.10 కళ్యాణగుణములు :-

సకల కళ్యాణగుణాకరుడు, సకలేతర విలక్షణుడు అయిన పరమాత్మ కళ్యాణగుణములు క్రింద నిరూపింప బడుచున్నవి.

**1. నిత్యవిభూతి నాయకుడు :-**

వైకుంఠమునందు శ్రీ భూ నీళాసమేతుడై నివసించు శ్రీమన్నారాయణుడు నిత్య విభూతి నాయకుడు.[25]

**2. షాడ్గుణ్య పరిపూర్ణుడు :-**

జ్ఞానము, బలము, ఐశ్వర్యము, వీర్యము, శక్తి, తేజస్సు అను గుణములు పరమాత్మయందున్నవి

**3. అఖిల జగదుదయ విభవలయలీలుడు :-**

సకల జగదుత్పత్తి స్థితి లయ కారకుడు[26]

23 మ నా ఉ ౨ ౩

24 The idea of Brahman as ādhāra of cit-acit is the life-blood of visiṣṭādvaita. PNS. The philosophy of visistādvaita. p.121.

25 దివ్యే బ్రహ్మపురే హ్యేష వ్యోమన్యాత్మా ప్రతిష్ఠితః
ముం ఉ 2 2 7

[illegible] ఇమాని భూతాని జాయంతే

**4. అసాధారణ దీప్తియుక్తుడు :-**

ఇతరులలో ఎవ్వరిలోను కనుపడని నిరతిశయ ప్రకాశ విభాసురుడు.[27]

ఇంకను సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాది గుణములు కలవాడు. పరమాత్మ సకల చేతనాచేతనాంతరాత్ముడు సమస్తవస్తువులయందు అంతర్యామియై యుండును ఈ విషయమునే "య ఆత్మని తిష్ఠన్ యః పృథివ్యాం తిష్ఠన్"[28] అని ఉపనిషత్తులు కూడా వివరించుచున్నవి ఇంకను సత్యకాముడు, సత్యసంకల్పుడు అను కళ్యాణ గుణములతో శోభిల్లుచున్నాడు.

వాత్సల్యము, సౌశీల్యము, సౌలభ్యము, ఆశ్రిత పారతంత్ర్యము పరమోదారత్వము మొదలగు కళ్యాణగుణములీశ్వరుని యందనేకములు కలవు.

**3.1.11 నవవిధసంబంధములు :-**

శ్రియఃపతి చేతనాచేతన శరీరి. పరమాత్మ పరత్వమునకు పరాకాష్ఠ. మనము జీవాత్మలము. జీవాత్మ అల్పత్వమునకు పరాకాష్ఠ. భగవంతునికి సేవ చేయడమే మన జీవిత పరమావధి. భగవత్కైంకర్యమే **జీవాత్మ** స్వరూపము, అతని ధర్మము. భగవంతుడు **అవాప్త** సమస్త **కాముడు - పూర్ణుడు** - ఆయనకు మన కైంకర్య మవసరము లేదు. మన స్వరూపసిద్ధి కోసమే మనము పరమాత్మకు కైంకర్యము చేయుదుము.

నేను స్వతంత్రుడనన్న భావము పూర్తిగా నశించవలెను. భగవంతునకు జీవునకు ఉండు సంబంధస్వరూప స్వభావములు

---

27 తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతి స్తద్యదాత్మ విదో విదుః
ముం ఉ 2 2 9

28 బృ ఉ 3 7 2

బాగుగా గుర్తించి తదనుగుణముగా నడచు కొన్నచో అతనికి మోక్షము కరతలామలకము. ఆ సంబంధమును పెద్దలు తొమ్మిది విధములుగా పేర్కొనిరి.

> "పితా చ రక్షక శ్శేషీ భర్తా జ్ఞేయో రమాపతిః ।
> స్వామ్యాధారో మమాత్మా చ భోక్తా చాఽద్యమనూదితః ॥[23]"

1. పితా పుత్ర సంబంధము
2. రక్ష్య రక్షక సంబంధము
3. శేష శేషి సంబంధము
4. భర్తృ భార్యా సంబంధము
5. జ్ఞాతృ జ్ఞేయ సంబంధము
6. స్వ స్వామి సంబంధము
7. ఆధారాధేయ సంబంధము
8. శరీర శరీరి సంబంధము
9. భోక్తృ భోగ్య సంబంధము

**3.1.11.1 పితా పుత్ర సంబంధము :-**

సర్వతంత్ర స్వతంత్రుడు పరమాత్మ. జీవుడు తదధీనుడు వీరిరువురి సంబంధమువిచ్ఛిన్నము. దీనిని పెద్దలు పితా పుత్ర సంబంధమనినారు. ఈ విషయమును శ్రుతులు, స్మృతులు ఘోషించుచున్నవి. లోకములో బిడ్డలు కోరినను కోరకపోయినను తల్లిదండ్రులెల్లప్పుడు తమ బిడ్డల క్షేమము కొఱకు పాటుబడుచుందురు. బిడ్డ ఎన్ని తప్పులు చేసినను వాటన్నిటినీ క్షమించి వారి శ్రేయస్సునే కాంక్షించుదురు. అట్లే పరమాత్మ జీవుని అపరాధములను మన్నించి

అతనిపై నిర్వ్యాజవాత్సల్యమునే చూపించును. ఇందుకు ప్రమాణము-

''యో నః పితా జనితా యో విధాతా''[30]

''పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః''[31]

### 3.1.11.2 రక్ష్య రక్షక సంబంధము :-

సర్వరక్షకుడని బిరుదు వహించిన పరమాత్మ జీవాత్మయొక్క అపరాధములను మన్నించి రక్షించుటకు సర్వదా ఉద్యుక్తుడై యుండును. ఆర్తులై ప్రపన్నులై శరణుజొచ్చిన వారిని తప్పక కాపాడునని చెప్పవలసిన పనిలేదు. దుస్సహాపరాధియైన కాకాసురుని గూడ రక్షించిన భగవంతుని కృపాలుత్వము వాచామగోచరము. ప్రమాణము - ''జ్ఞస్సర్వగో భువనస్య గోప్తా''[32] ''రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా''[33]

### 3.1.11.3 శేష శేషి భావము :-

పరమాత్మ శ్రీమన్నారాయణుడు శేషి, స్వతంత్రుడు స్వామి. జీవాత్మశేషుడు, అధీనుడు సేవకుడు. శేషత్వమనగా యథేష్ట వినియోగార్హత్వము. పరమాత్మ యిచ్ఛననుసరించి ఉపయోగపడు నట్లుండుట.

శరీరమున కర్మేంద్రియములు జ్ఞానేంద్రియములు ఉన్నవి. ఇవి జీవాత్మకు ఇష్టవినియోగార్హములై పనులు చేయుచూ జీవాత్మ అధీనములో ఉండును. అలాగే శరీరియైన సర్వేశ్వరునకు శరీరభూతుడైన జీవాత్మ సర్వకాల సర్వావస్థోచిత కైంకర్యములకు ఉపయోగపడునట్లు ఉండును.

30 ఋ వే 10 8.23

31 భ గీ 9 17

32 శ్వే ఉ 6 17

''జ్ఞాన మాత్మని మహతి నియచ్ఛేత్ తద్యచ్ఛేచ్ఛాంత ఆత్మని''[34] - బుద్ధిని జీవాత్మకు అధీనము చేయవలెను. ఆ జీవాత్మను పరమాత్మకు శేషభూతునిగా నియమింపవలెను

### 3.1.11.4 భర్తృ భార్యా సంబంధము :-

భరించువాడు భర్త. భరింపబడునది భార్య. భార్య భర్తకువలె జీవుడు పరమాత్మకు సకలవిధోపచారములను చేయవలెను. కావున భార్యా భర్తల సంబంధము వంటిది జీవపరమాత్మల బంధము. ప్రమాణము - ''స ఇమమేవాత్మానం ద్వేధాపాతయత్ తత: పతిశ్చ పత్నీ చ భవతామ్''.[35] పరమాత్మ తన శరీరమును రెండుగ విభజించెను. అందొకటి పతియైనది. మరొకటి పత్నియైనది. పత్ని జీవుడు, పతి పరమాత్మ. పత్నివలె జీవుడు అనన్యార్హశేషత్వము వహించుచు భగవంతుడి కొక్కడికే భోగ్యుడై పరమాత్ముని ఆరాధించుటయే కర్తవ్యముగా కలిగి ఉండవలెను.

### 3.1.11.5 జ్ఞాతృ జ్ఞేయ సంబంధము :-

జ్ఞాన విశిష్టుడైన జీవుడే జ్ఞాత, ఆ జ్ఞాతచే తెలిసికొనదగిన పరమాత్మయే జ్ఞేయుడు. ''ఏతద్ జ్ఞేయం నిత్యమేవాత్మ సంస్థమ్''[36] జీవాత్మయందన్తర్యామియై నిత్యుడైన శ్రీమన్నారాయణుడే జ్ఞేయుడు, అనగా తెలిసి ఉపాసింపదగినవాడు.

### 3.1.11.6 స్వ స్వామి సంబంధము :-

చిదచిదాత్మక ప్రపంచమునకు పరమాత్ముడే స్వామి, అధిపతి. జీవుడు స్వమ్ము అనగా సొమ్ము. యజమాని (స్వామి) సొమ్మును

---

34 క ఉ । 3 । 3

35 బృ ఉ । 4 3

కాపాడుచు దానిపై స్వాతంత్ర్యము కలిగి తన కిష్టమైన రీతిగ ఉపయోగించుకొనును. జీవుడు పరతంత్రుడై పరమాత్మకు స్వేచ్ఛా వినియోగార్హుడై యుండును. ''పతిం విశ్వస్యాత్మేశ్వరమ్''[37] మొదలగు వాక్యములు ఇందుకు ప్రమాణము.

### 3.1.11.7 ఆధారాధేయ సంబంధము :-

చిదచిదాత్మక ప్రపంచమునకంతకు వస్తుజాతమునకు ఆధార భూతుడు పరమాత్మ. జీవునకు స్వతంత్ర స్థితి లేదు. అన్నిటికినీ భగవంతుని మీదనే ఆధారపడి ఉండును అందుచేత జీవుడు ఆధేయుడు. ''ఏష సేతుర్విధరణః''.[38] ''భూత భృన్నచ భూతస్థః''[39]- మొదలగు వాక్యములు పరమాత్మ జీవాత్మల ఆధారాధేయ సంబంధమును బోధించును.

### 3.1.11.8 శరీర శరీరి భావము :-

జీవాత్మ పరమాత్మలకుండు అవినాభావ సంబంధమును శరీరశరీరిభావమందురు. అనగా పరమాత్మ శరీరి. జీవాత్మ శరీరము . ఇంద్రియములతో గూడిన ఈ భౌతికశరీరము జీవాత్మను వదలి మనలేదు. అలాగే పరమాత్మను వదలి జీవాత్మ ఉండలేదు. ''య ఆత్మని తిష్ఠన్, ఆత్మనోంతరోయమాత్మా న వేద యస్యాత్మా శరీరమ్''[40] అను శ్రుతి పరమాత్మ జీవాత్మలో అంతర్యామియై యుండునని తెలుపుచున్నది. ఆత్మ పరమాత్మను తెలియలేకున్నను పరమాత్మకు జీవుడు శరీరభూతుడు. కాబట్టి జీవాత్మ పరమాత్మలకుండు సంబంధము శరీరశరీరిభావ సంబంధము.

37 మ నా ఉ ౧ ౩

38 మై ఉ ౭ ౭

39 భ గీ ౯ ౫

### 3.1.11.9 భోక్తృ భోగ్య సంబంధము :-

పరమాత్మ భోక్త, జీవాత్మ భోగ్యుడు.[41] పరమాత్మయైన శ్రీమన్నారాయణునకు స్థావరజంగమములు అన్నములవలె భుజింపదగినవి. ఇచట బ్రహ్మ క్షత్ర శబ్దములు స్థావరజంగమ బోధకములు. ఆ పరమాత్మునకు మృత్యువు వ్యంజనస్థానీయము. వ్యంజన సంబంధములో భోజ్యవస్తువులు సులభభోజ్యములగును అట్లే మృత్యు సంబంధముతో జంగమ స్థావరములను పరమాత్మ భుజించును పరమాత్మ భోక్త - తక్కిన జగత్తంతయు (జీవాత్మ కూడా) భోజ్యము. భోగ్య వస్తువు.

### 3.1.12 తత్త్వమసి :-

జీవాత్మ పరమాత్మలకు విడదీయరాని అవినాభావ సంబంధమున్నది. పరమాత్మ శరీరి. **జీవాత్మ** శరీరము. అనగా పరమాత్మ జీవాత్మలో అంతర్యామియై యున్నాడని తెలియు చున్నది.[42] అటులనే జీవాత్మ శరీరి. ప్రకృతి శరీరము. అనగా శరీరరూపమగు ప్రకృతిలో జీవాత్మ అంతర్యామియై యున్నాడు. కావున చిదచిత్స్వరూపమైన ప్రపంచము పరబ్రహ్మాత్మకము.

**'తత్త్వమసి' అనగా 'నీవు ఆ పరబ్రహ్మగా నున్నావు'. అని అర్థము. తత్త్వమసి అను వాక్యమునకు తత్, త్వం, అసి అని పదవిభాగము. ఇచట తత్ శబ్దము పరబ్రహ్మను సూచించును.**

సాధారణముగా ఎదుటి వ్యక్తిని త్వం అను శబ్దముచే వ్యవహరించుట లోకపరిపాటి. కానీ జీవుడగు ఆ వ్యక్తి గూడ పరబ్రహ్మకు

41. యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః
మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః
క ఉ 2 24

42 బృ ఉ 5.7 22
తై ఉ 3 1

శరీరభూతుడే కావున 'త్వం' అను శబ్దము జీవాత్మయందంతర్యామిగా నుండు పరమాత్మకే సంబంధించును. అనగా శరీరభూతుడైన జీవునకు పరమాత్మ అంతర్యామి కావున త్వం శబ్దము కూడా పరబ్రహ్మ ప్రతిపాదకమే యగుచున్నది. ఈ జగత్తున ప్రతి జీవుడు సర్వేశ్వరుని వలననే జనించి ఆయనకు శరీరభూతుడై ఆ పరమాత్మనే అంతర్యామిగా కలిగి యున్నాడు. పరమాత్మ కంటె ఎవ్వరును వేరుకారు. అట్లే జీవాత్మ కూడా 'తదంతర్గతుడే'. కావున ఈ వాక్యమందు తత్ త్వం పదములు సర్వ జగత్కారణమైన పరబ్రహ్మనే ప్రతిపాదించుచున్నవి.

**3.1.13 భగవంతుని పంచస్వరూపములు :-**

అవాప్త సమస్తకాముడు, అసంఖ్యేయ కళ్యాణగుణగణ విశిష్టుడు అయిన భగవంతుడు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చారూపములతో ఐదు విధములుగ నున్నాడు.

**3.1.13.1 పర స్వరూపము :-**

శుద్ధ సత్త్వమయమగు వైకుంఠమునందు మహామణి మండపమున పేరోలగమునందుండి శ్రీ భూనీళా సమేతుడై నిత్యసూరులగు అనంత గరుడ విష్వక్సేనాదులచే సదా సేవింపబడుచూ[43] పరమపదమును చేరిన ముక్తులకు అనుభావ్యుడై శేష శయనముపై అప్రాకృత దివ్యస్వరూపియై, నిరతిశయానందయుక్తుడై విజయము చేసియుండు స్వరూపమే పరస్వరూపముగా పేర్కొనబడినది. దీనినే 'పరవాసుదేవు' డను నామముతో వ్యవహరింతురు.

**3.1.13.2 వ్యూహ స్వరూపము :-**

**లీలావిభూతి**యనబడు ప్రకృతి మండలమునకు సంబంధించిన సృష్టి స్థితి సంహారకార్యములకు మూల కందమై, మోక్షార్థులను

---

43 తద్విష్ణోః పరమంపదం సదా పశ్యన్తి సూరయః।
క ఉ ౩ ౯

అనుగ్రహించుటకై జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్య తేజస్సులు అను గుణములతో కూడి యుండు వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ రూపములుగా విజయము చేసి యుండుటనే వ్యూహ స్వరూపముగా పేర్కొందురు.

**3.1.13.3 విభవ స్వరూపము :-**

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥[44]

అను భగవదుక్తి ప్రకారము దుష్టశిక్షణ శిష్టరక్షణ ధర్మ సంస్థాపనములకై తన దివ్య సుందర మంగళ విగ్రహముతో అవతరించు స్వరూపమునే విభవ స్వరూపమందురు. రామకృష్ణాది అవతారములు విభవస్వరూపములే.

**3.1.13.4 అంతర్యామి స్వరూపము :-**

భగవదుపాసకులకు సాక్షాత్కారమొసగుటకు జీవులకు నియామకుడై వారిని సత్కార్యానుష్ఠానము నందు ప్రవర్తింప చేయుటకు ఎల్లప్పడు హృదయ కమలమునందుండెడి భగవత్స్వరూపమునకు 'అంతర్యామి' యని పేరు. ''సమస్త జీవుల హృదయము నందుండి తన మాయచే సర్వభూతములను నియమించు ఈశ్వరుడే అంతర్యామి'' యని పేర్కొనబడెను.[45]

**3.1.13.5 అర్చా స్వరూపము :-**

పర వ్యూహ విభవ అంతర్యామి స్వరూపములు అందరికిని నేత్రగోచరమగునవి కావు. పరస్వరూపము శ్రీవైకుంఠమున నుండెడు నిత్యులకు మాత్రము దర్శనీయ మగుచున్నది వ్యూహస్వరూపము కూడా

44 భ గీ 4 8

45 ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥
భగీ । 8 0 ।

క్రొందరికి మాత్రమే అనుభవగోచరమగునది విభవ స్వరూపమన్న అది యుగాంతర విషయము సామాన్యుల దృష్టికి గోచరించునది కాదు.[46] అనగ ఆయా యుగములందు లోకసంరక్షణార్థమై అవతరించిన పరబ్రహ్మ తన కర్తవ్యములను నెరవేర్చి వెంటనే నిత్యవిభూతిని చేరుకొనును.

ఇక వ్యూహ విభవాది అవతారములకన్న విలక్షణమైనది, భక్తుల యభీష్టము మేరకు శిలాకాష్ఠ లోహాది ద్రవ్యములయందు ఆవిర్భవించి సులభముగా సాక్షాత్కార మొసగు మూర్తి అర్చామూర్తి. అర్చా స్వరూపము సర్వదేశ, సర్వ కాలముల యందు స్వయం వ్యక్త రూపుడుగా ఆయా గృహ దేవాలయాదుల యందు సన్నిహితుడై యుండి మనకు దర్శనభాగ్యమొసగును.

ఈ అర్చావతార సౌలభ్యమును తత్త్వత్రయ కర్తయగు శ్రీపిళ్ళై లోకాచార్యులీవిధముగ నిరూపించిరి. ''ప్రీతిని కలిగించుట, మంగళ ప్రదుడగుట, సమస్త జగదాశ్రయ భూతుడగుట అనుభవార్హుడయి యుండుట అను గుణములు అన్నియు అర్చామూర్తియందు పరిపూర్ణముగ నున్నవి''.[47] బ్రహ్మాండ పురాణము అర్చావతార ప్రాముఖ్యము నీ క్రింది విధముగ పేర్కొనుచున్నది. ''సులభముగ మోక్షసాధనకు నేను అర్చావతారము ధరింతును. మోక్షము పరవ్యూహాది రూపముల ద్వారా కష్టసాధ్యము. ఈ విధముగా అర్చామూర్తియందే

46 సుదుర్దర్శ మిదం రూపం దృష్టవానసి యన్మమ।
అందులోనే ।। 52

47 రుచి జనకత్వం శుభాశ్రయత్వం, అశేషలోక శరణత్వం, అనుభావ్యత్వం సర్వమర్చాయామేవ పరిపూర్ణమ్
త త్ర 20।

మిక్కిలి సౌలభ్యము కలదు. కావున అర్చావతారము ద్వారా జగత్తును సంరక్షించెదను''.[48]

అర్చాస్వరూప సేవా నిరతులైన భాగవతులు తమకు వైకుంఠమే వలదని ఇహలోకమునన్న అర్చామూర్తి సేవా భాగ్యము తమకభిలషణీయమని చెప్పిరి. అనగా అర్చాస్వరూపము శ్రీవైష్ణవ సిద్ధాంతమున పరమోపాదేయము.

### 3.1.14 భాగవత లక్షణము :-

శ్రీవైష్ణవులకు ఉపాయము ఉపేయము శ్రీమన్నారాయణుడే భగవంతుడగు శ్రీమహావిష్ణువునకు దాసులగు శ్రీవైష్ణవులను మహాభాగవతులని వ్యవహరింతురు. మహాభాగవతుల లక్షణములనిట్లు పేర్కొందురు -

అర్థ పంచక తత్త్వమును చక్కగా తెలిసినవారు, పంచ సంస్కార పరాయణులు, ఆకారత్రయ సంపన్నులైనవారు మహాభాగవతులనబడుదురని శ్రీవైష్ణవ సంప్రదాయమిట్లు తెలియజేయుచున్నది -

అర్థ పంచక తత్త్వజ్ఞా: పంచసంస్కార తత్పరా: ।
ఆకారత్రయ సంపన్నా: మహా భాగవతా: స్మృతా: ॥

### 3.1.14.1 అర్థ పంచకము :-

మహా భాగవతుల కుండ వలసిన మొదటి లక్షణము అర్థపంచక తత్త్వజ్ఞత. వైష్ణవ ధర్మమున అతి ముఖ్యములగు క్రింది అంశముల నైదింటిని పూర్తిగా తెలిసికొని యుండువాడే మహాభాగవతుడన నొప్పను

---

48 సులభం మోక్ష సిద్ధౌ చ భవామ్యర్చా స్వరూప వాన్ ।
పరవ్యూహోదయ శ్చేమే క్లేశాదిరతి మోక్షదా: ॥
ఏవమత్యంత సౌలభ్య మర్చాయామేవ వర్తతే ।
తస్మా దర్చావతారేణ లోకాన్ సంరక్షయామ్యహామ్ ॥
రా కౌ । 3వ భాగము పు 2 ।।

ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః।
ప్రాప్త్యుపాయః ఫలం ప్రాప్తేః తథా ప్రాప్తి విరోధి చ॥
వదన్తి సకలా వేదా స్సేతిహాస పురాణకాః।
మునయశ్చ మహాత్మానో వేదవేదార్థ వేదినః॥[49]

| | | |
|---|---|---|
| ప్రాప్యస్య బ్రహ్మణో రూపం | : | పొందదగినట్టి పరబ్రహ్మ స్వరూపము |
| ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః | : | భగవంతుని పొందవలసిన జీవాత్మ యొక్క స్వరూపము. |
| ప్రాప్త్యుపాయః | : | భగవత్ప్రాప్తికి ఉపాయము |
| ప్రాప్తేః ఫలమ్ | : | ప్రాప్తివలన ఏర్పడు ఫలము |
| ప్రాప్తి విరోధి చ | : | భగవత్ప్రాప్తికి విరోధులైన వాటి యొక్క స్వరూపము |

పైన చెప్పిన అర్థపంచక స్వరూపము బాగా తెలిసి వుండుట ప్రధానమైన శ్రీవైష్ణవ లక్షణము

**3.1.14.2 పంచ సంస్కారములు :-**

పంచసంస్కారపూతుడుకానిచో శ్రీవైష్ణవుడను వ్యవహారమునకు ఎవరికైనను అర్హత సిద్ధించదు. తప్త చక్రాంకనము, ఊర్ధ్వ పుండ్ర ధారణము, ఆచార్యుడిచ్చినపేరు, అష్టాక్షరీ మంత్రము, తిరువారాధనమను క్రింది అయిదు సంస్కారములు వైష్ణవులకు చాలా ముఖ్యము -

''తాపః పుండ్రస్తథా నామ మంత్రో యాగశ్చ పంచమః''[50]

1) **తాపః** : అనగా తప్త చక్రాంకనము

49 వి శో పు 403

50 శ్రీ ఆ ని పు 254

II) **పుండ్రః** : తిరుమణ్ అను శ్వేత మృత్తిక, శ్రీ చూర్ణమని ఎర్రగా చేసిన పసుపు పొడి - వీటితో దిద్దు ద్వాదశోర్ధ్వపుండ్రములు

III) **నామ** : అనగా పేరు. నామకరణము నాడు పెట్టిన పేరుగాక, ఆచార్యుడు శిష్యుని సంస్కరించు సందర్భమున ప్రత్యేకముగా ఇచ్చు క్రొత్తపేరు.

IV) **మంత్రః** : అష్టాక్షరీ మహామంత్రము

V) **యాగః** : అనగా దేవతార్చన. తిరువారాధన అనబడు భగవదారాధన

ఈ అయిదు సంస్కారములతో సంస్కరింపబడి యుండుట శ్రీవైష్ణవ లక్షణము

### 3.1.14.3 ఆకారత్రయ సంపన్నత :-

ఆకారత్రయము : 1 అనన్యార్హశేషత్వము 2 అనన్య శరణత్వము 3 అనన్యభోగ్యత్వము ''యథేష్టవినియోగార్హత్వం శేషత్వమ్'' - భగవంతుని విషయమున పూర్తిగా పరతంత్రుడై ఆయన అనుకున్న ప్రకారము ఎట్లు కావలెనను కొనినచో అట్లు ఉపయోగపడు నట్లుండయే శేషత్వము.

1. **అనన్యార్హ శేషత్వము** - పై చెప్పిన శేషత్వము శ్రీమన్నారాయణుని విషయమున తప్ప ఇంకెవ్వరియందును ( ఏ దేవత యందును) సెలపరాదు

2. **అనన్య శరణత్వము** - నారాయణుడు తప్ప వేరెవ్వరిని శరణ్యుడుగా (రక్షకుడుగా) వరింపరాదు

3. **అనన్యభోగ్యత్వము** - జీవుడు భగవంతునకు ఆటవస్తువుగా, భోగోపకరణముగా ఉండవలెను ఇతరులకు భోగ్యుడుగా నుండరాదు

పై చెప్పిన ఆకారత్రయము ఎవ్వని యందు పూర్ణముగా నుండునో అతడే మహాభాగవతుడు.

### 3.1.15 లక్ష్మీ పురుషకారము :-

శ్రీ: అనగా లక్ష్మీదేవి. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీమన్నారాయణుని అర్ధాంగి. నిత్యానపాయిని నిత్యోరస్స్థలవాసిని అయిన జగదంబ. శ్రీ శబ్దము మిక్కిలి అర్థపుష్టమైనది- ఈ శ్లోకమును చూడుడు.

శృణాతి నిఖిలాన్ దోషాన్ శ్రీణాతి చ గుణైర్జగత్ ।
శ్రీయతే చాఖిలై ర్నిత్యం శ్రయతే చ పరం పదమ్ ॥
''శృణోతి శ్రావయతి చ''[౫౧]

పైశ్లోక విషయమే ఈ శ్లోకమున వివరింపబడినది

శ్రితాస్త్వస్త్వైస్సర్వై: శ్రయసి రమణం సంశ్రిత గిర:
శృణోషి ప్రేయాంసం శ్రితజన వచ: శ్రావయసి చ ।
శృణాస్యేతద్దోషాన్ జనని నిఖిలాన్ సర్వ జగతీం
గుణై: శ్రీణాసి త్వం తదిహ భవతీం శ్రీరితి జగు: ॥[౫౨]

౧ శ్రీయతే ఇతి శ్రీ: అందరి చేతను ఆశ్రయింపబడునది.

౨. రమణం శ్రయతీతి శ్రీ: : ప్రియుని ఆశ్రయించును (భక్తుల కోరకపై)

౩ సంశ్రితగిర: శృణోతీతి శ్రీ: : తనను ఆశ్రయించిన వారి మొర ఆలకించును

4 సంశ్రితవచ: ప్రేయాంసం శ్రావయతీతి శ్రీ: తనను ఆశ్రయించిన

౫౧ M Narasimhachary The Term purusakara, The Journal of oriental Research Madras, vols LVI-LXII, p 174-178

౫౨ శ్రీ గు ణ ర త్న కో శ ము, శ్రీ పరాశర భట్టర్

వారి మాటలను వారి పక్షము వహించి ప్రియునకు వినిపించును; నివేదించును.

5. ఆశ్రిత దోషాన్ శృణాతీతి శ్రీః : భక్తుల పాపములను దహించును.

6. గుణైః సర్వ జగతీం శ్రీణాతి ఇతి శ్రీః : ప్రపంచ మంతటిని తన గుణములచేత ఆశ్రయించునది. ధాతువులు - శ్రు శ్రవణే, శ్రిఞ్ సేవాయాం, శౄ హింసాయామ్, శ్రీఞ్ పాకే)

సకలజగజ్జనని ఆశ్రయణ సౌకర్యాపాదకములైన సౌశీల్య సౌలభ్య దయా దాక్షిణ్యాది గుణముల కొరకు అందరిచే ఆశ్రయింపబడు చున్నది. ఆమె ప్రాణ ప్రియుని విడువకయే యుండును. అట్లుండుట బిడ్డలమైన మానవులకొరకే. విసుగు విరామము లేక వాత్సల్యముతో మన కష్టములనామె వినును. అంతటితో నిలువక అదనెరిగి పదనెరిగి భక్తుల విజ్ఞప్తులను విన్నవించి ప్రియునికి వారిపై జాలి కలుగునట్లు చేయును. భక్తుల దోషములను పరిమార్చును. హరి అనుగ్రహపాత్రులను చేయును.

లక్ష్మీదేవి సీతగా అవతరించినప్పుడు తన దయామయత్వమును ప్రదర్శించిన విధము గమనార్హము. తన వక్షఃస్థలమునే గాయపరచి తనకే ఘోర ద్రోహము చేసిన కాకిని, ఇతర రక్షకుడు లేక కాళ్ళపై పడినంతనే భర్తచేత ప్రాణభిక్ష పెట్టించిన జగజ్జనని వాత్సల్యము వాచామతీతము. అట్లే సీతాదేవిని అమానుషముగ నానాహింసలు పెట్టిన రాక్షసస్త్రీలను తుదముట్టించుటకు హనుమంతుడు అనుజ్ఞకోరగా ఆంజనేయుని ప్రతీకారవాంఛను సమూల ధ్వంసమొనర్చినది "వారు పాపాత్ములో శుభాత్ములో నిజముగ వధార్హులే అయినను వారిని హింసింపవలదు. వారిపై దయ చూపుము"[53] వారు తప్పచేసి యుండ

53 పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ ।
కార్యం కరుణ మార్యేణ నకశ్చిన్నాపరాధ్యతి ॥
వా రా యుద్ధ 116 44

వచ్చును దానికి శిక్ష వధయేనా! అట్టిన లోకమున తప్పచేయని మానవుడుండునా! కావున రాక్షస స్త్రీలను హింసింపక వదలిపెట్టుట ఉచితము. అదియును వారు రాజాజ్ఞ చొప్పన నడచుకొందురు వారి తప్పేమి? అని దయార్ద్రహృదయముతో ఉపదేశము చేసి ఆంజనేయుని చేత హింస మాన్పించెను ఇట్లే ఇంకనెన్నియో దృష్టాంతములివ్వవచ్చును.

ఇందువలన తెలిసినదేమన, తీరని తప్పిదములు చేసినను కరుణామూర్తియగు తల్లివలె ఆశ్రితులపై జాలిగొని వారిని రక్షించుట ఆమె నైజ గుణము. కావుననే ఆతల్లిని పురుషకార స్వరూపిణి అని విజ్ఞులు శ్లాఘింతురు.

పురుషకారమనగా "పురు సనోతీతి పురుషః"[54] హెచ్చుగా నిచ్చువాడు, ఉదారుడు. అట్టివానినిగా చేయుటయే పురుషకారము. తండ్రి బిడ్డలు చేసిన తప్ప చూసి కోపగించి శిక్షించ దలచినపుడు వారికి కలుగబోవు బాధను తెలిసి తల్లడిల్లి జాలి గుండెలతో వారి పక్షము వహించి తన వాక్చాతుర్యముతో దయావాదముతో భర్త కోపముపశమింప జేసి శిశువుపై వాత్సల్యమేర్పడునట్లు చేసి కాపాడును. ఇట్టి సత్క్రియయే పురుషకారము.[55] ఇట్టి గుణమునకు ఆట పట్టైయుండుట వలననే లక్ష్మీదేవికి పురుషకార స్వరూపిణియని పేరు.[56] సాపరాధులను నిర్దోషులవలె నిరూపించి దేవుని వదాన్యునిగా తప్పలు మన్నించుటేగాక భక్తాభీష్టములను నెరవేర్చునట్లుగ చేయగలదీ జగజ్జనని.

---

54. షణు = దానే

55 పితేవ త్వత్ప్రేయాన్ జనని పరిపూర్ణాగసి జనే।
హితస్రోతో భవతిత్వృత్యాచ కదాచి త్కలుషధీః॥
కిమేతత్? నిర్దోషః స ఇహ జగతీత త్వముచితై-
రుపాయై ర్విస్మార్య స్వ జనయసి మాతా తదసి నః॥
శ్రీ. గు ర శ్లో 52

56 Prof. M. Narasimhachary. The Term Purusakara, p.174-178, The Journal of Oriental Research. Madras vols. LVI-LXII.

### 3.1.16. ఆచార్యానుగ్రహము :-

విశిష్టాద్వైత సిద్ధాంతమున ఆచార్యానుగ్రహము అను అంశమునకు అత్యంత ప్రాధాన్యమున్నది. ఆచార్యుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుని ప్రతిరూపము [57] ఆచార్యుల వైభవము క్రింద చెప్పబడిన ప్రమాణములలో పేర్కొను బడుచున్నది-

గురురేవ పరంబ్రహ్మ గురురేవ పరాగతి:
గురురేవ పరావిద్యా గురురేవ పరాయణమ్
గురురేవ పర: కామో గురురేవ పరం ధనమ్
యస్మాత్తదుపదేష్టాఽసౌ తస్మాద్గురుతరో నమ: ॥ [58]

ఆచార్యసేవనము భగవత్సాయుజ్య ప్రదమని సాక్షాత్తు భగవంతుడే అభివర్ణించెను. [59]

సాధారణముగా మోక్షము కోరువారు కర్మ జ్ఞాన భక్తి మార్గముల నవలంబింతురు. ఈ మార్గములాచరింప లేనివారు ప్రపత్తి (శరణాగతి) సులభతరమైన మార్గముగ స్వీకరింతురు. కాని ప్రపత్తి కూడా కొన్ని సమయములందు కఠినము కావచ్చును. ఆచార్యానుగ్రహముచే మోక్షమును సాధించుట అత్యంత సులభతమమైన మార్గమని వైష్ణవ సిద్ధాంతము.

ఆచార్యానుగ్రహము శిష్యుని దివ్య జ్ఞానవంతునిగా తీర్చిదిద్దును పతివ్రతయగు స్త్రీకి ఎన్ని ఆభరణములున్నను ఒక్క మంగళసూత్రము వలననే పరిపూర్ణత సిద్ధించును అట్లే శిష్యునకు ఆచార్యానుగ్రహ

57 ఆచార్య: స హరిస్సాక్షాత్ చరరూపీ న సంశయ:
శ్రీ అ ని పు ౧౦

58 అ రా ఉ ౹ ౹

59 మత్సాయుజ్యం హి సర్వేషాం వైష్ణవాచార సేవనాత్ ।
శ్రీ అ ని పు ౧ ।

మత్యంతావశ్యకము ఆచార్యానుగ్రహము లేనిచో భగవంతుడు కూడా రక్షించలేడు

ఎట్లనగా - తామరపూవు నీటి యందున్నప్పుడే సూర్యుడు దానిని వికసింపచేయగలడు నీటిని వదలిన తామరను సూర్యుడు వికసింప చేయలేడు. సరికదా! వాడిపోవునట్లు చేయును కావున ఆచార్యానుగ్రహములేని శిష్యుడు నీటిని వదిలిన తామరవంటివాడు. అందుకే పెద్దలు ఇట్లు చెప్పుదురు - ఆచార్యదేవో భవ![౧౦]

కావున జ్ఞాన సంపన్నుడు కావలెనన్నను భగవత్సాయుజ్యమును పొందవలెనన్ననూ ఆచార్యుడొక్కడే తరణోపాయమని, అట్టి ఆచార్యానుగ్రహము తప్పక పొందవలెనన్నది శ్రీవైష్ణవ సిద్ధాంతము

* * *

౧౦ తై ఉ । । । ।

# 4. చతుర్థాధ్యాయము

## 4.1 శ్రీవైష్ణవ స్తోత్రములలో పంచస్తవి స్థానము :-

శ్రీవైష్ణవ స్తోత్రవములలో పంచస్తవికున్న స్థానవము అతి విశిష్టమైనది. కూరేశమిశ్రుల పంచస్తవములకు వైష్ణవ లోకమున విశిష్టమైన గౌరవప్రతిపత్తులు కలవు. విషయ వైవిధ్యమును బట్టి, అందున్న అసాధారణ కావ్య ధర్మవములు సహృదయులకు హృదయంగమములే యగును. స్తవములయందు శ్రీవైష్ణవ సంప్రదాయ రహస్యవములు సప్రమాణవములుగా నిరూపింపబడినవి. వేద, ఉపనిషద్వాక్యముల సారాంశములు అడుగడుగునా అయిదు స్తవముల యందును ప్రత్యక్షమగుచుండును. ఆయా స్తోత్ర ఆవిర్భావములకు సంబంధించిన చారిత్రికాంశములు స్తోత్రముల గొప్పతనమును ఇనుమడింపజేయుచున్నవి. ప్రౌఢ, గంభీర, ప్రసన్న శైలులలో స్తవములత్యంత రమ్యముగా రచింపబడినవి. ఈ విషయములన్నియు ఆయా శీర్షికల క్రింద సోదాహరణముగ వివరింపబడును. ఇందు ముఖ్యముగా జ్ఞాతవ్యాంశములైన అర్థపంచక స్వరూపము, తత్త్వత్రయ ప్రతిపాదనము, వైకుంఠనాథుని పరమోత్తమత్వము, రామకృష్ణాద్యవతార సాధారణ - విశేష వృత్తాంతవములు మొదలగు వైష్ణవానుగుణ

ధర్మములెన్నో అభివర్ణితములు అనంతర వ్యాఖ్యాత లెందరో విషయ ప్రతిపాదన సందర్భమున ప్రామాణ్య సిద్ధికై వీరి శ్లోకముల నుదాహరించుట గొప్ప విశేషము వైష్ణవులందరు వీనిని కంఠస్థము చేసి, పారాయణ గ్రంథమువలె మిక్కిలి గౌరవముతో నారాధింతురు. ఆయా సంప్రదాయ రహస్యములు తెలియవలసి వచ్చినపుడు ఇందులోని ప్రామాణిక శ్లోకములెంతగానో ఉపయోగపడును. శాస్త్ర దృష్టితోను, సాంప్రదాయిక దృష్టి చేతను, కావ్య దృషి వలనను ఈ స్తోత్రము పఠించువారికి దీని గొప్పతనము తప్పక తెలియును.

**4.2 పంచస్తవి : కవితా సౌందర్యము :-**

వేదాంత తత్త్వ సౌరభ భాసురమగు పంచస్తవిని కవితా గవాక్షమునుండి పరిశీలించినపుడు అందలి కవితా సౌందర్యము మనకు ప్రత్యక్షమగును. కవితా సౌందర్యమును నిరూపించునపుడు రస ప్రధాన ములగు శబ్దార్థములు, గుణములు, అలంకారములు, వృత్తులు, రీతులు అను ప్రధానాంశములను మనస్సునందుంచుకొన వలెను.[1] స్పష్ట ప్రతిపత్తి కొఱకు ఆలంకారికులు శబ్దార్థాది కావ్య సామగ్రి యందు శరీరాది లోక సామగ్రిని ఆరోపించి వర్ణించుచున్నారు.[2]

1 రసప్రధానాః శబ్దార్థాః గుణాలంకార వృత్తయః।
రీతయ శ్చేయతీ శాస్త్రపమేయం కావ్య పద్ధతిః॥
ప్ర య భూ । 4

2 శబ్దార్థా మూర్తిరాఖ్యాతా జీవితం వ్యంగ్య వైభవమ్।
హారాదివ దలంకారాస్తత్ర స్యురుపమాదయః॥
శ్లేషాదయో గుణాస్తత్ర శౌర్యాదయ ఇవ స్థితాః।
ఆత్మోత్కర్షావహాస్తత్ర స్వభావా ఇవ రీతయః॥
శోభా మాహార్యకీం ప్రాప్తా వృత్తయో వృత్తయో యథా।
పదానుగుణ్య విశ్రాంతిః శయ్యా శయ్యేవ సమ్మతా॥
రసాస్వాద ప్రభేదాః స్యుః పాకాః పాకా ఇవ స్థితాః।
ప్రఖ్యాతా లోకవదియం సామగ్రీ కావ్య సంపదః॥
ప్ర య భూ ॥ 2-5

గుణములు, వృత్తులు, రీతులు, శయ్య, అలంకారములు మొ॥ అంశములతో ప్రకాశించుచున్న పంచస్తవిలోని కవితా సౌందర్యము శోభావహమై అత్యంత రమణీయతను సంతరించు కొన్నది.

### 4.2.1 గుణములు :-

కావ్యోత్కర్షకు ముఖ్యముగ గుణాలంకారములే ప్రధానమైనవి. వీటిలో గుణములు ప్రథమముగ నిరూపింపబడుచున్నవి. ఈ గుణములు మొత్తము ఇరువది నాలుగు. కొందరు ఆలంకారికుల మతము ప్రకారము ఈ గుణముల సంఖ్యయందును, విభాగమునందును భేదము కలదు.[3] విద్యానాథుడు పేర్కొనిన ఇరువది నాలుగు గుణములు ఈ పంచస్తవి యందు నిరూపింప బడుచున్నవి.

#### 4.2.1.1 శ్లేష :-

సంధి విశేషమున పదములన్నియు కలిసి పోయి ఒక పదము వలె కనిపించు రచనా విశేషము శ్లేషయనబడును.

**పీతాంబరం వరదశీతలదృష్టిపాతం**
**ఆజానులంబిభుజ మాయతకర్ణపాశమ్।**
**తన్మేఘ మేచక ముదగ్రవిశాలవక్షః**
**లక్ష్మీధరం కిమపి వస్తు మమావిరస్తు ॥**[4]

ఇందు 'పీతాంబరం', 'లక్ష్మీధరం' అను రెండు పదములు తప్ప తక్కిన పదములన్నియు చదువునపుడు ఒకే పదముగ భాసించుటచేత ఈ శ్లోకమున 'శ్లేష' అను గుణము నిరూపించబడుచున్నది.

3 దండి, భామహుడు మూడు గుణములను పేర్కొనిరి
వామనుడు పది గుణములను పేర్కొనెను
భోజరాజ ఇరువది నాలుగు గుణములను పేర్కొనెను

4 వై.స్త. 5

**4.2.1.2 ప్రసాదము :-**

ప్రసిద్ధార్థములైన పదములను కలిగియుండుట 'ప్రసాద' మనబడును

సుందరాయతభుజం భజామహే
వృక్షషండమయ మద్రి మాస్థితమ్।
యత్ర సుప్రథితనూపురాపగా-
తీర్థ మర్థితఫలప్రదం విదుః ॥[౫]

నిఘంట్వాది సాపేక్షములైన పదములిందు ప్రయోగింపబడలేదు. ఇందలి పదములన్నియు ప్రసిద్ధార్థములు. కావున ఇది ప్రసాదగుణ భరితము.

**4.2.1.3 సమత :-**

నాలుగు పాదములందును వైషమ్యము లేకుండుట 'సమత' అనబడును.

ఆమ్నాయకల్పలతికోత్థసుగంధిపుష్పం
యోగీంద్రహార్ద సరసీరుహరాజహంసమ్।
ఉత్కృష్టధర్మ సహకారఫలప్రకాండం
వందేయ సుందరభుజస్య పదారవిందమ్ ॥[౬]

సుందరబాహుస్వామి పాదారవిందములు సుందర రూపకాలంకార విభ్రాజితములు, మిక్కిలి ఉదాత్తములు. ఇచట మిక్కిలి ఉత్కృష్ట వస్తువులతో తాద్రూప్య రూపణము చేయుట అతి మనోజ్ఞము. పదములన్నియు ఉదాత్తములై సమతను నిర్వహించుచున్నవి.

౫ సుం స్త ౭

౬ సుం స ౧౫

**4.2.1.4 మాధుర్యము :-**

వాక్యమందు చిన్న చిన్న పదములతో విడి విడిగా కనిపించెడి రచనా విధానము 'మాధుర్యము'.

జ్యోతిః పరం పరమతత్త్వ మథో పరాత్మా
బ్రహ్మేతి చ శ్రుతిషు యత్పరవస్త్వధీతమ్।
నారాయణస్తదితి తద్విశినష్టి కాచిత్
విష్ణోః పదం పరమమిత్యపరా గృణాతి ॥[7]

**4.2.1.5 సౌకుమార్యము :**

సుకుమారాక్షర ప్రాయమగు రచన సౌకుమార్యము.

యత్తుంగ శృంగ వినిషజ్జ సురాఙ్గనానాం
న్యస్తోర్ధ్వపుండ్రముఖమండనమండితానామ్॥
దర్పణ్యభూద్ధృతమపాఙ్కశశాఙ్కపృష్ఠం
తద్ధామ సుందరభుజస్య మహోన్నతాద్రిః ॥[8]

వర్గపంచమాక్షరముల ( ఙ మ ఞ ణ న) సంయోగము మృదువని శాస్త్రజ్ఞుల మతము. అది ఇందు అధికముగానుండుటచే సౌకుమార్యగుణమునకీశ్లోకమూటపట్టగుచున్నది.

**4.2.1.6 అర్థవ్యక్తి :-**

అర్థవ్యక్తి అనునది ఒక కావ్యగుణము ఆకాంక్షాధ్యాహారాది సాపేక్షముగాక, ఒక భావమును ప్రసన్నముగా సూటిగ వర్ణించెడి నేర్పు అర్థవ్యక్తి. వివక్షితార్థమును చక్కగా వ్యక్తీకరించుటయన్నమాట. దీనినే "యత్తు సంపూర్ణవాక్యత్వమర్థవ్యక్తిం వదంతి తామ్"[9] అని విద్యానాథుడు నిర్వచించెను.

---

7. వై. స్త 20

8. సుం. స్త 6

9. ప్ర. య భూ 611

శ్రీనిధియు, యాచకులకు నిధియైనటువంటివాడు, యాచించువారికి సమస్తమును చేకూర్చువాడు, సర్వభూత సుహృద్దయామయుడగు దేవరాజస్వామిని శరణు వేడుచున్నాను - అని భావమును ప్రసన్నముగా సూటిగా వర్ణించినందున ఇది అర్థవ్యక్తి అను గుణమగును.[10]

**4.2.1.7 కాంతి :-**

శ్లోకమునందలి పదములు ఉజ్జ్వలమగు బంధము కలిగి యుండుట 'కాంతి' యనబడును.

త్వద్దృష్టిజుష్టమిద మావిరభూదశేషం
నో చేత్కటాక్షయసి నైవ భవేత్ప్రవృత్తి:।
స్థాతుం చ వాంఛతి జగత్తవ దృష్టిపాతం
తేన శ్రుతౌ జగదిషే హి జగత్త్వమేవ ॥[11]

ఈ శ్లోకమందు దీర్ఘ సమాసములు లేవు. కాని పద్యబంధమున 'త్వద్దృష్టి జుష్టమిదం' అని ఆరంభమై ఉజ్జ్వలత్వము గోచరమగుచున్నది.

**4.2.1.8 ఔదార్యము : ( ఉదారత) :-**

వికటాక్షర బంధమే ఔదార్యము.

ఉదధిగ మందరాద్రిమథిమంథనలబ్ధపయో-
మధురరసేన్దిరాహ్వసుధసుందరదో:పరిఘమ్।
అశరణమాద్యశాత్మశరణం శరణార్థిజన-
ప్రవణధియం భజేమ తరుషణ్ణమయాద్రిపతిమ్ ॥[12]

---

10 శ్రీనిధిం నిధి మపారమర్థినా మర్థితార్థ పరిదానదీక్షితమ్।
సర్వభూతసుహృదం దయానిధిం దేవరాజమధిరాజమాశ్రయే ॥
వ స్త 2

11 వై స్త 32

12 సుం స్త 4

ఇచట శ్లోకము ఒకవిధమైనశైలితో వినువారికి తదనుగుణముగ చిందులుదొక్క అభిలాష కలుగును. ఈ సౌందర్యము లేని రచన శోభిల్లదు.

**4.2.1.9 ఉదాత్తత :-**

శ్లాఘ్యమగు విశేషణములను ప్రయోగించుటయే ఉదాత్తత యనబడును

అయే! దయాళో! వరద! క్షమానిధే!
విశేషతో విశ్వజనీన! విశ్వద! ।
హితజ్ఞ! సర్వజ్ఞ! సమగ్రశక్తిక!
ప్రసహ్య మాం ప్రాపయ దాస్యమేవ తే ॥[13]

ఇచ్చట సంబోధనరూపములన్నియు భగవంతుని మహిమనుగ్గడించుటకును, తనను దాసునిగ చేసుకొనుటకును అత్యుపయుక్తములగుటచే, అన్నియు శ్లాఘ్యవిశేషణములే శ్లాఘ్య విశేషణయోగమే ఉదాత్తత.

**4.2.1.10 ఓజస్సు :-**

దీర్ఘసమాసములతోకూడిన రచన ఓజోగుణ విలసితము

ప్రళయజనీరపూరపరిపూరితస్వనిలయావసన్నవదన -
భ్రమదశరణ్యభూతశరణార్థినాకిశరణం భవన్ స్వకృపయా ।
చలదుదధీరితాంబుకలుషీతా క్రియాఢ్యగమనస్వపృష్ఠవిధృతా-
చలకుల ఏష మీనతనురత్ర సుందరభుజో వనాద్రినిలయః ॥[14]

ఇచ్చట శ్రుతి మధురములగు దీర్ఘ సమాసములు కలవు కావున ఓజోగుణభరితము

---

13 వ స్త 93

14 సుం స్త 92

### 4.2.1.11 సుశబ్దత :-

సుబంత శబ్దములను గాని, తిజన్త క్రియాపదములను గాని అర్థపుష్టములుగా శాస్త్రీయములుగా ప్రయోగించు సామర్థ్యము సౌశబ్ద్యమనబడును.

ఐందీవరీ క్వచిదపి క్వచనారవిన్దీ
చాన్ద్రాతపీ క్వచన చ క్వచనాథ హైమీ।
కాన్తిస్తవోఢపరభాగపరస్పరశ్రీః
పార్యేత పారణయితుం కిము చక్షుషోర్మే ॥[15]

ఐందీవరీ, చాన్ద్రాతపీ ఆరవిన్దీ అను పదములు గమనింప దగినవి. ఐన్దీవరీ ( ఇన్దీవరము - నల్లకలువ) ఇన్దీవరమునకు సంబంధించినది. అదేవిధముగా చాన్ద్రాతపీ, ఆరవిన్దీ అను పదములు. ఈ అర్థము సిద్ధించుటలో ఇబ్బంది లేదు గానీ '' ప్రియతద్ధితాః దాక్షిణాత్యాః'' అను మాట జ్ఞాపకమెుచ్చుచున్నది. శ్రీవత్సాంకులు దాక్షిణాత్యులే కదా !

### 4.2.1.12 ప్రేయము :-

శ్రవణ సుభగములగు పదముల కూర్పు ప్రేయస్సు అను గుణమగును

పీతాంబరం వరదశీతలదృష్టిపాతం
ఆజానులంబిభుజమాయతకర్ణపాశమ్।
శ్రీమన్మహావనగిరీంద్రనివాసదీక్షం
లక్ష్మీధరం కిమపి వస్తు మమావిరస్తు॥[16]

ఈ శ్లోకము శ్రుతి మధురములగు పదములచే రచింప బడినది కావున ప్రేయస్సను గుణమునకు ఉదాహరణము

---

15 వై స్త 70

16 సుం స 14

**4.2.1.13 ఊర్జితము :-**

గాఢబంధత్వమే ఔర్జిత్యము

నఖక్రకచకప్రథిక్రథితదైత్యవక్షఃస్థలీ-
సముత్థరుధిరచ్ఛటాచ్ఛురితబింబితం స్వం వపుః।
విలోక్య రుషితః పునః ప్రతిమృగేంద్రశంకావశాత్
య ఏష నరకేసరీ స ఇహ దృశ్యతే సుందరః ॥[17]

ఈ శ్లోకమున గాఢబంధత్వము ప్రస్ఫుటమగుచున్నది.

**4.2.1.14 సమాధి :-**

ఒకదానియందలి ధర్మమును వేరొకదానియందు ఆరోపించి చెప్పట సమాధియను గుణమనబడును.

క్వచిత్త్వరితగామినీ క్వచన మందమందాలసా
క్వచిత్స్ఖలితవిహ్వలా క్వచన ఫేనిలా సారవా।
పతన్త్యపి కిల క్వచిద్వ్రజతి నూపురాహ్వా నదీ
సుసుందరభుజాహ్వయం మధు నిపీయ మత్తా యథా ॥[18]

ఈ శ్లోకమున నూపురనదీగమనమున మధువు సేవించిన మదవతీ ధర్మములు- అనగా అచేతనమందు చేతన ధర్మములు ఆరోపించి చెప్పినందున ఇచట సమాధియను గుణము కన్పట్టుచున్నది

**4.2.1.15 విస్తరము :-**

మొదట చెప్పిన విషయమును సమర్థించుట విస్తరమను గుణమగును.

దేవి ! త్వన్మహిమావధిర్నహరిణా నాపి త్వయా జ్ఞాయతే
యద్యప్యేవమథాపి నైవ యువయోస్సర్వజ్ఞతా హీయతే।

17 సుం స్త 37

18. అందులోనే 3

యన్నాస్త్యేవ తదజ్ఞతామనుగుణాం సర్వజ్ఞతాయా విదుః
వ్యోమాంభోజమిదంతయా కిల విదన్ భ్రాంతోఽయమిత్యుచ్యతే॥

ఓ లక్ష్మీ! నీ మహిమావధిని నీవుగానీ, నారాయణుడుగానీ తెలియజాలరు తెలియజాలరనుట సర్వజ్ఞతకు భూషణమే గానీ దూషణము గాదు 'ఆకాశ పద్మమును అదిగో! అని చూపువానిని భ్రాంతుడందురు' అని పై వాక్యమును సమర్థించినారు కావున నిట 'విస్తర' మను గుణము కలదు

**4.2.1.16 సమ్మితత్వము :-**

చెప్పవలసిన అంశమును ప్రతిపాదించుటకవసరమగు పదములను ప్రయోగించుట

"అతిమానుష శీల వృత్త వేషైః" అను శ్లోకమున శబ్దార్థములు సమపాళ్ళుగ పాసగు పద్ధతిలో వ్రాసినట్లు తెలియుచున్నది అర్థములను, పదములను తూచినట్లుగ కొలిచినట్లుగ రచన చేయుటయే సమ్మితత్వము

**4.2.1.17 గాంభీర్యము :-**

ధ్వన్యర్థపుష్టియే గాంభీర్యమను గుణమనబడును ఇది గ్రంథమంతటను కాననగును

**4.2.1.18 సంక్షేపము :-**

చెప్పదలుచుకొన్న వృత్తాంతమును అతితక్కువ పదములతో సూటిగ చెప్పటయే సంక్షేపమను గుణము

అబ్ధిం న తేరిథ న జిగ్యథ రాక్షసేంద్రం
నైవాస్య జఘ్నిథ యదా చ బలాబలం త్వమ్।

---

(1) శ్రీ స్త 8

(2) అ స్త 1

నిస్సంశయస్సపది తస్య పదేభ్యషిఞ్చ:
తస్యానుజం కథమిదం హి విభీషణం చ ॥[21]

''సాగరమును దాటలేదు. రాక్షసుని జయింపలేదు. శత్రువు బలాబలములెరుగవు. కానీ అతని తమ్ముడగు విభీషణుని నిస్సంశయముగా వెంటనే అతని స్థానమున అభిషేకించితివి కదా!'' అను ఈ శ్లోకము సంక్షేపగుణమునకు ఉదాహరణమని చెప్పవచ్చును.

**4.2.1.19 సౌక్ష్మము :-**

''అంత: సంజల్పరూపత్వం శబ్దానాం సౌక్ష్మముచ్యతే''[22] అని కదా విద్యానాధుని సౌక్ష్మగుణనిర్వచనము. అనగా- సంజల్ప మనగా సమీచీనార్థమును చెప్పట అనగా ముఖ్య వివక్షితార్థము అట్టి యర్థము ఎచ్చట అంతర్నిగూఢమై యుండునో ఆ గుణమే అంతస్సంజల్పరూప సౌక్ష్మగుణమగును

యథాఽసి యావానసి యోఽసి యద్గుణ:
కరీశ! యాదృగ్విభవో యదింగిత: ।
తథావిధం త్వాఽహమభక్తదుర్గహం
ప్రపత్తివాచైవ నిరీక్షితుం వృణే ॥[23]

ఈ శ్లోకాకారము చిన్నదే పదములు పొడి పొడిగా చిన్న పదములే కాని పదములన్నియు బహుభావగర్భితములు. వేదవేదాంతార్థ సంభరితములు ఉదా॥ ఇందలి 'యోఽసి' అన్న పదమునకు ''సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ''[24], హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ''[25] ఇత్యాది వాక్యముల

21 అ స్త 24
22 ప్ర య భూ పు 239
23 వ స్త 92
24 తై ఉ 2 . .
25 పురు ఉ . 3 3

ప్రమాణముగ భావము తెలిసికొనవలసియున్నది. కావున అంతస్సంజల్పరూపమైన సౌక్ష్మగుణమనవచ్చును

### 4.2.1.20 ప్రౌఢి :-

"ప్రౌఢిరుక్తేః పరీపాకః"[26] (ఇతి కావ్యవిదో విదుః) ఉక్తిపరిపాక విశేషమునకు అనగా చెప్పదలచుకొన్న విషయమును 'ప్రాచ్యాముదేతి సవితా' అన్నట్లుగాక కొంచెము ఆలంకారికముగా చమత్కారకముగ వక్రోక్తినర్మోక్తిగర్భితముగా వైచిత్రీవిశిష్టముగా వర్ణించుట ప్రౌఢి యనబడును.

మిత్రుల "స్తోత్రం నామకి మామనన్తి. "[27] అను శ్లోకరచన ప్రౌఢిగుణగర్భితమై ఉన్నదని పేర్కొనవచ్చును.

### 4.2.1.21 ఉక్తి :-

చెప్పదలచుకొన్నవిషయమును మిగుల ప్రౌఢముగా పాండిత్య పూర్ణముగా చెప్పగలుగుట ఉక్తియగును.

> స్తోత్రం నామ కిమామనన్తి కవయో యద్యన్యదీయాన్గుణాన్
> అన్యత్ర త్వసతోఽధిరోప్య ఫణితి స్సా త్వర్హి వంధ్యా త్వయి ।
> సమ్యక్సత్యగుణాభివర్ణన మథో బ్రూయుః కథం తాదృశీ
> వాగ్వాచస్పతినాఽపి శక్యరచనా త్వత్సద్గుణార్ణోనిధౌ ॥[28]

కవి మిక్కిలి చమత్కారముగా భగవతీస్వరూప వర్ణనీయత్వమును వర్ణించుచున్నారు కావున ఇది 'ఉక్తి' అనబడును

### 4.2.1.22 రీతి :-

ఎట్టి తీరుతో శ్లోకముపక్రమింపబడినదో అట్టి శైలితోనే

---

26 ప్ర యు భూ పు ౨౩౧

27 శ్రీ స్త ౩

28 శ్రీ స్త ౩

చివరివరకు శ్లోకమును రచించుట 'రీతి' యను గుణము

ప్రశ్చోతత్ప్రేమసారామృతరసచులకప్రక్రమప్రక్రియాభ్యాం
విక్షిప్తాలోకితోర్మిప్రసరణ ముషితస్వాంతకాన్తాజనాభ్యామ్।
విశ్వోత్పత్తిప్రవృత్తిస్థితిలయకరణైకాన్తశాన్తక్రియాభ్యాం
దేవోఽలంకారనామా వనగిరినిలయో వీక్షతా మీక్షణాభ్యామ్॥[29]

ఈ శ్లోకమునందు రచనా ప్రౌఢి అతిగంభీరము. శ్లోకారంభ మెట్లున్నదో ముగింపు కూడా అదే శైలిలో ఉన్నది సకల పాదాన్త్యప్రాసతో విలసిల్లు ఈ శ్లోకము 'రీతి'యను గుణమునకు ఉదాహరణముగ పేర్కొనబడినది

**4.2.1.23 భావికము :-**

హృదయమందలి భావావేశముతో తదనుగుణమైన వాక్య ప్రయోగ వైఖరి 'భావిక' మనెడి గుణము.

ముష్ణన్కృష్ణః ప్రియనిజజనైర్దయ్యహయ్యఙ్గవీనం
దామ్నా భూమ్నా వరద! హి యయా త్వం యశోదాకరాభ్యామ్॥
బద్ధో బన్ధక్షపణకరణీం తాం కిలాద్యాపి మాతుః
ప్రేమ్ణా గాత్రాభరణముదరాబన్ధనాఖ్యం బిభర్షి॥[30]

ఇచ్చట భూతార్థ సాక్షాత్కారమును అనగా తల్లి కట్టిన ఉదర దామమును ప్రత్యక్షముగ చూచుచున్నట్లు వర్ణించుట 'భావిక' మనెడి గుణము

**4.2.1.24 గతి :-**

స్వరముల యొక్క ఆరోహ అవరోహ క్రమమునకే గతియనిపేరు

---

29 సుం స్త 44

30 వ స్త 54

"ప్రశాన్తానన్తాత్మానుభవజమహానందమహిమ"[31] అను శ్లోకమున 'ప్రశాన్తానన్తాత్మా' అని ఆరంభమైన మొదటిపాదము దీర్ఘాక్షరములధికముగా నుండుట చేత స్వరారోహము, రెండవ పాదము స్వరావరోహము అను క్రమములో నున్నది. కావున నిట గతి యనెడి కావ్యగుణము సుస్పష్టము.

ఈ విధముగా పంచస్తవిలో కావ్యగుణ సమృద్ధియుండుట వలన స్తవముల కవితాసౌందర్యము వర్ణనాతీతము

**4.2.2 వృత్తులు :-**

వృత్తులు కైశికి, ఆరభటి, భారతి, సాత్త్వతియని నాలుగు విధములు

**4.2.2.1 కైశికి :-**

అతి సుకుమారమగు అర్థసందర్భమును వర్ణించునది కైశికీ వృత్తి శృంగార కరుణ రసములు మిక్కిలి సున్నితమగు విధమున వర్ణించిన కైశికీవృత్తి యగును.[32]

**4.2.2.1.1 శృంగారరసము :-**

యువతీయువకులకు ఒండొరులపైగల భోగవిషయకేచ్ఛా విశేషమే రతి ఇది స్థాయీ భావము ఇది స్వసామగ్రితో పరిపుష్టమైనపుడు శృంగారరసమగును. ఉదాహరణము -

పద్మాయాః ప్రణయరసాత్సమాసజంత్యాః
స్వం బాహుం సుబహుమతో భుజేన తేన।

31 వ స్త 13
32 అత్యర్థ సుకుమారార్థ సందర్భా కైశికీ మతా।
అత్యంత సుకుమారా ద్వా శృంగారకరుణౌ మతా॥
ప్ర య భూ II 15.17

కాం నామాన్వభవ దహో! దశాం తదాత్వే
కంఠ స్తే కరిగిరినాథ! కంబుకాంతః ॥[33]

కాంచీపుర దేవాధి దేవుని సంబోధించి మునుపు స్వామి యనుభవించిన గాఢాలింగనజనిత శృంగారరసానుభూతిని జ్ఞాపకపరచుచున్నారు

పై శ్లోకమునకు రెండు విధముల సందర్భమును ఊహించుకొనవచ్చును క్షీరసాగరమథనమునందవతరించిన లక్ష్మీదేవి ముగ్ధయై విష్ణుకంఠమునాలింగనముచేసికొన్న సంఘటనగా ఊహించుకొనవచ్చును

''తం దృష్ట్వా శత్రుహంతారం మహర్షీణాం సుఖావహమ్।
బభూవ హృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే॥''[34]

జనస్థానమందలి ''చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణాం''[35] అన్నట్లు అతిబలాఢ్యులై క్రూరులైన రాక్షసులను పాదచారియై ఏకాకియై సంహరించి లబ్ధవిజయుడైన శ్రీరామచంద్రుని వైదేహి తన ప్రేమ చిహ్నముగా గాఢముగ కౌగిలించినది- అను సందర్భమును మనసున తలచియైనను శ్రీవత్సాంకులు ఈ శ్లోకమును రచించియుండవచ్చును.

ఇట సీతారాముల ప్రణయపురస్కృత శృంగారరసము రసికులకు అనుభవగోచరమగుచున్నది. శృంగారము అత్యంత సుకుమారార్థసందర్భమని అలంకారికుల మతము. కాన నిట కైశికీ వృత్తి

**4.2.2.2 ఆరభటి :-**

కొంచెము మృదువగు అర్థసందర్భమును వర్ణించునది. ఇందు రౌద్ర, బీభత్సరసములు వర్ణింపబడును.[36]

---

33 వస్త 4।

34 వా రా అర ౩౦ ౩౯

35 అందులోనే 24 23

36 అత్యుద్ధతార్థ సందర్భా వృత్తిరారభటీ స్మృతా।
అత్యుద్ధత రసా రౌద్ర బీభత్సా పరికీర్తితా॥
ప్ర యు భూ ॥ 1 5 1 7

### 4.2.2.2.1 రౌద్రరసము :-

క్రింది శ్లోకమున వివరించబడిన నరసింహస్వామిచర్య వీరరసపు హద్దులు మీరినది. ధీరోదాత్తత్వమును దాటి ధీరోద్ధత గతమగు క్రౌర్యమును పూనినది శ్లోకమును తిలకింపుడు. తగినట్లుగ పద్యరచన **గూడ** ఓజస్సును పుంజుకొన్నది.

నఖక్రకచకప్రథిక్రథితదైత్యవక్షఃస్థలీ-
సముత్థరుధిరచ్ఛటాచ్ఛురితబింబితం స్వం వపుః.
విలోక్య రుషితః పునః ప్రతిమృగేంద్రశంకావశాత్
య ఏష నరకేసరీ స ఇహ దృశ్యతే సుందరః ॥[37]

సుందరభుజస్వామిని నృసింహరూపునిగా భావించి కవి ఆరభటీవృత్తి **తోడ** వర్ణించినారు. ఇక్కడ రుద్రరూపుడైన స్వామిని వర్ణించుటవలన రసము రౌద్రము. శత్రుకృతాపచారముచేత మనస్సు జ్వలించుట క్రోధము. ఇదియేనిట స్థాయీభావము. అత్యుద్ధతార్థ సందర్భమును బట్టియు రౌద్రరసమును బట్టియు ఇచ్చటి వృత్తి ఆరభటి.

### 4.2.2.3 భారతీ :-

హాస్యశాంతాద్భుత రసములు కొంచెము సుకుమారమగు సందర్భమున వర్ణింపబడిన భారతీవృత్తియనబడును.[38]

### 4.2.2.3.1 హాస్యరసము :-

వికృతవేషాది దర్శనమువలన కలిగిన మనోవికారమునకు హాసమనిపేరు. అది స్థాయీభావముగా గల రసము హాస్యరసము.

37 సుం స్త 97

38 ఈషత్ప్రద్ధార్థ సందర్భా భారతీ వృత్తి రిష్యతే।
హాస్య శాంతాద్భుతాః కించి త్సుకుమారాః ప్రకీర్తితాః।
ప్ర య భూ ॥ ౧౦. ౧౪

యన్నామ నాథ! నవనీతమచూచురస్త్వం
తచ్చాదనాయ యదితే మతి రావిరాసీత్।
కిం ముగ్ధ! దిగ్ధమమునా కరపల్లవం తే
గాత్రే ప్రమృజ్య నిరగాః కిల నిర్విశంకః॥[39]

ఈ శ్లోకమునందు బాలగోపాలుని నవనీతచౌర్యలీల వర్ణింపబడినది. వెన్న తిన్న బాలకృష్ణుని ముద్దుమోము. చేతిలో దాచుకొనిన వెన్న, చిన్ని కృష్ణుని కల్లకపటమెరుగని నడవడిక, ముఖ్యముగ అతని అప్పటి వేషము నవనీతదిగ్ధదేహము చూపరులకు నవ్వు పుట్టించును కాన నిట హాస్యరసమనుభవగోచరమగుచున్నది హాస్యరసము ఈషన్మృద్వర్థ సందర్భము కాన ఇచటి వృత్తి భారతి

**4.2.2.3.2 అద్భుతరసము :-**

ఈ రసమునకు స్థాయీభావము విస్మయము. అదృష్టశ్రుత పూర్వములగు పదార్థములను చూచుటచేతను. వినుటచేతను కలిగెడి చిత్తవిస్తారము విస్మయము

సంజీవయన్నపి మృతం సుతముత్తరాయాః
సాందీపనేశ్చిరమృతం సుతమానయంశ్చ।
ధామ్నో నిజాద్ద్విజసుతాన్పునరానయన్వా
స్వామేవ తాం తనుమహో! కథమానయస్త్వమ్॥[40]

అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రముచే మరణించిన ఉత్తరాసుతుడగు పరీక్షిత్తును బ్రతికించినప్పుడును, ఎన్నడో సముద్ర స్నానమునకేగి మరణించిన సాందీపని కుమారుని తీసుకొని వచ్చినపుడును, మృతులైన బ్రాహ్మణ బాలురను వైకుంఠమునుండి తిరిగి తీసుకొని వచ్చినప్పుడును వారివారి శరీరములతోనే ఎట్లు తీసుకొని

---

39 అ స్త 39

40 అ స 58

వచ్చితివి? ఇవి నీ యద్భుత మహిమను చాటి చెప్పచున్నవి. ఇట్లు విస్మయ జనకములగు భగవల్లీలలు - అద్భుత రసాలవాలములు ఈ రసము కూడ ఈషన్మృద్వర్థ సందర్భితము గాన - ఇచట గూడ భారతీవృత్తి.

**4.2.2.3.3 శాంతరసము :-**

ప్రశాన్తానన్తాత్మానుభవజమహానందమహిమ-
ప్రసక్తస్తైమిత్యానుకృతవితరంగార్ణవదశమ్ ।
పరం యత్తే రూపం స్వసదృశదరిద్రం వరద ! తత్
త్రయీ విస్పష్టన్తీ పరనిరసనే శ్రామ్యతి పరమ్ ॥[41]

భగవంతునకు శాంతోదిత దశయనియు, నిత్యోదిత దశయనియు రెండు దశలు కలవు. అందు మొదటిది దోషలేశాస్పృష్ట సకలకళ్యాణగుణాకరుడగు స్వస్వరూపానుభవదశ (రెండవది విభూత్యనుభవదశ) మొదటిదశ ఇందు వర్ణింపబడినది భగవంతుని తరగలులేని కడలివంటి ప్రశాంత స్తిమితదశ చక్కగా వర్ణింపబడినది. కావున ఇచట శాంతరసమనుభవగోచరమగుచున్నది శాంత రసము గూడ ఈషన్మృద్వర్థ సందర్భమే. కావున శాంతరసాశ్రయమగు పై శ్లోకమున గూడ భారతీ వృత్తియే చోటు చేసుకున్నది.

**4.2.2.4 సాత్వతి :-**

కొంచెము కఠినమగు అర్థ సందర్భమును వర్ణించునది సాత్వతీ వృత్తి. వీర భయానకరసములు కొంచెము ప్రౌఢమగు సందర్భమున వర్ణింపబడును[42]

41 । వ స్త । 3

42 ఈషత్ప్రౌఢార్థ సందర్భా సాత్త్వతీ వృత్తి రిష్యతే ।
ఈషత్ప్రౌఢా సమాఖ్యాతా రసౌ వీరభయానకౌ ॥
ప్ర య భూ ॥ । ౧ । ౮

**4.2.2.4.1 వీరరసము :-**

లోకోత్తమములైన కార్యములను సంకల్పించి చేపట్టి నిర్వహించు దృఢ యత్నమునే ఉత్సాహమందురు. అట్టి ఉత్సాహమును స్థాయీభావముగాగలదే వీరరసము.

అరాళం పాతాళం త్రిదశనిలయ: ప్రాపితలయ:
ధరిత్రీ నిర్ధూతా యయురపి దిశ: కామపి దిశమ్ ।
అజృమ్భిష్టామ్భోధిర్ఘుముఘుమితి ఘూర్ణన్ సురరిపో:
విభిన్నానే వక్షస్త్వయి నరహరౌ సుందరభుజ! ॥[43]

ప్రహ్లాదుని నానాబాధలుపెట్టుచున్న హిరణ్యకశిపుని వజ్ర పంజరమువంటి వక్ష:స్థలమును భేదింప, నరసింహస్వామి స్తంభమున అవతరించెను. ఆ సందర్భమును పురస్కరించుకొని రచింపబడినదీ శ్లోకము.

ఇచట నరహరియొక్క వీరవిహారము స్పష్టముగ శ్రీవత్సాంకులు ధ్వనింపజేసిరి. అతివేలబలదర్పితుడైన హిరణ్యకశిపుని వధించుటకై భగవంతుడు చూపిన అతిమాత్రోత్సాహముచే నిచట వీరరసము ధ్వనింప చేయబడినది.

**4.2.2.4.2 భయానకరసము :-**

''అరాళం పాతాళం'' అను శ్లోకమునందు భయానక రసముగూడ అనుభవగోచరమగుచున్నది. నృసింహావతారమున ప్రపంచమంతయు హడలిపోయినట్లు వర్ణించినందున రౌద్రాకారాది దర్శన జన్యమైన అనర్థాశంకయే భయము. దానిని స్థాయిగా గొన్నది భయానక రసము. ఈ షత్ర్పాధార్థ సందర్భములగు వీర భయానకములు వ్యంజితములగుటచేత వృత్తి సాత్త్వతి యగుచున్నది.

43 సుం స ౨౦

**4.2.3 రీతులు :-**

ఓజస్సు, ప్రసాదము మొ॥ గుణములు గల పదముల సంయోజనమే రీతి యనబడును.[44] కావ్యమునకు రీతి ఆత్మయని వామనాచార్యుల యభిప్రాయము [45] ఈ రీతి కావ్యమున వైదర్భీ గౌడీ రీతులు ప్రధానములు మూడవది పాంచాలి రీతి. ఈ రీతులకు పంచస్తవిలో ఉదాహరణలు కోకొల్లలుగా నున్నవి. కొన్ని మాత్రము క్రింద పేర్కొన్నబడుచున్నవి.

**4.2.3.1 వైదర్భీ :-**

బంధపారుష్యరహితమై, శబ్దకాఠిన్యములేనిదై, దీర్ఘసమాసములులేనట్టిదైన రీతి వైదర్భి.[46]

ఉదాహరణము -

యన్మంగళాయ మహతే జగతాముశన్తి
త్రైవిష్టపాన్యపి పదాని యదాశ్రయాణి।
వందామహే సరసిజేక్షణమద్వితీయమ్
వేదాంతవేద్యమనిదంప్రథమం మహస్తత్ ॥[47]

ఇందు దీర్ఘసమాసములు గాని, బంధపారుష్యముగాని, శబ్ద కాఠిన్యముగాని లేదు కాన వైదర్భీరీతి.

44 రీతిర్నామ గుణాశ్లిష్టపదసంఘటనా మతా।
ప్ర య భూ II 27

45 రీతిరాత్మా కావ్యస్య
కా సూ । 6

46 బంధ పారుష్య రహితా శబ్ద కాఠిన్య వర్జితా ।
నాతి దీర్ఘ సమాసా చ వైదర్భీ రీతిరిష్యతే॥
ప్ర య భూ II 7

47 వై స్త 4

**4.2.3.2 గౌడీ :-**

ఓజస్సనగా సమాసమయము. బంధముజ్జ్వలముగా నుండుట కాంతి. ఈ రెండుగుణములు కలది గౌడీరీతి[48]

భక్తిప్రభావభవదద్భుతభావబంధ-
సన్ధుక్షితప్రణయసారరసౌఘపూర్ణః।
వేదార్థరత్ననిధిరచ్యుతదివ్యధామ
జీయాత్పరాంకుశపయోధిరసీమభూమా ॥[49]

ఓజః కాంతి గుణములు రెండు ఇందున్నవి. కాన గౌడీ రీతి

**4.2.3.3 పాంచాలీ :-**

పాంచాలీరీతి, వైదర్భీ గౌడీ రీతుల కలయిక.[50]

త్రైవిద్యవృద్ధజనమూర్ధవిభూషణం యత్
సంపచ్చ సాత్త్వికజనస్య యదేవ నిత్యమ్।
యద్వా శరణ్యమశరణ్యజనస్య పుణ్యం
తత్సంశ్రయేమ వకుళాభరణాంఘ్రియుగ్మమ్ ॥[51]

పై శ్లోకమున వైదర్భీ గౌడీ రీతుల సమ్మిశ్రణము కాననగును కావున పాంచాలీ రీతి యనవచ్చును.

**4.2.4 శయ్యా :-**

పదముల కూర్పులో పదములకు మిక్కిలి స్నేహమున్నట్లుగా వర్ణించుట. అనగ ఏ పదమును తీసి వేరొక పదమును పెట్టినను శ్లోకము

48. ఓజః కాంతి గుణోపేతా గౌడీయా రీతి రిష్యతే
ప్ర య భూ II 28

49 వై స్త 3

50 పాంచాల రీతిర్వైదర్భీ గౌడీ ఇత్యుభయాత్మికా
ప్ర య భూ II 32

51 వై స 2

మధురముగా ఉండకపోవుటయే శయ్య[52]

యత్త్వం కృతాగసమపి ప్రణతిప్రసక్తం
తం వాయసం పరమయా దయయాఽక్షమిష్ఠాః।
తేనైవ మాదృశజనస్య మహాగసోఽపి
యుక్తం సమాశ్వసనమిత్యుపధారయామి ॥[53]

అంత కంటే ఈ క్రింది శ్లోకమున శయ్య మరింత సుందరముగా నున్నది.

నీలమేఘనిభమంజనపుంజ-
శ్యామకుంతలమనంతశయం త్వామ్।
అబ్జపాణిపదమంబుజనేత్రం
నేత్రసాత్కురు కరీశ! సదా మే ॥[54]

ఈ శ్లోకమున పదముల కూర్పు కడుమధురము. ఏ ఒక్క పదము కూడ మార్పిడిని సహింపదు

**4.2.5 శబ్దాలంకారములు :-**

అనుప్రాస ప్రధానవములగు వృత్తులు మూడు- పరుష, ఉపనాగరిక, కోమల అని. అందు ఉపనాగరికావృత్తికి లలితమనియు పేరు ఉపనాగరిక యనగా నాగరికయైన విదగ్ధ నాయికతో పోల్చదగినదై యుండుట పరుషవర్ణములులేక వర్గపంచమాక్షరములతో కలసిన వ్యంజనాక్షరముల సంయోగమగు ఙ్క, ఞ్చ, ణ్ట, న్త, మ్ప, వంటి వర్ణములు అతి సుకుమారములు. ఈ గ్రంధమందట్టి వర్ణ విన్యాసములధికముగా నుండి కావ్యమునకు రమణీయతను కల్పించుచున్నవి.

52 యా పదానాం పరాన్యోన్య మైత్రీ శయ్యేతి కథ్యతే
ప్ర య భూ ll 35

53 అ స్త 34

54 వ స 23

### 4.2.5.1 ఉపనాగరిక :-

''యత్తుఙ్గశృఙ్గవినిషఙ్గిసురాఙ్గనానాం''

అను శ్లోకమున ఙ్క, ఙ్గ, ఙ్ఞ, న్ద వర్ణములను పలుమారులు ప్రయోగించుటచే శ్లోకమునకు అతి శ్రావ్యత్వమేర్పడి ఉపనాగరికా వృత్తియగుచున్నది.[55]

### 4.2.5.2 ఛేకానుప్రాస :-

సంవర్తసంభృతకరస్య సహస్రరశ్మే:
ఉస్రం తమిస్రయదజస్రవిహారి హారి ।[56]

ఇచట హారి హారి అనుచోట ఛేకానుప్రాస.

### 4.2.5.3 యమకాలంకారము :-

ఏవం తయా చతురయా తవ యౌవనాద్యా:
సర్వే గుణాస్సహ సమస్తవిభూతిభిశ్చ ।
ప్రవ్యాహృతాస్స్యురవధీనవధీరయన్త:
వాచామగోచరమహామహిమాన ఏవ ॥[57]

వధీ వధీ' పదాంశములు రెండుమార్లు ప్రయుక్తములు 'వధీ వధీ' లకు మధ్య - 'అవధీనవధీరయన్త' అనుచోట 'న'కారమున్నది అవ్యవహితముగ వ్యంజనయుగ్మమునకు ఆవృత్తియున్నచో అది ఛేకానుప్రాసము. అనగ 'న' కార వ్యవధానము యమక భంగకరము కాదు

55 సుం స్త్ర 1
56 పై స్త్ర 58
57 పై స్త్ర 52

**4.2.5.4 వృత్త్యనుప్రాసము :-**

'వాచామగోచర మహామహిమాన ఏవ' అనుచోట చకార మకార హకారాదులకు ఆవృత్తియున్నందున ఇట వృత్త్యనుప్రాసము కూడ నున్నది

పంచస్తవములందు వృత్త్యనుప్రాసాదులు ఇంచుమించు ప్రతి శ్లోకమునను ప్రత్యక్షమగును. శబ్దాలంకారమలేని శ్లోకము చాలా అరుదు. శబ్దాలంకారములు అయత్నసాధ్యములై తోచును. మీదు మిక్కిలి వృత్త్యనుప్రాసాలంకారము అతి బహుళము.

యత్తత్త్వమక్షరమదృశ్యమగోత్రవర్ణ-
మగ్రాహ్యమవ్యయమనీదృశమద్వితీయమ్ ॥[58]

ఇచట 'మ' కారమునకు పునఃపునరావృత్తి మరియు విశేషమేమన ప్రతి పదము (సంధిలో ఏర్పడినదే అయినను) మకారారబ్ధమై యుండుట అతి చమత్కారావహము ఏ శ్లోకమున చూచినను కొట్టవచ్చినట్లు వర్ణావృత్తి కనిపించును. దానిచే కావ్యశోభ అనుభవవేద్యమే.

**4.2.6 అర్థాలంకారములు :-**

**4.2.6.1. ఉపమాలంకారము :-**

ఉపమాలంకారము అలంకారములలో ప్రథమముగా పేర్కొనదగినది ఇది బహు అలంకారములకు మూలకందము.

ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్ర భూమికా భేదాన్ ।
రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విదాం చేతః ॥[59]

అని అప్పయ్యదీక్షితులవారు దీనిని శ్లాఘించినారు ఈ

58 పై స్త ౦
59 చి మీ పు ౦

అలంకారమునకు పంచస్తవిలో బహువార బహువిధనిర్వాహము కాననగును. ఉదాహరణమునకు -

న్యాయస్మృతిప్రభృతిభిర్భవతా నిసృష్టై:
వేదోపబృంహణవిధావుచితైరుపాయై:।
శ్రుత్యర్థమర్థమివ భానుకరైర్విభేజు:
త్వద్భక్తిభావితవికల్మషశేముషీకా:॥[౮౦]

ఓ పురుషోత్తమా! నీ భక్త్యావేశముచేత నిర్మలమతులగు పురుషులు పరులయందావేశించి నీచేనొసగబడిన న్యాయ మీమాంసాది శాస్త్రరూపములైన వేదార్థనిర్ణాయకోపాయములచేత, సూర్యకిరణముల చేత ఘటపటాది వస్తుస్వరూపము చక్కగా తెలిసికొనినట్లుగా పదార్థముల నిత్యానిత్యత్వములను, హేయోపాదేయత్వములను, మంచిచెడ్డలను తెలిసికొనుచున్నారు

సూర్యకిరణములచేత ఘటపటాదులను వేర్పరచి తెలిసికొనునట్లుగా న్యాయాది శాస్త్రములచేత సృష్టిగత సర్వపదార్థముల మంచిచెడ్డలను భక్తిపవిత్రిత చేతనులైనవారు స్పష్టముగ తెలుసుకొనుచున్నారు. ఇచట ఉపమస్పష్టము

**4.2.6.2 రూపకాలంకారము :-**

ఉపమేయమందు ఉపమానము యొక్క ధర్మమును ఆరోపించి చెప్పట రూపకాలంకారము.

సుచారు చాపద్వయవిభ్రమం భ్రువో:
యుగం సునేత్రాహ్వసహస్రపత్రయో:।
ఉపాన్తగం వా మధుపావలీయుగం
విరాజతే సుందరబాహుసంశ్రయమ్॥[౮౧]

---

౮౦ వై స్త 15

౮౧ సుం స 42

సుందర బాహు స్వామి యొక్క సుందర ధనుర్ద్వయమనో జ్ఞములైన కనుబొమల జంట మనోహర నయనరూపములైన ( సహస్రపత్ర = వేయిరేకులుగల) పద్మముల యొక్క ప్రాంతమున నున్నట్టి రెండు భ్రమర పంక్తులవలె నున్నవి

నేత్రములందు సహస్ర పత్ర కమలత్వము ఆరోపింపబడినది. అట్లే కనుబొమల జంటయందు మధుకరపంక్తి ద్వితయత్వము ఆరోపింపబడినది. కావున ఇచట రూపకాలంకారములు రెండు ఉన్నవి కానీ ఇవి రెండును స్వతంత్రములు కావు ఒకదానిపై ఒకటి ఆధారపడి యున్నది. నేత్రములను కమలములుగా రూపించినాడు కమలములవద్ద మకరందముచే తుమ్మెదల బారులుండుట సహజమే కనుక తీర్చిదిద్దినట్లున్న నల్లని కనుబొమలను భ్రమరశ్రేణిగా రూపణ చేయవలసి వచ్చినది. కావున ఒక రూపణకు హేతువైన మరొక రూపణముండుట చేత ఇది పరంపరిత రూపకమయినది.

ఈ శ్లోకమందలి 'వా' అను అవ్యయము ' ఇవ' వలె సాదృశ్యవాచకము

**4.2.6.3 ఉత్ప్రేక్షాలంకారము :-**

ఉపమానమును ఉపమేయముగా ఊహించిన అది ఉత్ప్రేక్షా- లంకారము అనగా హేతువు కాని దానిని హేతువుగా భావించినట్లు వర్ణించినచో అచట ఉత్ప్రేక్షాలంకారమగును.

శ్రీమత్పరాంకుశమునీంద్రమనోనివాసాత్
తజ్జానురాగరసమజ్జనమంజసాఽఽప్య।
అద్యాప్యనారతతదుత్థితరాగయోగం
శ్రీరంగరాజచరణాంబుజమున్నయామః॥[62]

62 అ స్త ౨

శ్రీనమ్మాళ్వార్లు (పరాంకుశులు) శ్రీరంగనాధునకు అత్యంతాంతరంగభక్తులు కావున ఆయనయొక్క హృదయమందే శ్రీస్వామి చరణాంబుజములుండినవి అందుచేత ఆ హృదయపు అనురాగమున రంజితములైనవి శ్రీపాదములు. నిరంతరవాసముచేత హృదయానురాగము చరణములందు దృఢముగ అంటుకొనినది అంత గాఢముగలగ్నమైనది ఆ రాగము శ్రీస్వామి చరణములందు కాన వచ్చుచున్నదని భావింతును - అని ఈ శ్లోక భావము

శ్రీస్వామి చరణకమలములు సహజరాగరంజితములే అయినను శ్రీ పరాంకుశముని హృదయనివాససంక్రాంతరాగములని కవి యుత్ప్రేక్షించినారు హేతువు కాని దానిని హేతువుగా ఉత్ప్రేక్షించుట చేత నిట ఉత్ప్రేక్షాలంకారము

**4.2.6.4 అతిశయోక్త్యలంకారము :-**

ఉపమేయమునకు ఉపమానమునకు సంబంధము లేకున్నను ఉన్నట్లు వర్ణించినచో అది అతిశయోక్త్యలంకారము. అతిశయముగా చెప్పట అతిశయోక్తి

వేణుక్వణప్రణయిని త్వయి లోకనాధ !
బృందావనం చరణసఞ్చరణైః పునానే !
భావాస్తదా వనభువః కిల కీదృశస్తే
త్వద్గీతసిక్త సికతాసు వసుందరాసు ॥

నీ రాసక్రీడా సమయమున నీ వేణుగాన సుధాధారలచేత శిలలు సలిలములైనవి పృథివ్యాదిపంచభూతములు తమ తమ నైజగుణములు కోల్పోయినవి కఠినమైన పృథివి మృదువైనది తేజస్సు (అగ్ని) వేడి విడిచి శీతలమైనది నీరు తన వేగగుణమును మాని (వేణుగాన వినుటకై) మందగతి యైనది అంతరిక్షము

---

[illegible]

అదృశ్యరూపమును త్యజించి ప్రత్యక్షరూపము స్వీకరించినది. వాయువు ఆశుగత్వము విడిచి నిలచి వినదొడగినది రాళ్ళు కరుగుట, పంచ భూతములు స్వస్వ గుణములు కోల్పోవుట, రూపాంతరము చెందుట సంబంధము లేకున్నను ఉన్నట్లు వర్ణించుటచేత అతిశయోక్తియైనది

**4.2.6.5 విభావనాలంకారము :-**

ఏతత్కథం కథయ యన్మథితస్త్వయాసౌ
హిత్వా స్వభావనియమం ప్రథితం త్రిలోక్యామ్।
అశ్వాప్సరోవిషసుధావిధుపారిజాత-
లక్ష్మ్యాత్మనా పరిణతో జలధిర్బభూవ॥

క్షీరసాగరమథనసమయమున అశ్వాద్యుత్పత్తికి కారణము కానట్టి సాగరజలమునుండి సుధావిషలక్ష్మ్యాదులు పుట్టినట్లు వర్ణించుటచేత విభావనాలంకారము మరియు, ఇక్కడ సముద్రమును క్షీరసముద్రముగా గ్రహింపవలసినందున, పాలను చిలకగా వెన్న పుట్టుట న్యాయము కాని యిట విషము పుట్టినట్లు వర్ణించినారు కావున "విరూప కార్యస్యోత్పత్తిరపరం విషమం మతమ్" అను లక్షణమును బట్టి విరుద్ధకార్యనిష్పత్తి రూపవిషమాలంకారముకూడా నున్న దనవచ్చును

**4.2.6.6. విశేషోక్త్యలంకారము :-**

కావలసినంత కారణసామగ్రియున్నను కార్యమేర్పడనట్లు వర్ణించిన అచట విశేషోక్తి

అంభోధేః స్వయమభిమంథనం చకర్థ
క్షోణీంధ్రం పునరభిభశ్చ సప్తరాత్రమ్।

---

[illegible]

[illegible]

సప్తానాం వివలయసిస్మ కంఠముక్తా-
మమ్లానా వరద ! తథాఽపి ప్రాణయస్తే ॥[౦౬]

ఓ వరదరాజస్వామీ ! నీవే స్వయముగ పాల సముద్రమును మథించితివి. గోవర్ధనపర్వతమును సప్తరాత్రులు ధరించితివి. వృషభ సప్తభ సప్తకముయొక్క మదమడంచి మెడలు వంచితివి. ఇట్టి దుస్సాధ వీరకృత్యములు చేజేతుల చేసియు నీ సుకుమారకరతలములు కందలేదు. కాంతి తరగలేదు. మార్దవము మరగిపోలేదు.

కరముల హానికి, గ్లానికి తగిన హేతువులుండియు అవి కొలదిపాటి వన్నెతరుగుకూడ లేకుండినట్లు వర్ణించినందున అలంకారము విశేషోక్తి.

**4.2.6.7 తుల్యయోగితాలంకారము :-**

కేవల ప్రకృతములకు గాని, కేవలాప్రకృతములకు గాని ధర్మైక్యము వర్ణించుట తుల్యయోగిత.

రంభాస్తంభా: కరివరకరా: కారభాస్వారభాజో
వేషాఽఽశ్లేషా అపి మరకతస్తంభముఖ్యాస్తులాఖ్యా: ।
సామ్యం సమ్యగ్వరద! న దధు: సర్వమురోర్వ స్త్వదూర్వో-
ర్నష్ట్యైశ్వర్యం దధతి న తథా యౌవనారంభజృంభా: ॥[౦౭]

ఈ శ్లోకమున స్వామి యూరువులు ప్రకృతములు. ఉపమేయములు కదలీ కాండములు, కరికరము, కరభము మరకతస్తంభములు ఉపమాన వస్తువులు [౦౮]

౦౬ వ స్త ౪౫

౦౭ వ స్త ౫౦

౦౮ కవి సంప్రదాయమున నలుపును, ఆకుపచ్చనివర్ణమును అభిన్నముగా సంభావింతురు. ''పత్రశ్యామా'' మొ॥

భగవదంగ సౌందర్య ఘట్టమున పై యుపమాన పదార్థముల కన్నిటికిని సావర్ణ్యానర్హత్వగుణయోగము వర్ణింపబడినందున అవర్ణ్యములకు ధర్మైక్యరూపమగు తుల్యయోగితాలంకారమిట నిర్వ్యాధము.

**4.2.6.8 ప్రతివస్తూపమాలంకారము :-**

ఉపమాన పరమగు వాక్కు ఒకటి ఉపమేయ పరమగు వాక్కు ఒకటి ఆ రెంటియందును ఒక సమానధర్మము వేర్వేరుగ నిర్దేశించుటచే ప్రతివస్తూపమ. ప్రతివస్తూపమ అనగా ప్రతివస్తు = ప్రతివాక్యము నందును ఉపమ = సమాన ధర్మమున్నందున ఇది యన్వర్థనామము.

యే తు త్వదంఘ్రిసరసీరుహభక్తిహీనా
స్తేషామమీభిరపి నైవ యథార్థబోధః।
పిత్తఘ్నమంజనమనాప్నుషి జాతు నేత్రే
నైవ ప్రభాభిరపి శంఖసితత్త్వబుద్ధిః॥[౦౨]

ఇచట రెండు వాక్యములున్నవి -

౧. మానవులు ఎంతటి శాస్త్రార్థజ్ఞానముకలవారైనను నీ పాదారవిందములపై భక్తిలేనివారైనచో వారికి తత్త్వార్థ బోధ యేర్పడదు.

౨. సూర్యుని వెలుగు ఎంతయున్నను పిత్తదోషోపహతమైన కంటికి పిత్తహరమగు అంజనమును వాడనిచో శంఖము తెల్లనిది అను యథార్థజ్ఞానమేర్పడదు

ఒకటియున్నను ముఖ్యమగు వేరొక్కటి లేనిచో అది ప్రయోజనకారి కాదు. జ్ఞానమున్నను భక్తిలేనిచో తత్త్వజ్ఞానమేర్పడదు. వెలుగు ఉన్నను పిత్తహరౌషధము లేనప్పుడు యథార్థజ్ఞానము (శంఖ

౦౨ వై స్త ౹ ౬

ధవళత్వము) కలుగదు ఇట్లిచట రెండు వాక్యములందును సమానధర్మ మున్నందున ప్రతివస్తూపమాలంకారము స్ఫుటమగుచున్నది

**4.2.6.9 దృష్టాంతాలంకారము :-**

క్షోదీయానపి దుష్టబుద్ధిరపి నిఃస్నేహోప్యనీహోఽపి తే
కీర్తిం దేవి! లిహన్నహం న చ బిభేమ్యక్ష్ణో న జిహ్రేమి చ
దుష్యేత్సా తు న తావతా న హి శునా లీఢాపి భాగీరథీ
దుష్యేచ్ఛ్వాపి న లజ్జతే న చ బిభేత్యార్తిస్తు శామ్యేచ్ఛునః ॥[70]

ఓ లక్ష్మీదేవీ! నేను అతిక్షుద్రుడను. దుష్టబుద్ధిని. భక్తిహీనుడను అందుచేతనే భక్త్యనుగుణకైంకర్యచర్యారహితుడను ఇట్లు యోగ్యతా లవలేశము లేనివాడను. అయినను నీ కీర్తిని స్తోతవ్యబుద్ధితో ఆస్వాదించుట తెలియనివాడనని నేను భయపడుట లేదు ఇది దార్ష్టాంతిక వాక్యము (సమర్థనీయము) దీనిని సమర్థించుటకై శునక వృత్తాంతమును వర్ణించెడి ఒక దృష్టాంతవాక్యమును కూరేశులిట కూర్చుచున్నారు. క్షుద్ర జంతువగు ఒక శునకము ( దప్పిక తీర్చుకొనుటకై) భాగీరథిని సమీపించి గటికి నీరు త్రాగును అంతటితో గంగకు దోషమంటదు. శునకముకూడా తన యల్పత్వము తలచుకొని సిగ్గుపడదు, భయపడదు అట్లే తల్లీ నీ కీర్తిని నేను కొనియాడి. నా స్తుతిచ్చను నెరవేర్చుకొందును ఇచట కూడ రెండు వాక్యములకు నడుమ బింబప్రతిబింబాత్మకమగు సామాన్యధర్మము స్పష్టముగ భాసించుచున్నది. అట్లగుట నిది దృష్టాంతాలంకారము.

**4.2.6.10 వ్యతిరేకాలంకారము :-**

ఉపమానముకంటే ఉపమేయమునకు గొప్పతనము వర్ణింపబడినచో అది వ్యతిరేకాలంకారము

---

70 శ్రీ స్త 5

ఉపవనతరుషణ్డైర్మణ్డితే గణ్డశైల-
ప్రణయిభవదుదన్తోద్గాయిగన్ధర్వసిద్ధే।
వనగిరితటభూమిప్రస్తరే సుందర! త్వం
భజసి ను మృగయానానుద్రవశ్రాన్తిశాన్తిమ్ ॥[71]

జింకను తరుముకొని పోయెడి శ్రమలేకయున్నావనుటచే నిట యుగాంతర వృత్తాంతము స్ఫోరితము పూర్వము దండకారణ్యమున(?) రామావతార సందర్భమున మారీచుడు మాయాహిరణ్యమృగరూపుడై రాగా, దైవవంచితుడవైన నీవు మృగము వెంట పలిగిడి శ్రమపడితివి. కాని ఇప్పడాశ్రమలేక వనగిరిపై సుఖముగా నున్నావు అని స్వామితో కవి పలుకుచున్నాడు- వెనకటి దండకావనము బాధలు పెట్టినది ఈ గిరివనము శ్రమలేక హాయిగొల్పుచున్నది అను భావము ప్రతీయమానమగుటవలన వ్యతిరేకాలంకారము (దాని కంటె ఇది మేలు) అని తెలియుచున్నది.

**4.2.6.11 వ్యాజస్తుతి :-**

క్షాంతిస్తవేయమియతీ మహతీ కథం ను
ముహ్యేదహో! త్వయి కృతాంజలిపంజరేషు।
ఇత్థం స్వతో నిఖిలజంతుషు నిర్విశేషం
వాత్సల్యముత్సుకజనేషు కథం గుణస్తే ॥[72]

మహామహిమోపేతమగు ఎల్లలేని పక్షపాతములేని నీ క్షమాగుణము నీయెడ భక్త్యంజలి ఘటించువారి విషయమున నెట్లు మోహము చెందును. విస్మరించును వారిని తప్పక క్షమించి యుద్ధరించును. ఇట్లు సకల జీవరాశియందును స్వ పర భేదములేక, స్వారసికముగనే నీ యపార వాత్సల్యము నీ భక్తజనులపై ప్రసరించుట

71 సుం స్త 104

72 వై స్త 63

గుణమెట్లగును? ఇది గుణము కాదు అని పైపైకి నింద తోచుచున్నది కాని, భంగ్యంతరముచే నిది స్తోత్రమందే పర్యవసితము భక్తులయెడ వాత్సల్యాదరములు చూపుట యొక గొప్ప శ్లాఘ్యగుణము కాదు మరి నీయందు భక్తి శ్రద్ధలు చూపని వారియెడ కూడ చూపెడు నీయవ్యాజవాత్సల్యగుణము కడు శ్లాఘ్యము. అది ఎంత గొప్పది! అని ఆపాతత: తోచెడు నింద, స్తుతి పర్యవసాయి యగుటచే నిది వ్యాజస్తుతి. అనగా నిందను వ్యాజముగ చేసి స్తుతించుటేయని తాత్పర్యము

**4.2.6.12 పర్యాయాలంకారము :-**

ఆమ్నాయమూర్ధని చ మూర్ధని చోర్ధ్వపుంసాం
యద్ధామ వైష్ణవ మభీక్ష్ణతరం చకాస్తి ।
తన్మాదృశా మపి చ గోచర మేతి వాచో
మన్యే తదీయ మిదమాశ్రితవత్సలత్వమ్ ॥[73]

శ్రీవిష్ణు సంబంధియగు ఏ దివ్యజ్యోతి (లేదా విగ్రహము) శ్రుతి శిరస్సులపై (ఉపనిషత్తులందు వేదాంతములందు) మిగుల ప్రకాశించునో, పూర్వాచార్యుల శిరస్సులందు మిగుల వెలుగొందునో అట్టి దామము (జ్యోతి, దివ్యవిగ్రహము) మా వంటివారి వాక్కులందును గోచరమగుచున్నది. ఇది కేవలమాశ్రితవత్సలుని వాత్సల్యమే

ఇట్లు విష్ణుధామము క్రమముగ వేదాంతములందును, పూర్వాచార్యుల శిరములందును, కవి వచనములందును ఉన్నట్లు వర్ణించుట చేత పర్యాయాలంకారమగుచున్నది.

"పర్యాయో యది పర్యాయేణైకస్యానేక సంశ్రయః ।"[74]

**ఒక వస్తువునకు క్రమముగ అనేక వస్తువులయాశ్రయణము వర్ణించుట పర్యాయాలంకారము**

---

73 వై స్త 7

74 కు ఆ 110

**4.2.6.13 అర్థాంతరన్యాసము :-**

మాత్రా యది త్వమసి దామని సన్నిబద్ధః
తన్మ్రావిణాముదితచాక్షుషనిర్ఘరాణామ్।
బధ్నాసి హంత! హృదయం భగవన్ కుతస్తత్
సర్వో హి వశ్యవిషయే వివృణోతి వీర్యమ్॥[75]

ఓ కృష్ణా! నీవు నీ తల్లిచే తాడుతో కట్టబడితివి. ఆ కథవిన్న ఆర్యజనుల హృదయమును నీవు కట్టిపడవైచుచున్నావు. (అద్భుత సౌశీల్యగుణముచే ఆకట్టుకొనుచున్నావని భావము.) నీ తల్లికి నీవు వశ్యుడవు. నీకు ఆర్యజనులు వశ్యులు ప్రతి వ్యక్తియు తనకు వశ్యుడైన వాని విషయముననే తన ప్రతాపమును చూపును. మాతృకృత శిశూదర బంధమును బాలకృష్ణకృత భక్తహృదయబంధమును విశేష వృత్తాంతమును సమర్థింప 'ప్రతి వ్యక్తియు తనకు వశ్యుడైన వాని యెడ తన ప్రతాపము చూపును' అను సామాన్య విషయమును పేర్కొనుటబట్టి అర్థాంతరన్యాసాలంకారము

**4.2.6.14 ఉదాత్తాలంకారము :-**

''సమృద్ధి మద్వస్తువర్ణన ముదాత్తః''

శ్రీవత్సకౌస్తుభకిరీటలలాటికాభిః
కేయూరహారకటకోత్తమకర్ణికాభిః।
ఉద్దామదామమణినూపురనీవిబంధైః
భ్రాంతంభవంతమనిమేషముదీక్షిషీయ॥[76]

ఈశ్లోకమునందు శ్రీమన్నారాయణుని అనర్ఘవిభూషణజన్య కాన్త్యుజ్వలతను శ్రీహరి ధరించియున్నట్లు వర్ణించుటచేత

75 అ స్త 41

76 వై స్త 75

బహుమూల్యానేకభూషణసమృద్ధి ఇట ధరింపబడినట్లు పేర్కొనుట చేత ఉదాత్తాలంకార మీశ్లోకమున నిర్వహింపబడినది.

ఇచట శ్రీవత్సమనునది శ్రీహరికి పుట్టువచ్చుయైనను వక్షఃస్థలమున వింత శోభనొడగూర్చుటచే ''తన్మధ్యపతితః తద్గ్రహణేన గృహ్యతే'' అను న్యాయము చొప్పన వానిలో చేరియున్న దీనిని కూడా ఆభరణముగనే గ్రహించుటలో ఔచిత్యమున్నది.

### 4.2.6.15 ఆగమప్రమాణాలంకారము :-

శ్రుతి ప్రమాణము, స్మృతి ప్రమాణముల వలె ఆగమ ప్రామాణ్యము కూడా ఒక అలంకారము.

> జ్ఞానం బలం విపులమీశనవీర్యశక్తి-
> తేజాంసి చ త్రియుగభూయముపాగతాని ।
> పూర్ణాని షట్ చ పరిగృహ్య భవంశ్చతుర్ధా
> భక్తం జనం త్వమనుజగ్రహిథానురాగాత్ ॥[77]

అతి విస్తృతములైన జ్ఞాన బలములు, ఐశ్వర్యవీర్యములు, శక్తి తేజస్సులు అను గుణములు మూడు జంటలుగాయున్నను పరిపూర్ణములై సమస్తములైన ఆరు గుణములను పరిగ్రహించి, వాసుదేవ- సంకర్షణ- ప్రద్యుమ్న- అనిరుద్ధ నామధేయములతో చతుర్విధ రూపములుగొని ప్రీతితోడ భక్తజనులను అనుగ్రహించితివి. నీ రూపములను నాలుగు విధములు చేసికొనుట ఆశ్రితులను కాపాడుటకే.

i) పరవాసుదేవుడొక్కడే షాడ్గుణ్య పూర్ణుడు, నిత్యముక్తాను భావ్యుడు సంకర్షణాది వ్యూహ త్రయమందు వారి వారి కృత్యములను బట్టి రెండేసి గుణములుండును.

ii) సంకర్షణుడు జ్ఞానబలములు కలవాడు రుద్రాధిష్ఠాతయై, సంహారక్రియను, శాస్త్రప్రదానమును చేయును

---

77 అ.స.౦

III) ప్రద్యుమ్నుడు ఐశ్వర్యవీర్యగుణములనుకలిగి చతుర్ముఖు నధిష్ఠించి సృష్టిని ధర్మమును ప్రవర్తింపజేయును.

IV) అనిరుద్ధుడు శక్తితేజస్సులును ధరించి స్వస్వరూపముతోడనే రక్షణమును మోక్షప్రదానమును చేయును.

ఇవి చతుర్వ్యూహముల గుణకృత్యములు. ఈ విషయమునే పరాశర భట్టార్యులు శ్రీ రంగరాజ స్తవమందు వివరించిరి.[78] ఈ శ్లోకవమునకు పాంచరాత్రాగమములు ప్రమాణమగుటచేత అగమప్రమాణాలంకారము ఇందున్నదనుట యుక్తము.

**4.2.6.16 అసమాలంకారము :-**

అతిమానుషశీలవృత్తవేషైః
అతివృత్తామరవిక్రమప్రతాపైః।
అతిలంఘిత సర్వలోక సామ్యం
వరయే వైష్ణవవైభవావతారమ్ ॥[79]

దేవతల ప్రతాప పరాక్రమములను అధిగమించునట్టిదియు, మనుష్యదుర్లభములైన చరిత్రవేషములచేత, అతిక్రమింపబడిన సకల జనసామ్యముకల విష్ణుసంబంధి రామకృష్ణాదివిభవావతారమును సమాశ్రయణీయముగ స్వీకరింతును.

ఇచట విష్ణుదేవుని (రామకృష్ణాది) విభవావతారము, అతిమానుష స్వభావ లీలా పరాక్రమముల చేత సకల జన సాదృశ్యమును

78 షాడ్గుణ్యాద్వాసుదేవః పర ఇతి స భవాన్ముక్త భోగ్యో బలాఢ్యా-
ద్బోధాత్సఙ్కర్షణస్త్వం హరసి వితనుషే శాస్త్రమైశ్వర్య వీర్యాత్।
ప్రద్యుమ్నస్సర్గ ధర్మౌ నయసి చ భగవన్। శక్తితేజోఽనిరుద్ధో
బిభ్రాణః పాసి తత్త్వం గమయసి చ తథా వ్యూహ్య రంగాధిరాజ ॥
శ్రీ రం స్త 2 39

79 అ స ।

అతిక్రమించినదనుటచేత విభవావతారము సాటిలేనిదని వర్ణితము కావున ఇచట అసమాలంకారము. అసమమనగా సాటిలేనిది.

**4.2.6.17 విషమాలంకారము :-**

"విషమం వర్ణ్యతే యత్ర ఘటనాఽననురూపయోః"[60] పరస్పర విరుద్ధ ధర్మములకు ఒకచోట ఘటన ఏర్పడిన అచట విరుద్ధ ఘటనాత్మక విషమాలంకారభేదము.

పశ్యత్సు సూరిషు సదా పరమం పదం తే
దేవ్యా శ్రియా సహ వసన్ పరమా విభూత్యా।
యోగేన యోగనిరతైః పరిమృగ్యమాణః
కిం త్వం వ్రజేషు నవనీత మహో! వ్యముష్ణాః ॥[61]

పురుషోత్తమా! శ్రియఃపతివై సదా నిత్యసూరిసేవ్యుడవై యోగిజనపరిమృగ్యమానుడవై విభూతిద్వయ( భూలోకము, పరమపదము)నాయకుడవై అపారమహోదారడవై పరమాత్ముడవైన నీవు గొల్లపల్లెయందు వెన్న దొంగిలించితివి. సాక్షాత్తు సంపదధిదేవతకే భర్తవై చతుర్దశభువనములకును ఏకైక ప్రభువైన నీవు గొల్లల ఇళ్ళయందు వెన్నదొంగలించుట విడ్డూరముగా నున్నది. నీ ఐశ్వర్యమునకును నవనీత చౌర్యమునకును పొంతన ఎట్లు? అని కృష్ణుని యందు అననురూపఘటన వర్ణింపబడినందున విషమాలంకారము

**4.2.6.18 భావికాలంకారము :-**

"భావికం భూతభవ్యార్థసాక్షాత్కారస్య వర్ణనమ్"[62]

జరిగిన వృత్తాంతములను గాని, జరుగబోవు వృత్తాంతములను గాని జరుగుచున్న వానివలె కన్నులకు కట్టినట్లుగ వర్ణించుట భావికాలంకారము.

---

60 కు. అ 66

61. అ స్త 35

62. కు. అ 161

యశోదాంగుళ్యగ్రోన్నమితచుబుకాఘ్రాణముదితౌ
కపోలావద్యాపి హ్యనుపరతతద్ధర్షగమకౌ।
విరాజేతే విష్వగ్వితతసహకారాసవరస
ప్రమాద్యద్భృంగాఢ్యద్రుమవనగిరేస్సుందరహరేః॥[83]

అన్ని వైపులా వ్యాపించియున్న తియ్యమామిళ్ళ ఆసవరసముచే (మధు మకరందము) మత్తెక్కిన తుమ్మెదలతోకూడిన చెట్లుగల వనాద్రివాసి యగు సుందరబాహుస్వామియొక్క కపోలములు యశోదా దేవ్యంగుళ్యగ్రముచే చిబుకము పైకెత్తి ఆఘ్రాణించుటచేత (వాత్సల్య చేష్ట) మిగుల వికాసమొందినవై నేటికిని మాసిపోని ఆ సంతోషచిహ్నములు గలదిగనే ప్రకాశించుచున్నవి ఇంతకాలమ్మైనను యశోదముద్దు చేయుటచే వికసిల్లిన చెక్కిళ్ళు ఇప్పటికీ అట్లే వెలుగొందుచున్నవి- అని కపోల సౌందర్యమును చూసి కవి యూహించినాడు ఎప్పుడో జరిగిన సంభవమును ఇప్పుడే జరుగుచున్నట్లు భావించినందున ఇచట భావికాలంకారము.

### 4.2.6.19 సందేహాలంకారము :-

సుందరోరుభుజ! నందనందన!
స్త్వం భవన్ భ్రమరవిభ్రమాలకః।
మందిరేషు నవనీతతల్లజాన్
వల్లవీధియముత వ్యచూచురః॥[84]

రుచిరాయతబాహుసుందరా! భ్రమరవిలాస శోభమానాలక సుందరుడవై నీవు నందనందనుడ వైనపుడు గొల్లభామల ఇళ్ళయందలి మేలివెన్నలు దొంగిలించితివా? లేక గొల్లపడుచుల మనసులను దోచుకొంటివా? - నాకు తెలియ జెప్పుము

83 సుం స్త 47
84 సుం స 110

'భ్రమర విభ్రమాలకః' అనుచోట భ్రమరవిలాసము భ్రమరములందే యుండును గాన భ్రమర విభ్రమ సదృశ విభ్రమముగల ముంగురులు అని చెప్పవలెను. కాన ఇట పదార్థవృత్తి నిదర్శన లేదా భ్రమరమును భ్రాంతి కల్గించుచున్న అలకలు అను భావము గ్రహించినచో ఇచట భ్రాంతిమదలంకారము. నీవు కొల్లలాడినది గొల్లెతల యుల్లములనా? లేక వారింటి వెలివెన్నలా? అను సందేహము వ్యక్తీకరింప బడినది. కాన సందేహాలంకారము గూడా ఉన్నది

**4.2.6.20 విరోధాభాసము :-**

''యం భూతభవ్యభవదీశమనీశమాహుః''[85]

ఏ వైకుంఠనాధుడు భూతభవిష్యద్వర్తమాన కాలిక పదార్థముల కన్నింటికిని ఈశుడో అనగా నియామకుడో అని వెంటనే 'అనీశం' అనగా ఈశుడు కాడు అనుటచేత విరోధము భాసింపగా, అనీశ శబ్దమునకు బహువ్రీహి సమాసమునాశ్రయించి పరిహారము చెప్పవలెను. 'న విద్యతే ఈశః యస్య సః' ఎవనికి ఈశుడు లేడో అనగా తానే సర్వ నియామకుడగుట చేత ఆయనకు నియామకుడు లేడనుట సబబే కదా! అని పరిహారమున్నది ''ఆభాసత్వే విరోధస్య విరోధాభాస ఇష్యతే''[86] అను లక్షణము ప్రకారము ఇది విరోధాభాసాలంకారమని స్పష్టము.

**4.2.6.21 ప్రతీపాలంకారము :-**

అదీర్ఘమప్రేమదుఘం క్షణోజ్జ్వలం
నచోరమంతఃకరణస్య పశ్యతామ్ ।
అనుబ్జమబ్జం ను కథం నిదర్శనం
వనాద్రినాథస్య విశాలయోర్దృశోః ॥[87]

85 వై స్త 23
86 కు ఆ 76
87 సుం స 43

వనాద్రి నాథుని నేత్రములు కర్ణాంత విశ్రాంతములై నిడుపైనవి. ఆశ్రితుల విషయమున ప్రణయము వర్షించునవి సదా ఏకరూప వికాసోదార స్వభావము కలవి. చూపరుల హృదయములను ఆకట్టుకొనగలవి. నిర్వ్యాజముగా సర్వజన సంతోషప్రదమైనవి. మరి పద్మమో దీర్ఘము కాక వర్తులమైనది. స్నేహవర్షకము కాదు. కొలది కాలమే వికాసనశీలమై క్రమముగ కళ తరిగిపోవునది. చూపరుల చిత్తమును చూఱగొనలేనిది, ఋజుత్వము లేనిది, తిన్ననైన గుణములు లేనిది. కావుననే చంద్రోదయమును ఓర్వలేనిది. ఇటువంటి కమలము ('క' నీటిలో మలము అయినది) నిత్యోదారమైన స్వామి కన్నులకు దృష్టాంతమెట్లగును అనగా ఉపమాన భావమెట్లు పొందును? కమలము బహు దోషాకరమగుటచేత పద్మమువంటివి కన్నులని దృష్టాంతముగ చెప్పలేము కావున ఇచట ఒక ప్రతీపాలంకార భేదము చోటు చేసుకొనినది. ''వర్ణ్యేనాన్యస్యోపమాయాః అనిష్పత్తి వచాశ్చ తత్''[88] ప్రస్తుత వర్ణ్య వస్తువునకు అప్రకృత పదార్థములతో సాదృశ్యము నిష్పన్నము కాదనుట (నాలుగవ) ప్రతీపాలంకారము. పద్మమన్నివిధములన్యూన గుణకమగుటచేత స్వామి కన్నులకది నిదర్శనము (అనగా ఉపమానము) కాదనినందు వలన ఇచట ప్రతీపాలంకారము స్పష్టము.

### 4.2.6.22 విశేషాలంకారము :-

''కించిదారంభతోఽశక్యవస్త్వంతరకృతిశ్చ సః''[89]

ఒక సాధారణమగు పని చేయబూని, అశక్యమైన వేరొక పనిని నెరవేర్చుట విశేషాలంకారము.

మానుష్కకం చరిత మాచరితం ప్రవృత్తో
దేవాతిగం చరితమంగ! కిమంగ్య కార్షీః।

---

88 కు ఆ । ౨

89 కు ఆ । ౦ ।

యత్రాగరే బత ! బబంధిత నాథ ! సేతుం
శైలైః ప్లవంగమసమింగితసంప్రణున్నైః ॥[90]

స్వామీ! ''ఆత్మానం మానుషం మన్యే''[91] అన్నట్లు మనుష్యుని వలె మనుష్యత్వానుగుణ సాధారణచరితము ప్రదర్శింపనెంచిన నీవు కోతులచేత కొండలను తెప్పించి సముద్రమున సేతువు నిర్మించితివి. ఈ సేతుబంధము దేవతలశక్తికికూడా మించినది కదా! కాగా, ఏదో చేయనారంభించి మనుష్యునకసాధ్యమగు, అశక్యవస్త్వంతర నిర్మాణము- అనగ సముద్రమున సేతుబంధనము చేసితివి ఇట్లనుట వలన విశేషాలంకారము.

**4.2.6.23 అధికాలంకారము :-**

సుందరస్య కిల సుందరబాహోః
శ్రీమహోతరువనాచలభర్తుః।
హంత ! యత్ర నివసంతి జగంతి
ప్రాపితక్రశిమ తత్తనుమధ్యమ్ ॥[92]

మహోతరుమండిత వనాచలస్వామియై సుందరుడైన సుందర బాహు ప్రభువుయొక్క ఏ ఉదరమందు చతుర్దశభువనములుండునో అట్టి మధ్యభాగము మిక్కిలి కార్శ్యమొందింపబడినది. విశాల భువనములకును ఉదరమునకును ఘటన విరూపము అట్లగుట ఇది విషమాలంకారమని భావింపనవకాశమున్నది. ''విషమం వర్ణ్యతే యత్ర ఘటనాననురూపయోః''[93] అనురూప్యములేని రెంటిని ఒకచోట ఘటింపజేయుట విషమాలంకారమగును కదా ! ''తపః క్వ వత్సే క్వ చ

90 అ స్త 22
91 వా రా యుద్ధ 120
92 సుం స్త 58
93 కు ఆ 88

తావకం వపుః''[94] ఇత్యాదులందు విషమాలంకారమే కాని ఇచట ఆధారాధేయ సంబంధమగు విషమత్వముండుటచే ఈ వైలక్షణ్యమును బట్టి అధికాలంకారమున్నదనుట ఉచితము ఆధారము కంటే ఆధేయమును పెద్దదిగా వర్ణించుట అధికాలంకారము.

సన్ననినడుమున (ఉదరమున) పదునాలుగు లోకములుండునట్లు వర్ణించుటవలన అధికాలంకారము.

### 4.2.6.24 హేత్వలంకారము :-

''హేతుహేతుమతోరైక్యం హేతుం కేచిత్ప్రచక్షతే''[95]

**హేతుహేతుమతో:** :- కారణకార్యములకు ఐక్యము అనగా కార్యకారణములకు ఎచట అభేదోపచారము కల్పింపబడునో అచట హేతునామకాలంకారముండును

శాస్త్రైరనాదినిధనైః స్మృతిభిస్త్వదీయ
దివ్యావతారచరిత్రైః శుభయా చ దృష్ట్యా ।
నిశ్శ్రేయసం యదుపకల్పయసి ప్రజానాం
సా త్వత్కృపాజలధి తల్లజవల్గితశ్రీః ॥[96]

ఆద్యంతములు లేని వేదముల చేతను, స్మృతులచేతను, దివ్యములైన నీయవతారచరిత్రలచేతను, శుభకరములైన కటాక్షముల ప్రసాదముచేతను భక్తజనులకు మోక్షమును కల్పించుచున్నావు. ఆ మోక్షప్రాప్తి క్షీరసాగరతరంగసదృశమగు నీ యపార కరుణయే.

కరుణ, మోక్షప్రాప్తికి హేతువగును కృపవలన మోక్షసిద్ధియని చెప్పవలసియుండగా కృపయే మోక్షసిద్ధి యని వర్ణించుట వలన కారణ కార్యములకు ఐక్యము వర్ణితమగుటచే హేత్వలంకారము.

---

94 కు సం 5 4
95 కు అ 108
96 వై స్త 60

**4.3 పంచస్తవిపై విశిష్టాద్వైత తత్త్వ ప్రభావము :-**

శ్రీవిశిష్టాద్వైతసిద్ధాంతము వేదప్రామాణ్య సంపన్నము అందుచే ఇందలి తత్త్వములన్నియు వేదప్రతిపాదకములై యున్నవి. అట్లే వేదోప బృంహణములగు ఇతిహాస పురాణాదులకు, భగవచ్ఛాస్త్రమనెడు పాంచరాత్రాగమమునకును విరుద్ధములైన అంశములీమతమునందు కానరావు కనుక భగవత్ స్తోత్రములన్నియు వేదాగమ ప్రతిపాదితాంశములపై ఆధారపడియే భక్తులచే రచింపబడినవి

శ్రీభగవద్రామానుజులసన్నిధిలో నిఖిల శ్రుత్యర్థములను చక్కగ గ్రహించినవారు శ్రీవత్సాంకులు వీరు పరమ కారుణికులగుటచే సకల బుధజనోజ్జీవనార్థమై రచింపబడిన పంచస్తవములలో వైష్ణవసిద్ధాంతములు ప్రతిపదమున స్పష్టమగు చుండును ఈ దృష్టితో పరామర్శించినచో విశిష్టాద్వైతతత్త్వములు ప్రతిశ్లోకమునను వెల్లివిరియుచుండును విశిష్టాద్వైత సిద్ధాంతమునకు సంబంధించిన ముఖ్యమైన తత్త్వములు పంచస్తవిలో ఎచట నెచట నిరూపింపబడినవో ఈ సందర్భమున సమగ్రముగా విచారింపబడుచున్నవి.

**4.3.1 తత్త్వత్రయము :-**

**4.3.1.1 ఈశ్వరుడు:-**

సకల జగన్నియామకుడు, జగదాధారభూతుడు, సృష్టి స్థితి సంహారాదులకు కారణమైన శ్రీమన్నారాయణుడే ఈశ్వరుడు.

ఈ ఒక్క విషయమునాధారముగా జేసికొని ఏకముగా శ్రీవైకుంఠస్తవమునే రచించిరి ఈ స్తవమందలి అనేక శ్లోకములు ఈ విషయమునే స్ఫురింప జేయుచున్నవి

అస్తం యదుద్యదుపచాయ్యపచాయి చైవ-
మీశం దరిద్రమథ జంగమమప్యనింగమ్ ।

విశ్వం విచిత్రమవిలక్షణవీక్షణేన
విక్షోభయస్యనవధిర్బత శక్తిరైశీ ॥[౨౭]

ఓ వైకుంఠనాథా! ఒక్కసారి సంకల్పించినమాత్రముననే అస్తమించునదియు, ఉదయించునదియు, క్షీణించునదియు, వృద్ధిపొందునట్టిదియు, సంపద కలదిగా ఐశ్వర్యరహితముగా చైతన్యయుక్తముగా, చైతన్య రహితముగా చేయుచున్నావు ఈశ్వరత్వ ప్రయుక్తమగు నీ శక్తి అపారమైనది గదా! అని ఈశ్వర ప్రకరణమును సంగ్రహముగా ఈ శ్లోకమునందు నిక్షేపించిన విధము అతిగంభీరము.

**4.3.1.2 జీవుడు :-**

జీవాత్మలందరు పరమాత్మకు దాసభూతులే. సంసార దశయందుగాని, మోక్షప్రాప్తి సమయమునగాని భగవంతునికి దాసులై యుండుటే జీవుని లక్షణము వేఱు విధముగా లక్షణమును చెప్పటకు సాధ్యము కాదు

ఈ విషయమునే మిశ్రులు అతివిలక్షణ శైలిలో క్రింది శ్లోకమున పేర్కొనిరి -

త్వద్దాస్య మస్య హి మమ స్వరసప్రసక్తం
తచ్చోరయన్నయ మహం కిల చస్థలం ప్రాక్ ।
త్వం మామకీన ఇతి మా మభిమన్యసే ష్మ
హస్తీశ! సంశమయ న స్తమిమం వివాదమ్ ॥[౨౮]

ఓ హస్తిగిరినాథా! పూర్వోక్త విధముగ సర్వదోషనిలయుడనగు నాకు నీ దాస్యమే స్వరసముగ అనగ స్వతస్సిద్ధమగు స్వరూపముగ ఏర్పడియున్నది. కాని దాస్యమును స్వస్వరూపమని దాని ప్రకారము నడచుకొనక తద్విరుద్ధముగా నడచుకొని చోరుడనైతిని మహాభారతములో చెప్పినట్లు -

౨౭ వై స్త ౫౫

౨౮ వ స ౮౦

యోऽన్యథా సంత మాత్మాన మన్యథా ప్రతిపద్యతే।
కిం తేన న కృతం పాపం చోరేణాత్మాపహారిణా ॥[99]

ఈ విధముగ ఆత్మాపహారముచేసిన చోరుడు చేయని పాపమేమున్నది.? స్వతంత్రప్రవృత్తి మహాపాతకమన్నమాట. చోరుడనైతిని ''త్వమ్మే ఽహమ్మే'' అను శ్లోకమున వర్ణించిన వివాదము రానీయకుము. అజ్ఞానవశుడను నీకు దాసుడనగు నన్ను అపమార్గములో వెళ్ళకుండా కాపాడుము. అని జీవుని లక్షణమగు దాస్యమును ఈ శ్లోకమున నిక్షేపించిరి.

**4.3.1.3 ప్రకృతి :-**

జ్ఞానరహితమగు జడపదార్థమై అచేతనమైనట్టిదై వికారము చెందునదియే ప్రకృతి.

శశధరరింఖణాఢ్యశిఖ ముచ్ఛిఖరప్రకరం
తిమిరనిభ ప్రభూతతరుషండమయం భ్రమదమ్।
వనగిరి మావసంత ముపయామి హరిం శరణం
భిదురిత సప్తలోక సువిశృంఖల శంఖరవమ్ ॥ [100]

వనగిరియందలి శిఖరసమూహములు చంద్రకాంతితో నవోన్మేషమైనవి. అంధకారమువంటి వృక్షసమూహములతో నిండిన గిరియందు వెలసియున్న సుందరబాహుస్వామిని శరణుజొచ్చు చున్నాను

ఈ శ్లోకమందు జడపదార్థరూపము, అచేతన ద్రవ్యమునగు ప్రకృతిలక్షణమును వనగిరియందలి వృక్షములు, శిఖరములు మొదలగు వాటితో సమన్వయ పరిచి శ్లోకరచన గావించిన తీరు ప్రశంసావహము.

---

99 మ భా ఆది 74 78

100 సుం స 5

**4.3.2 అర్థపంచకము :-**

శ్రీవత్సచిహ్న మిశ్రులు పంచస్తవవ్యాజమున వైష్ణవ సిద్ధాంత మూల స్తంభములనదగు అర్థపంచకము నిట్లు వివరించుచున్నారు.

ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః।
ప్రాప్త్యుపాయః ఫలంప్రాప్తేః తథా ప్రాప్తి విరోధి చ ॥ [101]

పరమ ప్రాప్యుడగు పరబ్రహ్మ స్వరూపము, అట్టి పరబ్రహ్మను పొందవలసిన జీవాత్మ స్వరూపము, ఆ పరబ్రహ్మ ప్రాప్తికి కావలసిన ఉపాయములు, ఆ ప్రాప్తివలన పొందెడి లాభము, ఆ ప్రాప్తికి విరోధియైనది అను అంశములను అర్థపంచక మందురు ఇది విశిష్టాద్వైతసిద్ధాంతమున ఎంతో ముఖ్యమైనది. ఉత్తమ శ్రేయః పదప్రాప్తికి అంతరాయ భూతములైన విరోధులెన్నో ఉండును. వానిని కూడా తెలుసుకొనవలెను ఈ అర్థపంచకములో 'ప్రాప్యస్య బ్రహ్మణో రూపం' అను వాక్యమును వివరింపదలచి అకుంఠిత ప్రభావోన్నతుడగు శ్రీవైకుంఠనాథుని స్వరూపరూపగుణములను ప్రతిపాదింపదలచి శ్రీ కూరేశమిశ్రులు ముందుగా పరమపదనాథ స్తవమునే రచించిరి. అందు ఒక శ్లోకము -

యత్తత్త్వ మక్షర మదృశ్య మగోత్ర వర్ణ
మగ్రాహ్య మవ్యయ మనీదృశ మద్వితీయమ్।
ఈశాన మస్య జగతో య వణోరణీయః
తద్వైష్ణవం పద ముదార ముదాహరామః॥ [102]

ఇచట 'పదమ్' అను శబ్దమునకు ఉపాస్యస్వరూపము అని అర్థము. ఏ పదము సత్యమో అనంతమో, [103] చక్షుర్గ్రాహ్యము కాదో,

---

101 వి శో పు 403

102 వై స్త ౧

103 సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ
తై ఉ 2 । ।

నామరూప రహితమో, అనుమానాది ప్రమాణములకు విషయము కాదో, అవ్యయమో అనగా అసంకుచిత కళ్యాణ గుణములకు ఆకరమో, ఇట్టిదని చెప్పనలవికానిదగు జగన్నియామకము,[104] అణువుకంటె అణుతర స్వరూపము,[105] మహత్తు కంటె మహత్తరమైనది విష్ణు సంబంధియగు ఆ పదమును- ఉపాస్య స్వరూపమును స్తుతించెదము. (పద్యతే ఇతి పదమ్ అను వ్యుత్పత్తి చొప్పన ఈ అర్థము సిద్ధించును) అర్థపంచకమున మొదటిదగు ప్రాప్యమైన బ్రహ్మస్వరూపము ఇచట వర్ణింపబడినది.

### 4.3.3 శ్రీమన్నారాయణుడే సర్వేశ్వరుడు :-

విశిష్టాద్వైత సిద్ధాంతము ప్రకారము శ్రీమన్నారాయణుడే సర్వేశ్వరుడు. సర్వేశ్వరత్వము అతనికే సిద్ధించును ఇచట ఈశాది శబ్దములు లోకప్రసిద్ధినిబట్టి రుద్రాది వాచకములని భ్రమపడుచున్నారు. అనగా ఈశ్వరుడే (రుద్రుడే) పరమాత్మయని తలచుచున్నారు ఆపాతత: తోచెడి ఆ యర్థమును గ్రహించి పొరపాటు పడరాదు. తత్త్వార్థ మరయుటకై ''శాశ్వతం శివ మచ్యుతమ్''[106] వంటి వందలకొలదిగా నున్న ప్రమాణములను బట్టి ఈశాది శబ్దములు నారాయణ వాచకములేయని నిర్ణయింపవలెను ఈ విషయమును క్రింది శ్లోకము స్పష్టపరచుచున్నది -

అన్యత్ర తు క్వచన కేచిదిహేశశబ్దా-
ల్లోకప్రసిద్ధి ముపగమ్య తమీశ మాహు: ।
తైశ్చ ప్రసిద్ధివిభవస్య సమూలతాయై
గ్రాహ్యాత్రయీ త్వయి తు సాఽచ్యుత! సమ్ముఖీనా ॥[107]

---

104 మ నా ఉ 9 3

105 అణోరణీయాన్ మహతో మహీయాన్
క ఉ. 2 20

106 మ నా ఉ 9 3

107 వై స్త 18

ఈ శ్లోకమునందు త్రయి నారాయణుని పరత్వమునే చాటి చెప్పచున్నది

**4.3.4 పరతత్త్వ నిర్ణయము :-**

బ్రహ్మతత్త్వజ్ఞులు తత్త్వనిర్ణయ ప్రకారములనిట్లు వర్ణించుచున్నారు -

రూపశ్రియా పరమయా పరమేణ ధామ్నా
చిత్రైశ్చ కైశ్చిదుచితై ర్భవత శ్చరిత్రైః।
చిహ్నైరనిహ్నవపదై రపరైశ్చ కైశ్చి-
న్నిశ్చిన్వతే త్వయి విపశ్చిత ఈశితృత్వమ్॥[108]

''తస్య భాసా సర్వమిదం విభాతి''[109], ''దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా. యది భాస్సదృశీ సా స్యాత్ భాసస్తస్యమహాత్మనః''[110] మున్నగు వాక్యములచేత వర్ణింపబడిన స్వరూప విగ్రహముల పరమ శోభ చేతను, ''ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్''[111], ''తదక్షరే పరమేవ్యోమన్ యోస్యాధ్యక్షః''[112] ఇత్యాది శ్రుతి వచనములచేత శ్లాఘింపబడిన ఉత్తమోత్తమ స్థానములచేతను, ఆశ్చర్యావహములై మహిమానుగుణములైన జగత్కారణత్వాది చరితములచేతను, వేదాపహారి విధ్వంసనముచేత వేదములను కాపాడుట, విభవావతారము నందలి హిరణ్య నిబర్హణ (హిరణ్యుడనగా హిరణ్యాక్ష హిరణ్యకశిపులు) సేతుబంధన, గోవర్ధనోద్ధరణాది గీతాచార్యత్వాదుల చేతను మొ.. అసాధారణ గుణములచేత నిఖిల జగన్నియంతృత్వము నీ యందే కలదని పరాపర తత్త్వజ్ఞులు నిర్ణయించుచున్నారు.

---

108 వై స్త 28

109 ముం ఉ 2 2 10

110 భగీ 11 12

111 శ్వే ఉ 3 8

112 మ నా ఉ 1 2

### 4.3.5 మోక్షోపాయములు :-

కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము, శరణాగతి అను ఈ నాలుగు మార్గములద్వారా మోక్షమును సాధింపవచ్చును కానీ విశిష్టాద్వైతసిద్ధాంత ప్రకారము భక్తియోగము, శరణాగతి అను ఉపాయములకే ప్రాముఖ్యమివ్వబడినది అందునను శరణాగతికే మహార్ఘసింహాసనము.

### 4.3.5.1 భక్తి యోగము :-

జ్ఞాన భక్తి యోగములలో భక్తియోగమే నిశ్శ్రేయస సాధనము. భక్తిరహితమగు కేవలజ్ఞానమకించిత్కరమని శ్రీవత్సాంకులు క్రింది విధముగ నిరూపించిరి - [13]

ఏ మానవులు నీ శ్రీపాద కమలములపై భక్తిలేనివారో, వారికి న్యాయమీమాంసాస్మృత్యాది వేదోపబృంహణ శాస్త్రములవలన కూడా యథార్థజ్ఞాన మేర్పడదు భక్తి పరిపూతాత్ములకే శాస్త్రముల తత్త్వార్థము తెలియగలదు. ఈ విషయమును నిరూపించుటకై దృష్టాంతమును చూపుచున్నారు - సూర్యుని ప్రకాశము ఎంత వెలుగొందు చున్నను పిత్త దోష దూషితములగు నేత్రములకు శంఖము పసుపువన్నెగా కనిపించును గాని దాని నిజమగు ధవళవర్ణము గోచరము గాదు పిత్తదోషమును పోగొట్టెడి అంజనమును కంటికి వేసుకొనినచో పిత్తదోషము పోయి శంఖముయొక్క సహజ ధవళవర్ణము గోచరమగును. అట్లే శాస్త్రజ్ఞానము ఎంతయున్నను భక్తియోగ ప్రభావము వలన మాత్రమే తత్త్వజ్ఞాన మేర్పడును. కావున భక్తియే ప్రధానము వైష్ణవ సిద్ధాంతమున కర్మజ్ఞానయోగములకంటే భక్తియోగమునకే గొప్ప విలువగలదని శ్రీవత్సాంకులు నిరూపించిన విధము అద్భుతము

13 వై స్త 10

**4.3.5.2 పరభక్తి పరజ్ఞాన పరమభక్తులు :-**

భక్తిని రామానుజులు శరణాగతి గద్యమున మూడు విధములుగ పేర్కొనిరి. అవి 1. పరభక్తి, 2. పరజ్ఞాన, 3. పరమభక్తులు ఈ మూడింటికి వైష్ణవ సంప్రదాయమున విశేషస్థానము గలదు. వాటిని శ్రీవత్సాంకులు తమ పంచస్తవి రచనయందు క్రింది విధముగా నిరూపించిరి.

రాముని సంబంధము కలిగిన వృక్షములు కూడా మోక్షము నొందినవనుచున్నారే ! అదెట్లు సాధ్యము ? అనుటకు పరమభక్తి మూలమున వృక్షమోక్షప్రాప్తిని వివరించుచున్నారు -

వంశం రఘో రనుజిఘృక్షు రిహావతీర్ణో
దివ్యైర్వవర్షిథ తథాఽత్ర భవద్గుణౌఘైః।
త్వత్సన్నిధిప్రభవశైత్యజుషో యథా హి
వృక్షాశ్చ తాంతి మలభంత భవద్వియోగే ॥[114]

రఘుకులముననుగ్రహింప నీవు ఈ లోకమున దివ్యములైన నీ గుణప్రభావమును ఎల్లెడల వర్షింపజేసితివి నీ సన్నిధాన మాత్రము వలన యేర్పడిన చల్లదనమును ( దయను) అనుభవించిన చెట్లు సైతము నీ యెడబాటు కాలమున క్రుంగి కృశించినవిగదా! ఇక్కడొక సంప్రదాయ రహస్యము -

దర్శనం పరభక్తి స్స్యాత్ పరజ్ఞానం తు సంగమః।
పునర్విశ్లేషభీరుత్వం పరమా భక్తి రుచ్యతే ॥

ఎడబాటు చేత తల్లడిల్లుటయే పరమభక్తి. అక్కడి చెట్లు 'తాంతి మలభంత' మిగుల గ్లానిని పొందిన వనుట చేత, పరమచేతనులవలె తరువులు కూడా ఎడబాటునోర్వలేక వాడిపోయినవని చెప్పటచేత వానికి విశ్లేషభీరుత్వమైన పరమభక్తి యున్నట్లే ఇదిభక్తి పరాకాష్ఠయే గదా!

114 అ. స్త 30

పరమభక్తిచేత పరభక్తి పరజ్ఞానములు కూడా అర్థాక్షిప్తములు. కాగా, పరమభక్తి మూలమున వృక్షములకు సైతము మోక్షప్రాప్తి కలిగినదను నిర్ణయము సంప్రదాయసిద్ధము.

**4.3.5.3 ప్రపత్తి/శరణాగతి :-**

విశిష్టాద్వైత సంప్రదాయమున మోక్షప్రాప్త్యుపాయరూప మగు భక్తియోగముయొక్క పరాకాష్ఠరూపమ్మైనది, పరిపూర్ణమ్మైనది సులభోపాయమ్మైనదియు అగు ప్రపత్తికి ప్రముఖస్థానము కలదు శరణాగతియే ప్రపత్తి. 'నీవే తప్ప ఇతఃపరంబెరుగను' అను అధ్యవసాయంము ముఖ్యము స్వాభీష్టము ఉపాయాంతర సాధ్యముకాదని పూర్ణజ్ఞానము కలుగగా సందేహలవలేశము కూడా లేక పూర్తి విశ్వాసముతో, భగవాన్! నీవొక్కడవే ఉపాయభూతుడవు. అపవర్గము నీకృపవలన మాత్రమే సాధ్యము అనెడు దృఢసంకల్పమే ప్రపత్తి. అదియే శరణాగతి. భగవంతుడే ఉపాయము ఉపేయము అని త్రికరణశుద్ధితోడ భగవంతుని శరణుజొచ్చుటయే ప్రతి జీవికి ముఖ్య కర్తవ్యము. శ్రీవత్సాంకులు ఆర్తితో శరణాగతి చేయుచూ స్వాభిమతమును క్రింది విధముగా ప్రకటించుచున్నారు -

అద్యాపి నాస్త్యుపరతిస్త్రివిధాపచారాత్
పాపః పరే నిపతితోఽస్మి తమస్యపారే।
ఏతాదృశోఽహమగతిర్భవతో దయాయాః
పాత్రం త్వదీయచరణౌ శరణం ప్రపద్యే ॥[115]

స్వామీ! నేను పాపిష్ఠుడను. మోక్షము పొందుటకు వలసిన యే యోగ్యతయు నాకు లేదు పరమశోచనీయదశయందున్నందు వలననే నన్ను నీ నిర్వ్యాజకృపాపాత్రునిగా చేసుకొని కాపాడుమని శరణు వేడుకొనుచున్నారు.

---

115 అ.స. 55

నేను 'నృశంసః పాపిష్ఠః' అన్నట్లు నిష్కృతి లేని మహాపాతకములను చేసినవాడను. దుస్తరమైన అజ్ఞాన కూపమున పడియున్నాను. ఇప్పటికిని త్రివిధాపచారములను అనగా భగవదపచార, భాగవతాపచార, అసహ్యాపచారము (ఆచార్యాపచారము) లను మానక చేయుచునేయున్నాను. ఇట్టి వాడను కావుననే అగతికుడను. కావుననే నీ దయకు పాత్రుడను. అగతికుని మీద జాలిపుట్టుట సహజమే కదా! అందుచేత నీ పాదపద్మములందు శరణు జొచ్చితిని.

'పాపః' అని శ్రీవత్సాంకులు తనను పేర్కొనుటచేత కర్మయోగ నిష్ఠ లేదని సిద్ధము ''కషాయే కర్మభిః పక్వే తతో జ్ఞానం ప్రవర్తతే'' అను శాస్త్రము చెప్పిన కర్మయోగనిష్ఠచేత చేసిన పాపము తొలగిపోగా తరువాత జ్ఞానము ప్రవర్తిల్లును కదా! అట్టి కర్మయోగము లేకపోవుట చేతనే జ్ఞానయోగము లేకపోవుట కూడా ద్యోతితమగుచున్నది. ఈ విషయమే 'నిపతితోఽస్మి తమస్యపారే' అను వాక్యము చేత తెలుపబడినది ఎప్పుడు జ్ఞానముత్పన్నము కాలేదో భగవద్భాగవత అసహ్యాపచారముల నుండి నిష్కృతియుండదు. అంగ భూతములైన కర్మజ్ఞానములచేతనే భక్తి పుట్టును. కావున భక్తి సిద్ధియు లేదు. ''అకించనోఽనన్యగతిశ్శరణ్య! త్వత్పాదమూలం శరణం ప్రపద్యే''[116] అన్నట్లు గత్యంతరము (ఉపాయాంతరము) లేనివాడను కావుననే నీ దయకు పాత్రుడను, నీ పాదసరోరుహములందు ప్రపత్తి యొనర్చెదను.

ఈ విధముగా ప్రపత్తి ప్రాశస్త్యమును శ్రీవత్సాంకులు విశదపరచిరి. విశిష్టాద్వైత సంప్రదాయమున ప్రసిద్ధమైన శరణాగతిలో శ్రీవత్సాంకులు గోప్తృత్వ వరణమునే ప్రశంసించిరి. చూడుడు -

'విషయ విషధర'.[117] ''అకృత సుకృతకః''[118] అనెడి శ్లోకద్వయమును

116 స్తోర 22

117 వ స్త 82

118 అందులోనే 83

పరిశీలించినచో కొందరు ఆత్మనిక్షేపమే అంగి యనియు మిగిలినవి అంగములనియు పేర్కొందురు. కానీ ఈ ప్రవాదము ప్రాథమిక దశకు సంబంధించినది. కాని భాష్యకారులగు భగవద్రామానుజాచార్యుల నుండి తెలియబడిన సకల తత్త్వార్థజ్ఞులు శ్రీవత్సాంకులు గోప్తృత్వ వరణమే (నారాయణుడే రక్షకుడని) దృఢాధ్యవసాయముతో వరించుటయే శరణాగతి స్వరూపమని బోధించినారు. కావున ఇదియే పరమవైష్ణవ సిద్ధాంతసారము.

### 4.3.6 శ్రియః పతిత్వము :-

భగవంతుని యసాధారణ చిహ్నములలో అతిప్రధానమ్మైనది శ్రియఃపతిత్వము (లక్ష్మీపతిత్వము).

> యస్యాః కటాక్షణ మనుక్షణ మీశ్వరాణా-
> మైశ్వర్య హేతురితి సర్వజనీన మేతత్ ।
> తాం శ్రీరితి త్వదుపసంశ్రయణాన్నిరాహుః
> త్వాం చ శ్రియః శ్రియముదాహు రుదార వాచః ॥[113]

ఏ దేవి యొక్క అనుక్షణ కటాక్ష వీక్షణము చేతనే దేవేంద్రాదులు సంపన్నులగుచున్నారనుట సర్వజనీనమో అట్టి లక్ష్మీదేవికి గూడ నిన్నాశ్రయించినందువలననే (శ్రయతే విష్ణుమితి శ్రీః) శ్రీః అను పేరు అన్వర్థమ్మైనదని పెద్దలు ప్రతిపాదించుచున్నారు. అట్టి శ్రీదేవికి కూడ నీవు శ్రీవి. నిన్నాశ్రయించినందువలననే ఆమెకు ఆ మహత్త్వము.

ఈ విధముగా విష్ణుమూర్తికి శ్రియఃపతిత్వమను అసాధారణ చిహ్నమును శ్రీవత్సాంకులు వివరించిరి.

### 4.3.7 కళ్యాణ గుణములు :-

విశిష్టాద్వైతసిద్ధాంతముననుసరించి భగవంతుడు సకల కళ్యాణ గుణాకరుడు. ఆ కళ్యాణగుణములను కూరేశకు ...ులు క్రింది శ్లోకములో

---

113 వై స్త 23

ఇట్లు తెలుపుచున్నారు -

**సౌశీల్యాశ్రితవత్సలత్వమృదుతాసౌహార్దసామ్యార్జవైః**
ధైర్యస్థైర్యసువీర్యశౌర్యకృతితాగాంభీర్యచాతుర్యకైః।
**సౌందర్యాన్వితసౌకుమార్యసమతాలావణ్యముఖ్యైర్గుణైః**
దేవః శ్రీతరుషండశైలనిలయో నిత్యం స్థితః సుందరః ॥[120]

ఈ శ్లోకమున **సౌశీల్యా**ది స్వరూపగుణములు, సౌందర్యాది విగ్రహ (శారీరిక) గుణములు రమ్యముగా పేర్కొన బడుచున్నవి. క్రింద వివరింపబడిన ఉభయవిధ గుణములకు నిత్యనిరవధిక నిలయుడు సుందరబాహుస్వామి

**4.3.7.1 సౌశీల్యము :-**

తానెంత పురుషోత్తముడైనను అత్యల్పులతోడ మిగుల కలసి మెలసి యుండుట [121]

**4.3.7.2 వాత్సల్యము :-**

భక్తుల యెడ దోషము లెన్నియున్నను వానిని వినకుండెడు ప్రేమ విశేషము.[122]

**4.3.7.3 మృదుత్వము :-**

ఆశ్రితులతోడి వియోగమును ఓర్వలేకుండుట

**4.3.7.4 సౌహార్దము :-**

ఆశ్రితులు, ఆశ్రయింపనివారు అను వేరుబాట లేక అందరి హితమును కోరుట

120 సుం స్త 25

121 వై స్త ౦౦

122 సుం స 30

**4.3.7.5 సామ్యము :-**

కులము, విద్య శీలములు వీనిని లెక్కింపక అందరికి సమాశ్రయణార్హుడగుట.

**4.3.7.6 ఆర్జవము :-**

ఋజుత్వము - మనోవాక్కాయములను త్రికరణములందును ఒకే తీరగు శీలము

**4.3.7.7 ధైర్యము :-**

మిక్కిలియనిష్టప్రసక్తి కలిగినపుడు చెదరని చిత్తవృత్తి కలిగియుండుట.

**4.3.7.8 స్థైర్యము :-**

తనను శరణుజొచ్చినవాని విషయమున సాక్షాత్తు పురషకార స్వరూపిణియగు లక్ష్మీదేవి దోషములు ప్రకటించినను ప్రతిజ్ఞా భంగములేకయుండుట.

**4.3.7.9 వీర్యము :-**

అతిదుష్కరములైన యుద్ధములు చేయవలసివచ్చినను శ్రమయే కలుగకుండుట.[123]

**4.3.7.10 శౌర్యము :-**

అసహాయుడు (ఏకాకి) అయినను అతిభీకరముగా శత్రువుల గుంపులందు నిర్భయముగ ప్రవేశింపగల శక్తి

**4.3.7.11 కృతితా :-**

కృతకృత్యత్వము - చేయవలసిన పనిని చక్కగ నెరవేర్చుట

---

123 వై స్త 37

**4.3.7.12 గాంభీర్యము :-**

హృదయములోని భావములు ఇతరులు గుర్తెరుగలేని గుండెదిటవు.

**4.3.7.13 చాతుర్యము :-**

ఇతరులెవ్వరుగాని చేయులేని కార్యమును అలవోకగా చేయగలుగుట.

ఇవి స్వరూప గుణములు. ఇక విగ్రహగుణములు ఈ ప్రకారముగ నున్నవి -

**4.3.7.14 సౌందర్యము :-**

చూపులను హృదయమును ఆకట్టుకొను అవయవశోభ.

**4.3.7.15 సౌకుమార్యము :-**

విరులకంటె అధికమైన మెత్తదనము.

**4.3.7.16 సమత :-**

సాముద్రికశాస్త్రోక్తమైన సమపరిమాణమగు అవయవముల స్థితి.

**4.3.7.17 లావణ్యము :-**

సముదాయ శోభ - అనగా ప్రత్యేకావయవములశోభకాక మొత్తము శరీరమునకుగల ఆకర్షణశక్తి. శరీరావయవములలో అణిముత్యములలో లోపల కదలాడుచున్నట్లు కన్పించెడి కాంతి విశేషము.[124] ఇట్టి సమగ్ర గుణములకును కులభవనము శ్రీ సుందర బాహు స్వామి.

124 ముక్తా ఫలేషు ఛాయయా స్తరలత్వ మివాంతరా।
ప్రతిభాతి యదంగేషు తల్లావణ్య మిహోచ్యతే॥
ర సు । ।౮।

ఇంతకన్నను గుణవములను వర్ణింపనలవికాదు. ఇది అద్భుతశ్లోకము. ఇందులోని సౌశీల్యాదిగుణములు ఆశ్రయించినవారికి సౌకర్యములు కల్గించును. శక్త్యాదులు ఆశ్రయించిన వారికి రక్షణాదులనందించును.

**4.3.8 క్షాంతి :-**

పరదుఃఖాసహిష్ణుత్వరూపమ్మైన దయాగుణమునకు నిదానమ్మై, ''దోషేష్వపి భోగ్యగణనా ఖలు వత్సలత్వమ్ '' అనునట్టి వాత్సల్య దివ్య గుణమునకు కారణమ్మైన, ఎంతటి అపరాధములనైనను ఓర్వగలట్టి క్షాంతి అను గుణమును ఈ క్రింది శ్లోకమున శ్రీవత్సాంకమహాకవి అత్యద్భుతముగ అనితరసాధారణమగు ధోరణిలో వర్ణించిరి - పరిశీలింపుడు.

యద్బ్రహ్మకల్పనియుతానుభవేఽప్యనాశ్యం
తత్కిల్బిషం సృజతి జంతు రిహ క్షణార్ధే।
ఏవం సదా సకలజన్మసు సాపరాధం
క్షామ్యస్యహో ! తదభిసంధివిరామమాత్రాత్ ॥[125]

లక్షలకొలదియైన బ్రహ్మకల్పముల కాలమనుభవించినను తీరని కొండలంతటి పాపములను ఒక జీవుడు క్షణార్థకాలముననే సృష్టింప గలుగుచున్నాడు. ఇట్లు ప్రతిజన్మమందును పాపములు చేయుచున్నాడు అది అనుభవపూర్వకముగ తీరుటెట్లు? ఎప్పుడు? చేతనులారా! భయపడవలదు. ఉత్తారకమగు అపార కరుణ యొక్కటున్నది. ఆ భగవత్కృప మిమ్ము కాపాడును. స్వామి క్షాంతి గుణము ఆశ్చర్యకరము ''ఇక మీదట నేను పాపములు చేయను'' అని సంకల్పించి పాపాభిసంధి విరామమాత్రముచేతనే ఆ జీవుని నీవు రక్షింతువు గదా! స్వామీ! నీ క్షమా గుణమునేమని వర్ణింతును ఇట్టి క్షాంతి నుండి ఉద్భవించెడి వాత్సల్య గుణము జీవులను కాపాడు చున్నది. భగవంతుడు వాత్సల్యమూర్తి

125 వై స్త 62

వైష్ణవ మతమునననుసరించి భగవంతుడు నిర్గుణుడు కాడు. సకల కళ్యాణ గుణాకరుడు. లోకమున గుణముల వలన ఒక పదార్థమునకు శ్లాఘ్యతయో, మంగళాస్పదత్వమో కలుగును కాని నీ విషయమట్లుగాదు. నీ సంబంధము వలననే గుణములకు మంగళ కరత్వము సిద్ధించును. అట్లయినచో ''నిర్గుణ శ్రుతికి గతి యేమి?'' అని శంక కలుగును. అది యకించిత్కరము ''సత్త్వాదయో న సన్తీహ యత్ర స్తే ప్రకృతేర్గుణాః'' సత్త్వ రజ స్తమస్సులనెడి గుణములు పాకృతికములు. అప్రాకృతికుడవైన నిన్ను ఆ గుణములు స్పృశింపవు. కావుననే నీవు నిర్గుణుడవగుచున్నావు'' అని తత్త్వవిదులు సిద్ధాంతీకరించినారు.

### 4.3.9 షాడ్గుణ్యపరిపూర్ణుడు :-

భగవంతునికి షాడ్గుణ్య పరిపూర్ణుడను ప్రసిద్ధి కలదు. ఈ విషయమును శ్రీవత్సాంకులు అతిమానుషస్తవమున (6) ప్రస్తావించిరి. విజ్ఞాన, బల, ఐశ్వర్య వీర్య, శక్తి తేజస్సులనెడి ఆరు గుణములకు నిలయమైనవాడు పరమాత్మ. ఈ విషయమే సుందరబాహు స్తవమున ''సదా షాడ్గుణ్యా ఖ్యైః పృథుబలైః''[26] అను శ్లోకమున వివరింప బడినది. వరదరాజస్తవమున '' ప్రకృష్టం విజ్ఞానం. . . . ''[27] అనెడి శ్లోకమున షడ్గుణములు వర్ణింపబడి తరువాత శ్లోకమున గుణవిభజన చేయబడినది. చూడుడు-

> గుణైష్షడ్భిస్త్వేతైః ప్రథమతరమూర్తి స్తవ బభౌ
> తతస్తిస్ర స్తేషాం త్రియుగ! యుగళైర్హి త్రిభి రభూః।
> వ్యవస్థా యా చైషా నను వరద! సావిష్కృతి వశాత్
> భవాన్ సర్వత్రైవ త్వగణిత మహా మంగళగుణః ॥[28]

126 సుం స్త 24

127 వ స్త 15

128 అందులోనే 16

పరవాసుదేవుని యందు షడ్గుణములు నిండి యున్నవి. ఈ మూర్తిగాక ఉపాసక సౌకర్యార్థమై లోక రక్షాది కార్యముల నుద్దేశించి ఇంకను మూడు మూర్తులను సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ నామములతో సృష్టించెను. ఈ మూర్తులు పూర్ణషాడ్గుణ్యమూర్తులు కారు. ఒక్కొక్క మూర్తియందును రెండేసి గుణములుండును. సంకర్షణ మూర్తి జ్ఞాన బలముల కాశ్రయమై రుద్రునధిష్ఠించి సంహారక్రియయను శాస్త్ర ప్రదానమును చేయును. ప్రద్యుమ్న మూర్తియందు ఐశ్వర్య వీర్యగుణములున్నవి. ఈ మూర్తి చతుర్ముఖుని యందావేశించి సృష్టిని ధర్మమును ప్రవర్తింపజేయును. ఇక అనిరుద్ధమూర్తి శక్తి తేజోగుణములు గలిగి యుండి కాపాడుచుండును అట్లే స్వస్వరూపావిర్భావ రూపమైన మోక్షమును పొందించును. పరవాసుదేవ మూర్తి నిత్యముక్తాను భావ్యుడై యుండెడు షాడ్గుణ్యపరిపూర్ణపరబ్రహ్మము

**4.3.9.1 వీర్యగుణ ప్రభావము :-**

భగవంతునికి షాడ్గుణ్యపరిపూర్ణత వివక్షితము అందులోని వీర్యగుణము ముఖ్యము. ''స్వయమవికృతత్వే సతి ఇతరేషాం వికారహేతుత్వం వీర్యమ్'' అని వీర్యశబ్దము నిరుక్తము. కావున అన్ని పదార్థములకు ఎన్నో వికారములను కలిగించుచు తాను మాత్రము వికారశూన్యుడుగా నుండుటే వీర్యగుణ ప్రభావము తిలకింపుడు-

విశ్వస్య విశ్వవిధకారణ మచ్యుత ! త్వం
కార్యం తదేత దఖిలం చిదచిత్స్వరూపమ్ ।
త్వం నిర్వికార ఇతి వేదశిరస్సు ఘోషో
నిస్సీమమేవ తవ దర్శయతీశితృత్వమ్ ॥ [29]

ఓ అచ్యుతా! నీవు చ్యుతి లేని వాడవు. వికారములుగాని, నాశముగాని లేని వాడవు. అట్టి నీవు చ్యుతి కలిగినట్టి జగత్తునకు కారణ మెట్లగుదువు అని శంకింపరాదు అది పరమాత్మ యొక్క పరమాద్భుత

(29) వై స్త 37

మహిమ. భగవంతుడు సూక్ష్మచిదచిద్విశిష్ట రూపమున ఉపాదాన కారణ మగుచున్నాడు "బహుస్యాం ప్రజాయేయేతి"[130] అనెడి సంకల్పబల వేషమున నిమిత్తకారణము అట్లే కాలాది విశిష్ట స్వరూపములతో సహకారికారణము గూడ శ్రీహరియే అగుచున్నాడు. ఉపనిషత్తులు నారాయణుని నిర్వికారుడు అని ఘోషించుచున్నవి. ఇదియంతయు పై జెప్పిన షాడ్గుణ్యమందలి వీర్యగుణము యొక్క అపారమహిమయే.

### 4.3.9.2 దయాగుణ ప్రాధాన్యము :-

భగవంతునకు అసంఖ్యాక గుణములున్నను అందు దయాగుణమునకే వైష్ణవమతము ప్రాధాన్యమిచ్చినది. కాబట్టియే వేదాంతదేశికులు దయాశతకమే వ్రాసిరి. శ్రీవత్సాంకులు తమ పంచస్తవ ప్రథమ శ్లోకమున "దయైకసింధోః" అను శబ్దమును ప్రయోగించి, పరశ్శతగుణములున్నను వానిని పేర్కొనక ప్రథమముగా దయా గుణమునే పేర్కొనుచు దయాగుణ ప్రాధాన్యము సూచించిరి.

### 4.3.10 శేషశేషిభావము :-

శేషుడనగా దాసుడని సామాన్యార్థము. "యదేష్ట వినియోగార్హత్వం శేషత్వ మభిధీయతే" "పరగతాతిశయాధానేచ్ఛయా ఉపాదేయత్వమేవ యస్య స్వరూపం సః శేషః"[131] అని శేష శబ్ద నిర్వచనము భగవంతుని యందున్నట్టి మహిమను అతిశయింపజేయునట్లుగా స్వీకరించుట ఎవని స్వరూపమో అతడు శేషుడు

"దాసభూతాః స్వత స్సర్వే హ్యాత్మానః పరమాత్మనః।
నాన్యథా లక్షణం తేషాం బంధే మోక్షే తథైవ చ॥"[132]

---

130 ఛాం ఉ 6 2 3

131 వి శ్రో పు 255

132 పం స పు 55

అను ప్రమాణము ననుసరించి దాస్యవృత్తియే జీవుని ప్రధాన లక్షణము. భగవత్సేవయే పరమ ప్రాప్యము ఐహికైశ్వర్యము గాని ఆముష్మికైశ్వర్యముగాని, బ్రహ్మరుద్రాది పదములుగాని చివరకు కైవల్య ముక్తిని గాని కోరను. అవి యన్నియు అల్పరసవులు, ఊషరక్షేత్ర జలసమానములు అని ఈ శ్లోకమున తెలుపుచు శ్రీవత్సాంకులు -

భోగా ఇమే విధిశివాదిపదం చ కించ
స్వాత్మానుభూతిరితి యా కిల ముక్తి రుక్తా।
సర్వం తదూషజలజోష మహం జుషేయ
హస్తు(దినాథ! తవ దాస్యమహారసజ్ఞః॥[133]

తవ దాస్యైక ప్రావణ్యవగు వైష్ణవసిద్ధాంతసారవును ఉపదేశించిరి. ఇదియే శేషత్వధర్మము. ఇదియే ప్రత్యగాత్మ స్వరూపము తాను అచేతనవువలెనుండి భగవన్ముఖోల్లాసకరవుగునట్లు కైంకర్యమొనర్చుటే వైష్ణవమతము ననుసరించి జీవస్వరూపము.

### 4.3.11 అవతార ప్రయోజనము :-

శ్రీమన్నారాయణుడే రామకృష్ణాది రూపవున భూమియందవతరించెను. అవతారమనగా పై అంతస్తు నుండి క్రింది అంతస్తునకు దిగుటయే. పరమాత్మ శుద్ధసత్త్వమయమై ఉత్తమోత్తమమని కొనియాడబడుచున్న శ్రీవైకుంఠమునుండి అతి సాధారణమగు భూలోకమున మత్స్యాది రూపముననను, రామకృష్ణాది రూపముననను అవతరించుట ఉచ్చదశ నుండి క్రిందిదశకు వచ్చుటగా యున్నందున అవతారశబ్దవునకర్థము తెలియుచున్నది. ఇట్లవతరించుటకు కారణము శ్రీకృష్ణుడు స్వయముగనే చెప్పకొనెను -

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥[134]

133 వ స్త 8।
134 భ గీ 4 8

దీని సారమును తెలియజేయు కూరేశుల శ్లోకమిట అనుసంధేయము.

అనాప్తం వ్యాప్తవ్యం న తవ కిల కించి ద్వరద! తే
జగజ్జన్మస్థేమప్రళయవిధయో ధీవిలసితమ్।
తథాపి క్షోదీయ స్సురనరకులే ష్వాశ్రితజనాన్
సమాశ్లేష్టుం పేష్టుం తదసుఖక్కృతాం చావతరసి॥ [35]

భాగవతులకు సాక్షాద్దర్శన సంభాషణ సంశ్లేషణాదులను కల్పించి వారికి సంపూర్ణ తృప్తి కలిగించుటే ''పరిత్రాణ'' శబ్దమున కర్థమని శ్రీమద్భాష్యకారుల భావము [36] ఆ భావమునే శ్రీ కూరేశమిశ్రులు ఇంక కొంచెము విశదముగ ఉపదేశించుచున్నారు- '' ఆశ్రితజనాన్ సమాశ్లేష్టుమ్'' అని. ఇది యమోఘవచనము. భాగవతులకు భగవత్సంశ్లేషాభిరుచి యుండుగాక! వాస్తవమునకు అంతకంటె హెచ్చుగనే భగవంతునకు తన భక్తులతో ఆత్మబంధువులతోవలె కలసి మెలసియుండవలెననెడి యాశ యున్నది. అదెట్లు తీరును? స్వయముగ అవతరించిననే గదా! అందుకనియే 'సమాశ్లేష్టుం' అను పదము ప్రయోగింపబడినది. సమ్+ఆ+శ్లేష్టుం అనగా సమ్ అను ఉపసర్గకు చక్కగా, ఆ - అను ఉపసర్గకు సమన్తాత్, అన్ని విధముల సంపూర్ణముగా అని భావము. అనగా సంపూర్ణముగా అభిన్నుడై కలసిపోవుటయని యర్థము. అనగా ఇంతకంటె భగవంతుని యొక్క ''మహతో మందైస్సహ నీరంధ్రసంశ్లేషః'' అనెడి సౌశీల్య గుణమునకు ఉదాహరణమును చెప్పలేము. ఇదియే అవతార మహిమ అని సిద్ధాంతము.

### 4.3.12 పరమాత్మ పంచస్వరూపములు :-

లోకకల్యాణమునకై భగవంతుడు పంచ స్వరూపములుగా అవతరించిరి. 1. పరము 2 వ్యూహము 3 విభవము 4 అంతర్యామి

135 వ స్త 04

136 గీ భా 4 8

౫. అర్చాస్వరూపము శ్రీవత్సాంకులు ఈ విషయమును క్రింది శ్లోకమున నిరూపించిరి-

పరో వా వ్యూహో వా విభవ ఉత వా౽ర్చావతరణో
భవన్ వాంతర్యామీ వరవరద యో యో భవసి వై।
స స త్వం సన్నేశాన్ వరగుణగణాన్ బిభ్ర దఖిలాన్
భజద్భ్యో భాస్యేవం సతత మితరేభ్య స్త్వితరథా ॥[137]

ఈ పంచస్వరూపములలో వైష్ణవ సిద్ధాంతము ననుసరించి అర్చావతారమునకే ప్రాధాన్యము. సౌలభ్య పరాకాష్ఠ ఈ అవతారమునందున్నదని సిద్ధాంతము. భగవంతునకు భాగవతునకు కూడ ఈ యవతారము ప్రీతిపాత్రము.

వరదరాజస్వామికి నిలయము ఈ హస్తిగిరి. పరమపావనమైన ఈ పర్వతము త్రయికంటే మహత్తరమైనది. వేదత్రయము, తర్కశాస్త్రము, పూర్వోత్తర మీమాంసాశాస్త్రములు, తత్త్వజ్ఞాతలలో మిన్నలైన భగవద్వాల్మీకి, పరాశర, వ్యాసాది ప్రణీతములైన గ్రంథ శోధితములైన మహర్షుల వచనములచేత, తత్ జ్ఞానానుష్ఠానముల చేతను పాపనిర్ముక్తులైన వారికిమాత్రమే అనగా-''ఎన్నో జన్మలందాచరింపబడిన తపస్సు, జ్ఞానము, యోగ సమాధులచేత పాపములు నశింపగా అట్టివారికి ఎట్టకేలకు కృష్ణపరమాత్మయందు భక్తి కలుగును''[138] అనిన రీతిన నిష్పాపులైన భక్తులకు మాత్రమే భగవత్సేవ లభ్యమగును. కాని హస్తిగిరి మాత్రము వారు వీరనక ఎల్లవారికి భగవత్సేవాభాగ్యము నిచ్చుచున్నది. అని అర్చావతారుడగు వరదరాజ స్వామిని క్రింది శ్లోకమున ప్రస్తుతించిరి -

137 వ స్త 18

138 జన్మాంతర సహస్రేషు తపో జ్ఞాన సమాధిభిః।
నరాణాం క్షీణ పాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే ॥
పం స్త పు 17

న్యాయతర్క మునిముఖ్యభాషితై:
శోధితై స్సహ కథంచన త్రయీ।
ఙోషయేద్ధరి మనంహసో జనాన్
హస్తిధామ సకలం జనం స్వయమ్॥ [139]

### 4.3.13 నిత్యోదిత శాంతోదిత దశలు :-

పరమాత్మునకు నిత్యోదితదశ, శాంతోదితదశ అని రెండు దశలను వర్ణించుదురు.

### 4.3.13.1 నిత్యోదితదశ :-

తనచే సృష్టింపబడి కాపాడబడు చుండెడి లోకమును చూచుచు అనుభవించు దశ నిత్యోదితదశ దీనికి నిత్యోదితదశ అనుపేరు సార్థకము.

అతిపతితావధిస్వమహిమానుభవప్రభవత్
సుఖకృతనిస్తరంగజలధీయితనిత్యదశమ్।
ప్రతిభటమేవ హేయనికరస్య సదాఽప్రతిమం
హరి మిహ సుందరాహ్వ ముపయామి వనాద్రితటే॥ [140]

అను శ్లోకమును నిత్యోదితదశకు ఉదాహరణముగా కూరేశులు వర్ణించిరి. ఎల్లలు మీరిన తన మహిమను అనుసంధానము చేయుట వలన కలిగిన తరగలు లేని కడలివంటి ప్రశాంతదశ కలవాడును, నిరస్త హేయగుణములు గలవాడును అగు హరిని (వనాద్రినాథుని) ఆశ్రయింతును అని సంగ్రహభావము.

### 4.3.13.2 శాంతోదితదశ :-

దోషలేశాస్పృష్టమై సకల కళ్యాణ నిలయమైన స్వ స్వరూపమును అనుభవించి యానందించు దశ శాంతోదితదశ. శాంతోదితదశలో

139 వ స్త 8

140 సుం స 23

ప్రశాంతమై అనంతమైన స్వరూపానుభవ సాక్షాత్కారజన్యమైన మహానందాతిశయ మహిమచేత కలిగిన స్తిమితత్వము చేత కల్లోలముల అలజడిలేని సాగరమును పోలియుండును స్వామి దశ.[141]

నిస్సమాభ్యధికమై, కొలదిగా అనుకరింపగల నిస్తరంగ పారావారములు, నీ అత్యుత్కృష్ట స్వరూపమును ప్రతిపాదింపదలచిన వేదత్రయి, ఇది లేదు, అదిలేదు అనుటయందే ఆసక్తి గలదై నిష్కలము, నిష్క్రియము, అద్రేశ్యము (అదృశ్యము - కానరానిది) గ్రహింప నలవికానిది ఇత్యాది వచనములచేత దోషనిరసన యందే ప్రశాంతమైనది. కాని హస్తిగిరి మాత్రము అతి సౌలభ్యాది గుణ పరిష్కృతమైన స్వామి స్వరూపమును మన కళ్లెదుట నిలుపుచున్నది.

### 4.3.14 మంత్రరత్నము :-

మంత్రరత్నమనగా ద్వయమంత్రము. వైష్ణవమతమున ద్వయమంత్రమునకు ప్రముఖస్థానము. ప్రత్యహము అనుసంధింపబడు ''శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయనమః'' అనునది ద్వయమంత్రము ఇందు మొదటి ఖండము శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే; ఉత్తరఖండము శ్రీమతే నారాయణాయనమః.

### 4.3.14.1 పూర్వభాగము :-

శ్రీవత్సాంకులు ఈ ద్వయ మంత్రార్థమును తమ గ్రంథమునందు పొందు పరచిన విధమును తిలకింపుడు -

శ్రీనిధిం నిధి మపారమర్థినా మర్థితార్థ పరిదానదీక్షితమ్ ।
సర్వభూతసుహృదం దయానిధిం దేవరాజ మధిరాజ మాశ్రయే॥[142]

141 వ స్త 13

142 వ స 2

పై శ్లోకమున మంత్రరత్న పూర్వఖండార్థము సంగ్రహింప బడుచున్నది. శ్రీనిధి శబ్దము చేత (లక్ష్మీనివాసస్థలము) శ్రీమత్ పదము యొక్క అర్థము వివక్షితము. పిమ్మట 'నారాయణ' పదముచే బోధింపబడెడు గుణములందలి కొన్ని ముఖ్యగుణములు సంగ్రహింప బడుచున్నవి. 'అర్థినా మపారం నిధిమ్' అనుట చేత స్వామి యపార నిధియన్నందున పరమప్రాప్యుడని ద్యోతితమగుచున్నది. 'అర్థితార్థపరి దాన దీక్షితమ్' అనగా వరమడిగెడు వారిని చేరబిలిచి వరము లిచ్చువాడు వరములిచ్చుటే దీక్షగాగొన్నవాడనుట. అనగా ప్రాపకుడనుట.

విశిష్టాద్వైతమతమున స్వామియే ప్రాప్యుడు, ప్రాపకుడు కూడా. తాను ప్రాపకుడై యుండుట వలన తానేమైనా మననుండి ప్రతిగా కోరుకొనునేమో యను శంక కిచట ఆస్కారములేదు. ''సర్వభూత సుహృదం'' అను విశేషణమును గమనింప వలెను భగవంతుడు భక్తుల నుండి కించిత్తైనను అపేక్షింపడు ''దయానిధిం'' అను విశేషణము చేత, సౌహార్దము లేకపోయినను స్వతస్సిద్ధముగనే పరదుఃఖాసహిష్ణుత్వము బోధితము. ఇతరుల దుఃఖములను ఓర్వలేని దయాలుత్వము ఆయనయందు అవ్యాహతమై సర్వదాయుండును. ''అధిరాజమ్'' అనుట చేత వరదరాజే మనకు స్వామి, ప్రభువు.

''తమీశ్వరాణాం పరమం మహేశ్వరమ్ ।
తం దేవతానాం పరమం చ దైవతమ్ ॥''

అనగా ప్రభువులకెల్ల పరమ ప్రభువు. దేవతలకెల్ల పరాదేవత అన్నట్లు ఈ స్వామి దేవతా సార్వభౌముడు. ఆయనను శరణముగా పొందెదను. మొత్తముపై ''శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే'' అనెడి మంత్రరత్న పూర్వభాగము యొక్క అర్థము ఈ విధముగ నిరూపింపబడినది.

శ్రీమంతుడు శ్రియఃపతి ప్రాప్యుడు ప్రాపకుడును. అందుకు ఆవశ్యకములైన ఉపయుక్తములైన సౌహార్ద దయా స్వామిత్వములు కల దేవరాజు యొక్క చరణకమలములను శరణు పొందుదును, అని పర్యవసితార్థము

### 4.3.14.1.1 నారాయణ శబ్దార్థము :-

శ్రీవత్సాంకులు ''న్యాయ తర్క మునిముఖ్యభాషితైః''[43] అనెడి శ్లోకమున నారపదమునకు వాచ్యమైన శ్రీహస్తిశైల వైభవమును ప్రతిపాదించినారు. నారాయణ శబ్దము 'నార', 'అయన' పదముల సమాసరూపమైయున్నది. అచట 'నార' శబ్దమున కనేకార్థములున్నవి 'నార' మనగ నీరు, అయనముగా వాసస్థానముగా గలవాడు, పరమాత్మ. ''నరాద్భగవతో జాతాని తత్త్వాని నారాణి'' నరుడన భగవంతుడు. అతనినుండి పుట్టిన తత్త్వములు సృష్టిలోని పదార్థములన్నియు ఆయనకు నివాసస్థానములు. అనగా పరమాత్మ సర్వాంతర్యామి అని అర్థము.

'నార' శబ్దమునకు నర సమూహమని యర్థము. వారికి అయనం ఆధారమైనవాడు, కావున పరమాత్మ నారాయణుడు. 'నర' మనగా నాశములేని నిత్యవస్తువులు. (రిఙ్ = క్షయే ధాతువు) నర శబ్దములోని 'న' శబ్దము నిషేధార్థము కావున నరః నిత్య వస్తువులు నశింపనివి వాటి సమూహములు నారములు - అయనః - వానికి ఆశ్రయభూతుడు లేదా వాని నాశ్రయించి యుండువాడు (సర్వాంతర్యామి) నారాయణుడు

ముఖ్యముగా నిచట గమనింపవలసినది - భగవత్సృష్ట పదార్థములన్నియు నారములు. హస్తిగిరియు ఆ సృష్టి లోనిదే కావున హస్తిశైలము కూడ నారమే. కావున నార = హస్తిశైలము వాసస్థానముగా గలవాడు నారాయణుడని అర్థము ఇట్లు కరిగిరి నారపద వాచ్యమైనది ఈ విధముగా మంత్రరత్నము నందలి 'నార' పదమును శ్రీవత్సాంకులు వివరించిరి.

[43] వ స 8

**4.3.14.2 ఉత్తర భాగము :-**

''అయే! దయాలో! వరద! క్షమానిధే!''[144]

**అను** శ్లోకమునందు దయాలో! క్షమానిధే! అను రెండు సంబోధనల **చేత** 'శ్రీమత్' శబ్దము యొక్క అర్థము వివక్షితము. శ్రీ, భూదేవులు దయాక్షమా శబ్దవాచ్యులు. 'దేవ్యా కారుణ్య రూపయా'', ''సాక్షాత్ క్షమా'' మనియు పెద్దలు పేర్కొందురు. సర్వజ్ఞ, సర్వశక్తిక యున్నగు సంబోధన పదములచేత 'నారాయణ' శబ్దార్థము వివరింపబడినది. 'దాస్యం ప్రాపయ' అనుట చేత చతుర్థీ విభక్త్యర్థము బోధింపబడినది. 'ప్రసహ్య' అను అవ్యయము చేత నమశ్శబ్దార్థము వివరింపబడినది. ఈ విధముగ మంత్రరత్నపు ఉత్తర వాక్యము చక్కగ వ్యాఖ్యానింపబడినది.

**4.3.15 ఉభయ విభూతి నాయకుడు :-**

శ్రీమన్నారాయణుడు ఉభయ విభూతులకు అద్వితీయ ప్రభువు. శివ చతుర్ముఖాది వాసస్థానమైన చతుర్దశ భువనములు లోగొన్నదొక అండము. ఇట్టివే వందల కొలది యండములు నీకు క్రీడోపకరణములు. ఈ యండములన్నియు నీ మహిమయొక్క లవలేశ దశ-సహస్రాంశములు. ఇదిగాక వేరొక మహావిభూతి యున్నది. అది పరిణామాది దోషాస్పృష్టము. అతిక్రాంత కాలము. అదియే నిత్య విభూతి. ''**తద్విష్ణోః** పరమం పదం సదా పశ్యన్తి సూరయః'',[145] ''తదక్షరే పరమే వ్యోమన్''[146] '' తమసః పరస్తాత్''[147] మొ॥ శ్రుతి వాక్యములచే పేర్కొనబడినది. అది పరమసత్త్వగుణమయము. అది పంచోపనిషదాత్మకము. పంచ భూతములగు పృథివ్యాదులకు అచట పనిలేదు.

---

144 వ. స్త. 23

145 సు బా ఉ 6 ।

146 మ నా ఉ । 2

147 శ్వే ఉ 3 8

''పరమేష్ఠీ పుమాన్ విశ్వ: నివృత్త: సర్వమేవ హి।
పంచైతాశ్శక్తయ: ప్రోక్తా: పరస్య పరమాత్మన:॥''

ఈ పంచశక్తులనే పంచోపనిషత్తులందురు.[148]

ఈ నిత్యవిభూతి బ్రహ్మరుద్రేంద్రాదులకును అందరానిది. నివృత్తి మార్గ నిష్ఠులైన సనకాదులకును దుర్లభము. దీనిని సాక్షాత్కరించు కొనుటయే సాయుజ్యము. ఇంతకంటే ఉన్నతపదము వేరొకటి లేదు.

**4.3.16 లక్ష్మీపురుషకారము :-**

శ్రీవత్సాంకులు సమస్త చేతనులకు పురుషకార స్వరూపిణియగు అమ్మవారిని ప్రసన్నురాలిని చేసుకొనుటకు పదునొకండు శ్లోకములతో శ్రీస్తవమును రచించిరి. శ్రీవైష్ణవులు పురుషకార స్వరూపిణియగు శ్రీదేవిని పురస్కరించుకొని భగవంతునాశ్రయింతురు. కావుననే శ్రీవైష్ణవులు భగవద్దర్శనార్థమై దేవాలయమునకు పోవునపుడు ముందుగా అమ్మవారిని సేవించుకొనియే తర్వాత స్వామి దర్శనము చేసికొందురు.

స్వస్తి శ్రీ ర్దిశతా దశేషజగతాం సర్గోపసర్గ స్థితీ:
స్వర్గం దుర్గతి మాపవర్గికపదం సర్వం చ కుర్వన్ హరి:।
యస్యా వీక్ష్య ముఖం తదింగితపరాధీనో విధత్తేఽఖిలం
క్రీడేయం ఖలు నాన్యథాఽస్య రసదా స్యాదైకరస్యాత్తయా॥[149]

సర్వతంత్ర స్వతంత్రుడు, సకల జగన్నియంతయు అయిన శ్రీమహావిష్ణువు జగదుత్పత్తి స్థితి లయములు చేయునపుడు గాని, స్వర్గ నరకాదులను కల్గించునపుడు గాని ఏమి చేయదలచుకొనినను తన కాంతామణి

148 పరమేష్ఠీ = ఆకాశస్థానీయము. పుమాన్ = వా యువు. విశ్వ: = తేజోరూపము. నివృత్తి: = జలము వంటిది సర్వమ్ = పృథివీస్థా ము
సుం స్త 4।

149 శ్రీ స్త ।

మోముజూచి ఆమె ఇంగితమెరిగి ఆమె కోర్కె చొప్పుననే సర్వము చేయుచున్నారు. ఇట్లామెతో ఐకరస్యము తోడ సృష్ట్యాది లీల శ్రీహరి సలుపడేని అది స్వామికి మహానందము కలిగించునది కానేరదు ఇదియే పురుషకారప్రభావము.

**4.3.17 ఊర్ధ్వపుండ్రములు :-**

శ్రీవైష్ణవ లక్షణమును వివరించునపుడు భాగవతులు తప్పక ఊర్ధ్వపుండ్రములు ధరింపవలెననెడి నియమము కలదు. ఈ విషయమునే శ్రీవత్సాంకులు నిరూపించిరి -

జుష్టాష్టమీకజ్జలబిందుసన్నిభం
ధృతోర్ధ్వపుండ్రం విలసద్విశేషకమ్।
భూమ్నా లలాటం విమలం విరాజతే
వనాద్రినాథస్య సముచ్ఛ్రితశ్రియః॥ [50]

ఈ శ్లోకమునందు స్వామి ఊర్ధ్వపుండ్రములను ధరించి విరాజిల్లునట్లుగా వర్ణించినది మన కొరకే. మనము తప్పక ఊర్ధ్వ పుండ్రమును భగవన్ముఖోల్లాసార్థమై ధరింపవలెనని ఉపదేశించుట కొరకే

ఇదే విషయమును వరదరాజస్తవమున " ఉద్ధరత్యుపరి"[51] అను శ్లోకమున పేర్కొనుచు ఊర్ధ్వపుండ్ర తిలకము ఊర్ధ్వలోక ప్రాప్తిని సూచించునని పేర్కొనిరి.

స్నానం దానం జపో హోమః స్వాధ్యాయః పితృతర్పణమ్।
భస్మీ భవతి తత్సర్వ మూర్ధ్వ పుండ్రం వినా కృతమ్॥ [52]

పై శ్లోకమువలన ఊర్ధ్వపుండ్రప్రాముఖ్యము తెలియుచున్నది.

---

150 సుం స్త 4।

151 వ స్త 20

152 పం స్త పు 50

**4.3.18 భాగవతాపచారము :-**

శ్రీవైష్ణవ సంప్రదాయములో భాగవతాప చారము క్షమించరాని నేరము. ఈ విషయమును నిరూపించిన విధము పరిశీలింపుడు -

యదపరాధసహస్ర మజస్రజం
త్వయి శరణ్య! హిరణ్య ఉపావహత్ ।
వరద! తేన చిరం త్వ మవిక్రియో
వికృతి మర్భకనిర్భజనా దగాః ॥[153]

స్వామీ! నీకు సాక్షాత్తుగా అపచారము చేసిన వారిని క్షమింతువే. భవదీయులకు అపకారము చేసిన ఓర్వలేవు. హిరణ్యకశిపుడు నీ యెడ అపరాధసహస్రములు చేసినాడు. కాని దానివల్ల నీలో కోపాది వికారములు కలుగలేదు. కాని అర్భకుడైన ప్రహ్లాదుని యెడ తండ్రి చూపిన నిరాదరణ చూచి క్రోధాగ్నిని విరజిమ్మితివి. భగవదపచారము సహ్యమగునేమోగాని, భాగవతాపచారము దుస్సహము ఈ విషయము వైష్ణవాచారములలో అతి ప్రధానము.

**4.3.19 ఆచార్యానుగ్రహము :-**

శ్రీవైష్ణవ సంప్రదాయమున భగవద్భాగవత ప్రతిపత్తి కంటె ఆచార్య ప్రతి పత్తియే ముఖ్యము. ఈ శ్లోకములోని చమత్కారమును గమనింపుడు -

శ్రీమంతౌ హరిచరణౌ సమాశ్రితోఽహం
శ్రీరామావరజమునీంద్రలబ్ధబోధః ।
నిర్భీక స్తత ఇహ సుందరోరుబాహుం
స్తోష్యే తచ్చరణవిలోకనాభిలాషీ ।[154]

153 వ స్త 68

154 సుం స ।

సుందరబాహుస్వామిని స్తుతించుటకు ప్రయోజనము స్వామి వారి అనుగ్రహము నభిలషించియో, స్వామి దర్శనమభిలషించియో చేయుటలేదు. శ్రీభాష్యకారుల వియోగము నోర్వలేనివారై శ్రీభగవద్రామానుజుల పాదారవింద దర్శనాభిలాషి అయియే, ఆ దర్శనభాగ్యము ప్రసాదింపుడని కోరుచున్నారు. వారి అనుగ్రహము వలనే ఇంతటి జ్ఞానము తనకేర్పడినదని కృతజ్ఞతాబద్ధులై వారి చరణ నళిన దర్శనమునే కోరుచున్నారు. ఈ స్తోత్రమందుపక్రమ మిట్లుండ ఉపసంహారమందు కూడా ఇట్టి అభిప్రాయమునే వెలిబుచ్చుచున్నారు-

విజ్ఞాపనాం వనగిరీశ్వర! సత్యరూపా-
మంగీకురుష్వ కరుణార్ణవ! మామకీనామ్।
శ్రీరంగధామని యథాపుర మేకతోఽహం
రామానుజార్యవశగః పరివర్తిషీయ॥[155]

కరుణాసాగర! వనాద్రీశ్వరస్వామీ! నా విజ్ఞప్తిని సఫలమగు నట్లుగ అంగీకరింపుము. యథాపూర్వముగ శ్రీరంగ దివ్యక్షేత్రమున శ్రీరామానుజులవారివద్దనే శేషభూతుడనై వారికి కైంకర్యము లొనర్చునట్లుగ నన్ననుగ్రహింపుము. ఉపక్రమోపసంహారము లొక్క రీతిగ నుండుట వారి యార్తిని ఆచార్య ప్రతిపత్తిని చాటి చెప్పుచున్నది.

**4.3.20 సాత్త్వికపురాణ గ్రాహ్యత్వము :-**

పురాణములు సాత్త్వికములు, రాజసములు, తామసములు అని మూడు విధములు అందు సాత్త్వికములే గ్రాహ్యములని తెలుపుచు ఆ విభాగమును కూడా నిర్ణయించిరి

**తత్త్వార్థతత్పరపరశ్శతవేదవాక్యైః**
సామర్థ్యత స్మృతిభిరప్యథ తాదృశీభిః।

155 సుం స 126

త్వామేవ తత్త్వపరసాత్త్వికసత్పురాణై:
దేవఙ్ఞ ధీభిరపి నిశ్చినుమ: పరేశమ్ ॥[156]

ఈ విధముగా పరిశీలించి చూచినచో వైష్ణవ సిద్ధాంత సారభూత తత్త్వములెన్నియో ఈ పంచస్తవమందు పొందుపరచబడినవి. ఉదాహరణకు కొన్ని మాత్రమే ఇచట సూచింపబడినవి.

## 4.4 పంచస్తవిపై ఉపనిషత్తుల ప్రభావము :-

కూరేశమిశ్రులు వేదవేదాంగతత్త్వఙ్ఞులు. అంతమాత్రమే గాక సర్వోపనిషత్తత్త్వము వారికి కరతలామలకము. ప్రస్థానత్రయములో ప్రముఖస్థాన మాక్రమించుచున్న ఉపనిషత్తులలోని సారమును తీసికొని విశిష్టాద్వైత సిద్ధాంతమున కనుగుణముగా పంచస్తవములలో అచటనచట కొన్ని ఉపనిషద్వాక్యములను, పదములను ఆయన ప్రయోగించినారు. ఉదాహరణకు కొన్ని మాత్రము ఇచట ప్రస్తావించబడుచున్నవి.

### 4.4.1 వైకుంఠస్తవము :-

వైకుంఠనాథుని విశ్వపతిత్వ భావనను, విశ్వాత్మ భావనను నిరూపించుచు కఠోపనిషత్తు మొ॥ ప్రధానోపనిషద్వాక్యములను ఈ స్తవములోని కొన్ని శ్లోకములందు సందర్భోచితముగ ప్రయోగించుట గమనార్హము.

1. "ఈశాన మస్య జగతో యదణోరణీయ:"[157] మరియు "య: ఖల్వణో రణుతరో మహతో మహీయాన్"[158] అను శ్లోకములందు ప్రయోగించిన ఉపనిషద్వచనములు జగత్ప్రసిద్ధములు ' ఈ

156 వై స్త 17
157 వై స్త 6
158 వై స్త 8

శానమస్య జగతః' అనునది ''పతిం విశ్వస్యాత్మేశ్వరం''[159] అను మహానారాయణోప నిషద్వాక్యమును; 'యదణోరణీయః' అనునది ''అణోరణీయాన్ మహతో మహీయాన్''[160] అను కఠోపనిషద్వచనము ననుసరించి ప్రయోగింపబడినవి. కేవలము భావమునందు మాత్రమే గాక భాషయందును అవే పదములు వాడిన కూరేశ మిశ్రుల అర్థవిజ్ఞానము అతిమహత్తరమైనది.

2 పంచస్తవిలోని శ్లోకములలో కొన్నిచోట్ల ఒక్కపాదమునందు మాత్రమే ఉపనిషద్వాక్యములు కనిపించుచున్నను, కొన్ని శ్లోకములలో అధికముగ వాటిని చొప్పించి రచన గావించిన విధము వీరి వేద విజ్ఞానమునకు తార్కాణముగా పేర్కొనవచ్చును. ''యం భూత భవ్య భవదీశ మనీశ మాహుః''[161] ఈ శ్లోకము నందలి మూడు పాదములు మూడు శ్రుతి వాక్యములతో నిండియున్నవి. ప్రథమపాదమున ''ఈశానో భూత భవ్యస్య''[162] అని, ద్వితీయపాదమున ''య మంతస్సముద్రే కవయోవదంతి-తదేక మవ్యక్త మనన్త రూపమ్''[163] అని చతుర్థ పాదమున ''సహస్రశీర్షా పురుషః''[164] అనియు శ్రుతి వాక్యములు ప్రయోగింపబడినవి.

3 ''యన్మూలకారణ మబుద్ధ్యత సృష్టి వాక్యైః''[165] అనెడి శ్లోకమున శ్రీమన్నారాయణుడే సృష్టికి మూలకారణమని పేర్కొనుచు ఈ విషయమునే మహోపనిషత్తు స్పష్టపరచుచున్నదని [166]

---

159 మ నా ఉ 9 3

160 క ఉ 2 20

161 వై స్త 22

162 క ఉ 4 13

163 మ నా ఉ 1 3

164 పు సూ 1

165 వై స్త 25

166 ఏకో హ వై నారాయణ ఆసీత్ న బ్రహ్మా నేశానః
మ ఉ 1 1

సుబాలాద్యుపనిషత్తులు కూడా ఈ యర్థమునే వివరించుచున్నవని పేర్కొనెను.[167]

ఇది మిశ్రులకు అనేకానేక ఉపనిషత్తులలో ప్రావీణ్యము కలదని నిరూపించుటకు ఉదాహరణము మాత్రమే.

4. 'మాయాం తు ప్రకృతిం విద్యాత్'''[168] అను శ్రుతి వాక్యమున 'మాయా' అన్న పదము ప్రకృతి అను అర్థమున ప్రయోగింపబడుట ననుసరించి-

''మాయా త్వయా గుణమయీ కిల యా నిసృష్టా'''[169] అను శ్లోకమున ప్రకృతిని మాయ యని వర్ణించిరి

5 యద్వైష్ణవం హి పరమం పదమామనంతి
ఖం వా యదేవ పరమం తమసః పరస్తాత్ ।
తేజోమయం పరమసత్త్వమయం ధ్రువం యత్
ఆనందకంద మతిసుందర మద్భుతం యత్ ॥ [170]

ఈ శ్లోకము ప్రథమ పాదములో ''తద్విష్ణోః పరమం పదం సదా పశ్యన్తి సూరయః'' [171] అని ద్వితీయ పాదమున ''తదక్షరే పరమే వ్యోమన్'''[172] అని చతుర్థ పాదమున'' యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ ఆనందం బ్రహ్మణో విద్వాన్'''[173] అను శ్రుతి వాక్యములను భాషలోను భావములోను అనుకరించి ఈ స్తవములు ఉపనిషదర్థ గుంభితములే అని కూరేశమిశ్రులు నిరూపించిరి

167 దివ్యో దేవ ఏకో నారాయణః:
సు ఉ 6 ।
168 శ్వే ఉ 4 10
169 వై స్త 30
170 అందులోనే 4 ।
171 క ఉ 3 9
172 మ నా ఉ 1 2
173 తై ఉ 2 4

**4.4.2 అతిమానుషస్తవము :-**

1 శ్రేయః కిరంతు కిరణాశ్చరణారవింద-
నిష్యందమానమకరందరసౌఘదేశ్యాః।
తజ్జాశ్రుతే ర్మధున ఉత్స ఇతి ప్రతీతాః
మాంగల్యరంగనిలయస్య పరస్య ధామ్నః ॥[174]

శ్రీరంగనాథుని పాదములు పద్మసమానములు. అయినచో ఆపాదమునుండి వెలువడుచున్న కిరణములు తామరపుష్పమునుండి స్రవించుచున్న మకరందరస ప్రవాహమో యనునట్లున్నవి. పాదములను పద్మములని ఉత్ప్రేక్షించినపుడు కిరణరూపమున మకరందము స్రవించుచున్నదను అర్థమును 'తజ్జాశ్రుతేః' అని శ్రుతులు కూడా ఈ అర్థమునే పేర్కొనుచున్నవని ''విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః''[175] అను శ్రుతి వాక్యమును ప్రదానముగా గైకొని తమకున్న ఉపనిషత్పరిజ్ఞానమును చాటి చెప్పిరి

2 శ్రీరంగరాజచరణౌ ప్రణుమో యయోః ఖలు
ఏక స్త్రివిక్రమ విధౌ వసుధా మశేషామ్।
వ్యక్రంస్త సాచలకులామపి విప్రకీర్ణ
స్థూలావలగ్న సికతామివ నిర్ణతోచ్ఛ్రమ్ ॥[176]

శ్రీరంగనాయకుని పాదపద్మములను వర్ణించిన ఈ శ్లోకములో ''త్రివిక్రమవిధౌ'' ''వ్యక్రంస్త'' అను ప్రయోగములు ''ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్''[177] అను శ్రుతిననుసరించియే యని స్పష్టమగుచున్నది

---

174 అ స్త 2

175 వి సూ 2

176 అ స్త 5

177 ఋ వే 1 ... 7

3. "పశ్యత్సు సూరిఘు సదా పరమం పదం తే"[178] అన్న అతిమానుషస్తవ శ్లోకము "తద్విష్ణోః పరమం పదం సదా పశ్యన్తి సూరయః"[179] అను ఉపనిషద్వచన మాధారముగనే రచింపబడినదని తెలియుచున్నది.

**4.4.3 సుందరబాహు స్తవము :-**

1. సద్బ్రహ్మాత్మపదైస్త్రయీ శిరసి యో నారాయణోక్త్యా తథా
వ్యాఖ్యాతో గతిసామ్యలబ్ధవిషయానన్యత్వబోధోజ్జ్వలైః।
నిస్తుల్యాధిక మద్వితీయ మమృతం తం పుండరీకేక్షణం
ప్రారూఢశ్రియ మాశ్రయే వనగిరేః కుంజోదితం సుందరమ్॥[180]

ఈ శ్లోకవము ఉపనిషద్వాఙ్మయ ప్రభావవము వలననే రచింపబడినదని తెలియుచున్నది. శ్లోకారంభమున ప్రయోగింపబడిన 'సత్' 'బ్రహ్మ' 'ఆత్మ' పదములు "సదేవ సౌమ్యేద మగ్ర ఆసీత్."[181] "బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్"[182], ఆత్మా వా ఇద మేక ఏవాగ్ర ఆసీత్"[183] అను వాక్యమునందలి ఆరంభ పదములతో ఈ శ్లోకమారంభించి చివరకు" ఏకో హ వై నారాయణ ఆసీత్, న బ్రహ్మా న ఈశానః"[184] అని సముడుగాని అధికుడు గాని లేని యద్వితీయుడగు నారాయణుని గంభీరముగా వర్ణించిరి.

2. ఏకైకమంగళగుణానుభవాభినంద
మీద్యక్త్రియానిశి చ సుందరదోష్ణి కృష్ణే।

---

178 అ స్త 35
179 క ఉ 3 9
180 సుం స్త 1 6
181 ఛాం ఉ 6 2 1
182 బృ ఉ 1 4 1
183 ఐ ఉ 1 1
184 మ ఉ 1 1

'తే యే శతం త్వి' తి నియంతుమనాః శృతిర్త్వై
నైవైష వాఙ్మనసగోచర ఇత్యుదాహ ॥ [185]

సుందరబాహుస్వామి కళ్యాణగుణములలో ఒక్కొక్క కళ్యాణ గుణానుభవము ఆనందము ఇట్టిది అని కనుగొనుటకు వీలు లేనిదని ఉపనిషత్తులయందలి వాక్యములను స్మరించుచు [186] ''తే యే శతం'' అని ఉపనిషత్పదమును ప్రయోగించి ఆ ఆనందము అవాఙ్మనస గోచరమని పేర్కొనిరి

3. వందేయ సుందరభుజం భుజగేంద్రభోగ-
సక్తం మహావనగిరిప్రణయప్రవీణమ్ ।
యం తం విదు ర్దహర మష్టగుణోపజుష్ట-
మాకాశ మౌపనిషదీషు సరస్వతీషు ॥ [187]

ఈ శ్లోకమునందు ''ఏష ఆత్మా అపహత పాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్య సంకల్పః'' [188] అని ఉపనిషత్తులలో పేర్కొన్న అష్టగుణములగు 1. అపహత పాప్మత్వము 2 విజరత్వము 3. విమృత్యుత 4 విశోకత్వము 5. విజిఘత్సత్వము 6. అపిపాసత్వము 7. సత్యకామత్వము 8. సత్యసంకల్పత్వము లనెడి అష్టగుణములను సుందరబాహు స్వామి యందారోపించి చెప్పిన విధము వీరి ఉపనిషత్పరిజ్ఞానమును ప్రస్ఫుటము చేయుచున్నది.

185 సుం స్త 32

186 స ఏకో మానుషానందః తే యే శతం మానుషానందాః

తేయే శతం ప్రజాపతే రానందాః స ఏకో బ్రహ్మణ ఆనందః
తై ఉ 2 8

187 సుం స్త 20

188 ఛాం ఉ 8 1 5

4. సింహాద్రినాథ! తవ వాఙ్మనసాతివృత్తం
రూపం త్వతీంద్రియ ముదాహ రహస్యవాణీ। [189]

అవాఙ్మనసగోచరుడగు సుందరబాహుస్వామి రూపమును ఉపనిషత్తులు వర్ణించిన విధముగా పేర్కొనుచు. ఇందులకు ప్రమాణముగా ''న చక్షుషా పశ్యతి కశ్చ నైనమ్'' [190] అను శ్రుతి వాక్యమును గైకొనిరని స్పష్టమగుచున్నది.

**4.4.4 వరదరాజస్తవము :-**

1. ''అనన్యాధీనత్వం తవ కిల జగుర్వైదికగిరః'' [191]

అను శ్లోకములో 'అనన్యాధీనత్వం' అను ప్రయోగము ''సర్వస్యవశీ సర్వస్యేశానః సర్వస్యాధిపతిః'' [192] అను శ్రుతి వాక్యజ్ఞానము వలననే యని స్పష్టమగుచున్నది

2. ''భక్తానాం యద్వపుషి దహరం పండితం పుండరీకం'' [193] అను శ్లోకమున 'దహరం' అను పదము ఉపనిషత్తులలోనిదే యని తెలియుచున్నది. ఇందులకు -

''దహ్రం **విపాప్మం** పరవేశ్మభూతం యత్పుండరీకం పురమధ్య సంస్థమ్.
**తత్రాపి** దహ్రం గగనం **విశోకస్తస్మిన్** యదంత స్తదుపాసితవ్యమ్॥'' [194]

అను ఉపనిషద్వాక్యములు ప్రమాణములని స్పష్టమగుచున్నది

3. త్వత్పాదాబ్జే ప్రజాతా సురసరిదభవత్'' [195] అనెడి శ్లోకమున

189 సుం స్త 85
190 క ఉ 69
191 వ స్త 20
192 బృ ఉ 4 4 22
193 వ స్త 59
194 మ నా ఉ 107
195 వ స 62

తత్రైకాఖ్యం ప్రజన్తీ శివయతి తు శివమ్'' అనునది ''య చ్చా చ నిస్సృత సరిత్ప్రవరోదకేన తీర్థేన మూర్ధ్ని విధృతేన శివశ్శివో భూత్''[196] అను ప్రమాణము ననుసరించియే రచింపబడినదని తెలియుచున్నది

**4.4.5 శ్రీస్తవము :-**

''ఐశ్వర్యం మహదేవ వాఽల్ప మధవా దృశ్యేత పుంసాం హి యత్''[197] అను శ్లోకమునందు ''స్వాత్మాన మాత్మేశ్వరః'' అని ప్రయోగించుట ''పతిం విశ్వస్యాత్మేశ్వరమ్'' ''నారాయణ పరంబ్రహ్మ'' మొ॥ శ్రుతి వాక్యమర్మజ్ఞులగుట వలననే అను అంశము స్పష్టము చేయుచున్నది.

ఇటులనే పంచస్తవిలో అనేకానేక సందర్భములలో ఉపనిషత్తులలోని పదములను, వాక్యములను శ్రీకూరేశ మిశ్రులు ప్రయోగించినారు. ఈ సందర్భమున కొన్ని మాత్రమే ఉదాహరణ రూపమున ప్రదర్శింపబడినవి.

* * *

196 శ్రీ భాగ 3 28 22

197 శ్రీ స 6

# 5. పంచమాధ్యాయము

## 5.1 ఉపసంహారము :-

విశిష్టాద్వైతవేదాన్తనేపథ్యమున కూరేశమిశ్రవిరచితమైన పంచస్తవిని అనేక దృక్కోణములనుండి పరిశీలించిన తరువాత శ్రీకూరేశమిశ్రులనుగూర్చియు, పంచస్తవినిగూర్చియు నిగ్గు తేలిన కొన్ని అంశములు ఉపసంహారవ్యాజమున ఇందు పొందుపరచబడుచున్నవి.

**5.1.1.** సంస్కృత స్తోత్రసాహిత్యముయొక్క ఉత్పత్తి వికాసములు, స్తోత్రలక్షణ స్తోత్రశబ్దార్థములు స్తోత్రభేదములు విలక్షణముగా నిరూపించబడినవి.

**5.1.2.** శ్రీవైష్ణవస్తోత్రసాహిత్యోత్పత్తి - వికాసవములు, శ్రీవైష్ణవ సంప్రదాయమున స్తోత్రమునకు గల విశిష్టస్థానము నిరూపింపబడి మిశ్రుల రచనలైన పంచస్తవముల క్రమభేదము స్పష్టముగా ప్రతిపాదింపబడినది

**5.1.3.** పవిత్రతమమగు శ్రీ కూరేశమిశ్రుల జీవితమునందలి ముఖ్య ఘట్టములు పేర్కొనబడి, వారి తదీయారాధన తత్పరత, మహావైరాగ్య సంపత్తి, రామానుజుల అంతరంగశిష్యత్వము చక్కగా ప్రతిపాదింపబడినది

**5.1.4.** తత్త్వజ్ఞులగు శ్రీ కూరేశమిశ్రుల అహంకారరాహిత్యము సోదాహరణముగ నిరూపింపబడినది శ్రీమిశ్రుల ఏకసంధా-గ్రాహిత్వము, శ్రీభాష్యలేఖనము, గురుప్రాణ రక్షణము విస్తరముగ నిరూపింపబడినవి.

**5.1.5.** కూరేశమిశ్రుల జీవితముపైనను, రచనలపైనను శ్రీమద్రామానుజుల ప్రభావము ఎంతవరకు కలదను అంశము, విశిష్టాద్వైత సిద్ధాంతమునందలి సుప్రసిద్ధ తత్త్వములు విస్తరముగా నిరూపింపబడినవి.

**5.1.6.** పంచస్తవిలోని గుణ, వృత్తి, రీతి, శబ్దార్థాలంకారాదులు సోదాహరణముగ ప్రతిపాదింపబడినవి

**5.1.7** విశిష్టాద్వైత సిద్ధాంతమున సుప్రసిద్ధమైన తత్త్వములు పంచస్తవియందు ఎచటనెచట శ్రీ కూరేశమిశ్రులు ప్రతిపాదించిరో సాకల్యముగ నిరూపింపబడినవి.

**5.1.8.** భగవంతుని కళ్యాణగుణములు, ఆయనలోని షాడ్గుణ్య పరిపూర్ణత, శేషశేషి భావము, నిత్యోదిత శాంతోదిత దశలు, నారాయణ శబ్దార్థము, ఉభయవిభూతి నాయకత్వము స్పష్టముగ సోదాహరణముగ ప్రతిపాదింపబడినవి.

**5.1.9.** లక్ష్మీపురుషకార స్వరూపము, ఆచార్యానుగ్రహము చక్కగా పరామర్శింపబడి పంచస్తవిపై ఉపనిషత్తుల ప్రభావమెంత వరకు కలదను అంశము గంభీరముగా నిరూపింపబడినది

* * *

# ఉపయుక్త గ్రంథసూచి

# (BIBLIOGRAPHY)

## 1. మూల గ్రంథములు

## (ORIGINAL WORKS)


**అతిమానుషస్తవము**

అణ్ణంగరాచార్యులు, పి. బి.

చిన్నకంచి, ౧౯౬౬.

**అమరకోశము**

వావిళ్ల రామస్వామి శాస్త్రులు & సన్స్

మదరాసు, ౧౯34

**అహిర్బుధ్న్యసంహితా**

రామానుజాచార్య: . దేవశిఖామణి

అడయార్ , ౧౯౧౬

**ఉపనిషత్సంగ్రహః**

(ప్రథమ- ద్వితీయ భాగములు)

ప్రొ శాస్త్రి, జె. ఎల్.

మోతీలాల్ బనారసీదాస్,

వారాణసి, ౧౯84.

**ఋగ్వేద పంహితా**

సొంతక్కె, ఎన్. ఎస్

పూనా, ౧౯72

**కావ్యాదర్శః**
భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్
పూనా, ౧౯౩౮.

**కావ్యాలంకార సూత్రాణి**
మోతీలాల్ బనారసీదాస్
వారాణసి, ౧౯౮౩.

**కుమార సంభవము**
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్
మద్రాసు. ౧౯౩౬

**కువలయావనందః**
నిర్ణయసాగర్ ప్రెస్
ముంబాయి, ౧౯౪౭

**కూరత్తాళ్వాన వైభవము**
అణ్ణంగరాచార్య, పి బి
కాంచీపురమ్. ౧౯౪౩

**కూరేశవిజయము**
కృష్ణమాచార్య, న.చ.
సత్సంప్రదాయ పరిరక్షణసభ
వరంగల్. ౧౯౯౪.

**కూరేశ విజయః**
శ్రీ గదాధర రామానుజ స్వామి, శ్రీమహన్త
రామానుజమరము. ౧౯౪౭

**గీతాభాష్యమ్**
అణ్ణంగరాచార్య, పి బి
మద్రాస్. ౧౯౩౯.

**చిత్రమీమాంసా**
నిర్ణయసాగర్ ప్రెస్
ముంబాయి. ౧౯౪౧.

**తత్త్వముక్తాకలాపః**
నరసింహాచార్య, ఎస్.
మైసూర్. ౧౯౭౪.

**తాత్పర్యదీపికా**
బృందావన్ ఎడిషన్
బృందావన్. ౧౯౧౦.

**నిరుక్తమ్**
(నిరుక్త వివృత్తి వ్యాఖ్యాసహితము)
మెహర్ చంద్ లక్ష్మణ్ దాస్
న్యూఢిల్లీ. ౧౯౮౨.

**న్యాయసిద్ధాంజనమ్**
రత్నపేటికా వ్యాఖ్యా
గ్రంథ ఎడిషన్
కాంచీపురం. ౧౮౯౦.

**పంచస్తవీ**
(ప్రథమ భాగము)
పళ్లైపూర్ణప్రజ్ఞాచార్య
అంగలకుదురు ౧౯౮౧.

**పంచస్తవీ**
(ద్వితీయ భాగము)
పల్లెపూర్ణ ప్రజ్ఞాచార్య
అంగలకుదురు, ౧౨౭౧.

**పాద్మసంహితా** (చర్యాపాదము)
రామానుజం జ్యోతిషర్
గోమఠం
మైసూరు, ౧887.

**ప్రతాపరుద్రీయమ్**
రాఘవన్. వి.
మదరాసు, ౧౨87

**మత్స్యపురాణమ్**
శ్రీరామ శర్మ
సంస్కృతి సంస్థాన్
బరేలి, ౧౨70.

**మహాభారతమ్**
సుక్తంకర్. వి. ఎస్
భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్.
పూనా, ౧౨33

**యతీంద్రమత దీపికా**
శ్రీనివాస దాస
రామకృష్ణ మఠం
మదరాసు, ౧౨67

**యమకరత్నాకరమ్**
శ్రీవైష్ణవ ముద్రాపక సభై
చెన్నపట్టణం. పరాభవ.

**రఘువంశము**
వేంకటరాయశాస్త్రి, వేదము
మదరాసు. ౧౯౬౫

**రసార్ణవ సుధాకరః**
అడయార్ లైబ్రరీ సీరీస్. vol. ౧౧౦
మదరాసు. ౧౯౭౯

**రామానుజ చంపూ**
మద్రాస్ గవర్నమెంట్ మేన్‌స్క్రిప్ట్ సీరీస్. నెం ౮
మద్రాసు. ౧౯౪౨

**విశిష్టాద్వైతకోశః**
తాతాచార్య. డి టి.
మదరాసు. ౧౯౫౧

**విశిష్టాద్వైతకోశః**
ప్రొ. లక్ష్మీతాతాచార్య. ఎమ్ ఎ
మేల్‌కోట్టె. ౧౯౮౩

**విష్ణుధర్మోత్తర పురాణమ్**
నాగ్ పబ్లిషర్స్
న్యూఢిల్లీ. ౧౯౮౫

**విష్ణుపురాణమ్**
అణ్ణంగరాచార్య, పి బి
కాంచీపురమ్. ౧౯౭౨

**శ్రీ వైకుంఠస్తవము**
అణ్ణంగరాచార్య, పి బి.
కాంచీపురమ్. ౧౯౫౯

**శ్రీభాష్యమ్**
( ప్రథమ భాగః)
ఆనందాప్రెస్ ఎడిషన్
మదరాసు. ౧౯౦౯

**శ్రీభాష్యమ్**
శ్రుతప్రకాశికా సహితమ్
నిర్ణయసాగర్ ప్రెస్.
బొంబే.

**శ్రీభాష్యమ్**
దశవ్యాఖ్యా సమలంకృతమ్
మద్రాసు. ౧౯౪౧

**శ్రీమద్భాగవత మహాపురాణమ్**
గీతాప్రెస్
గోరఖ్ పూర్.

**శ్రీమద్రామాయణము**
( ప్రథమ ద్వితీయ భాగౌ)
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్
చెన్నపురి. ౧౯౧౭

**శ్రీవత్సాంక మహిమాదర్శ:**
నరసింహాచార్య:, ఎన్.సి.వి
తిరుపతి, 1986.

**శ్రీవైష్ణవ స్తోత్రమాల**
గోవిందాచార్య, పరవస్తు
దేవాడ, 1969.

**సకల స్తోత్రజాలమ్**
అణ్ణంగరాచార్య, పి.బి
కాంచీపురమ్, 1971

## తమిళ గ్రంథములు

**అష్టాదశ రహస్యమ్**
సుదర్శనాచార్య, టి.కె.వి.ఎన్
తి.తి.దేవస్థానములు
తిరుపతి, 1954

**తిరువాయ్మొళి**
అణ్ణంగరాచార్య, పి.బి
కాంచీపురమ్, 1966

**శ్రీవరదరాజస్తవమ్**
**(వ్యాఖ్యా సహితము)**
**అణ్ణంగరాచార్య, పి.బి**
**శ్రీవైష్ణవముద్రాసభ, 1922.**

## 2. పరిశీలనలు

(STUDIES)


| | |
|---|---|
| ఆనందమూర్తి, వేటూరి | శ్రీవైష్ణవాంధ్ర వాఙ్మయము<br>హైదరాబాద్, ౧౯౮౬ |
| డా కళావతి, వి | వైష్ణవక్షేత్రమాహాత్మ్యకావ్యములు<br>శ్యామాలా పబ్లిషర్స్<br>తిరుపతి - ౧౯౮౮. |
| గోపాల్‌రెడ్డి, ముదిగంటి<br>సుజాతారెడ్డి, ముదిగంటి | సంస్కృత సాహిత్య చరిత్ర<br>హైదరాబాద్, ౧౯౮౬. |
| తిరువేంగడమ్, కె. | తాళ్ళపాక చిన తిరువేంగళనాథుని పరమయోగి విలాసము - ఒక పరిశీలన.<br>(Ph.D. సిద్ధాంతవ్యాసము) తిరుపతి. ౧౯౯౩. |
| దీనదయాళు, తెన్నేటి | శ్రీవచన భూషణమ్<br>తిరుమల తిరుపతి దేవస్థానములు<br>తిరుపతి, ౧౯౫౧. |
| రఘునాథాచార్య, న చ | తత్త్వోపహారము<br>సత్సంప్రదాయ పరిరక్షణ సభ<br>వరంగల్, ౧౯౮౯ |
| రఘునాథాచార్య, న చ | సత్సంప్రదాయ సుధ<br>సత్సంప్రదాయ పరిరక్షణ సభ<br>వరంగల్, ౧౯౮౭ |
| రామకృష్ణమాచార్యులు, కె వి | కూరేశమిశ్రులు<br>తి తి దేవస్థానములు<br>తిరుపతి ౧౯౮౦ |

రామానుజస్వామి, తి.ప. — శ్రీవైష్ణవ ఆచార నిర్ణయము
వరంగల్, 1974.

వరదాచార్యులు, ధనకుధరం — ఆళ్వారులు - దివ్యప్రబంధములు
శ్రీరామానుజకీర్తికౌముదీ గ్రంథమాల,
గుంటూరు, 1970.

వెంకటాచారియర్, స్వామి — శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంతము
మద్రాసు, 1939

వేంకటాచార్య, శాంతలూరి — సిద్ధాంతత్రయ సంగ్రహము
సత్సంప్రదాయ పరిరక్షణ సభ
వరంగల్, 1988

డా. శేషాచార్యులు, వి. టి. — శ్రీమద్రామానుజ-ఆళ్వారుల
జీవిత చరిత్రలు,
వేటపాలెం, 1974

సచ్చిదానందమూర్తి, కొత్త — విజ్ఞానసర్వస్వము
(దర్శనములు - మతములు)
ఏడవభాగము
హైదరాబాదు, 1962

సచ్చిదానందమూర్తి, కొత్త —
తి తి దేవస్థానములు
తిరుపతి

సుబ్రహ్మణ్యం, జి. వి. — వ్యాస సాహితీ సంహిత
(ఉపన్యాస వ్యాసమంజరి)
యువభారతి
సికిందరాబాద్, 1985

AGGARWAL, H.R. : A Short History of Sanskrit Literature
New Delhi, 1963.

ARAVIND SHARMA : Visistadvaita Vedanta - A Study
B.R.Chawla
Heritage Publishers
New Delhi, 1978.

DAS GUPTA, S.N. : A History of Indian Philosophy
Volume-I
New Delhi.

DE, S.K. : Aspects of Sanskrit Literature
Firma KLM Private Limited
Calcutta, 1976.

JAN GONDA : A History of Indian Literature
otto Harrassowitz . Wiesbden
Volume, - II ; 1977.

KRISHNAMACHARIAR, M. : History of Classical Sanskrit
Literature
New Delhi, 1977.

KRISHNASWAMI IYENGAR, S. Early History of Vaisnavism
in South India
Madras, 1926.

MACDONELL, A. : A History of Sanskrit Literature
Varanasi, 1971.

NARASIMHACHARI, M. : Contribution of Yamuna to Visistadvaita
Madras, 1985.

RAGHAVACHARYULU, T.V. : Critical Study of Vedartha Sangraha
Ramanuja Publications,
Tirupati, 1989.

RAGHAVAN, A.S.R. : Visistadvaita
Tirumala Tirupati Devasthanams
Tirupati, 1985.

RAGHAVAN, V.K.S.N. : History of Visistadvaita Literature
Ajanta publications,
Delhi, 1979

RAGHUNATHACHARYA, S.B. : Studies in Indology
Padmasri Publications,
Tirupati, 1993

RAJAGOPALACHARIAR, T. : Vaisnavite Reformers of India
A.D. Publications
New Delhi, 1982.

RAMANUJAM, B.V. : History of Vaisnavism in South
India Upto Ramanuja
Annamalai University Publications
Annamalai Nagar, 1973.

RANGACHARYULU, M. : The Spirit of Visistadvaita
Sri Bhasyakara Swami Avatara
Mantapa Kainkarya Sabha, 1951.

SATYAMURTHI IYENGAR, S. : Stotraratna of Yamuna, Gwalior, 1981.

SRINIVASACHARI, P.N. The Philisophy of Visistadvaita
Adyar Library Series No.39
Madras, 1946

SRINIVASA RAGHAVAN, A. Visistadvaita
Ramanuja Research Society
Madras, 1974.

SUVIRA JAISWAL The Origin and Development of Vaisnavism
Delhi, 1957.

SWAMI CHINMAYANANDA Talks on Sankara's Vivekachoodamani
Central Chinmaya Mission Trust
Bombay, 1977.

SRINIVASA RAGHAVAN. Visistadvaita (A symposium by 24 Erudite Scholars)
Ramanuja Research Society,
Madras, 1974.

VARADACHARI, K.C. Visistadvaita and its Development
Chakravarti publication
Tirupati, 1969

VARADACHARI, V. : Agamas and South Indian Vaisnavism
Prof.M. Rangacharya Memorial Trust
Madras, 1982

# పరిశోధన పత్రములు
## (RESEARCH PAPERS)

### తెలుగు

జగన్నాథాచార్యులు : శ్రీవైష్ణవమతవైభవము<br>రామానుజకీర్తికౌముదీ<br>ప్రథమభాగము<br>గుంటూరు, ౧౯౯౦

నరసింహాచార్యులు, ఎన్ సి. వి : విశిష్టాద్వైతసారము<br>అన్నవరం వీరవెంకటసత్యనారాయణస్వామి<br>శతజయంతి ప్రత్యేక సంచిక, అన్నవరం.

భాష్యకాచార్యులు, ఎన్. వి ఎన్. : విశిష్టాద్వైతమత వైశిష్ట్యము<br>శ్రీవైష్ణవ పత్రిక, సర్ణోత్సవ సంచిక<br>పెంటపాడు, ౧౯౭౬.

రఘునాథాచార్యులు, ఎన్. సి : విశిష్టాద్వైతదర్శనవైశిష్ట్యము<br>రామానుజ కీర్తికౌముది పదవ భాగము<br>గుంటూరు, ౧౯౯౦.

రంగరామానుజాచార్యులు సముద్రాల : అర్చావతార వైభవము<br>రామానుజకీర్తికౌముది పదమూడవ భాగము<br>గుంటూరు, ౧౯౯౩

రాఘవాచార్యులు, టి. వి. : శ్రీమద్రామానుజులు- వేదార్థసంగ్రహం<br>రామానుజ కీర్తికౌముదీ<br>గుంటూరు, ౧౯౮౮

రాఘవాచార్యులు, టి. వి : శ్రీరామానుజ దర్శనము<br>రామానుజ కీర్తికౌముది<br>ఎనిమిదవ భాగము<br>గుంటూరు ౧౯౮౭

రామకృష్ణమాచార్యులు, కె. వి. : శ్రీవత్సాంకమిశ్రులస్తోత్రవాఙ్మయము
౨౮౪ వ గీతాజ్ఞాన యజ్ఞ సంచిక
చిన్మయామిషన్ తిరుపతి,
౧౯౭౯.

రామకృష్ణమాచార్యులు, ముడుంబై : భక్తిప్రపత్తుల తారతమ్యము
శ్రీవైష్ణవ పత్రిక- స్వర్ణోత్సవ సంచిక.
పెంటపాడు , ౧౯౭౬.

సుదర్శనాచార్య, టి. కె. వి. ఎన్. : విశిష్టాద్వైత దర్శనము
S.V.U.O. జర్నల్, vol.xvi. p.127-139.
తిరుపతి, ౧౯౭౩.


## ENGLISH


NARASIMHACHARI, M. : Definition of the Term Purusakara
The Journal of Oriental Research
Volumes LVI-LXII
Kuppuswami Sastri Research Instituate
Madras, 1992.

SAMPATH KUMAR, S. : Bhagavad Ramanuja and
Visistadvaita Vedanta
Ramanuja Research Society
Madras, 1974.

SRINIVASACHARI, P.N. : Sri Ramanujas Conception of Mukti
Ramanuja Research Society
Madras, 1974.

YAMUNACHARYA, M. : The Significance of Arca
Ramanuja Research Society
Madras, 1974


* *

# సంకేత పదసూచి
## (ABBREVIATIONS)

| | |
|---|---|
| అ.స్త | అతిమానుషస్తవము |
| అ.తా. ఉ. | అద్వయతారకోపనిషత్ |
| అ సం | అహిర్బుధ్న్యసంహితా |
| ఋ.వే | ఋగ్వేదము |
| క. ఉ | కఠోపనిషత్ |
| కా. సూ | కావ్యాలంకార సూత్రాణి |
| కావ్యా | కావ్యాదర్శ: |
| కు ఆ | కువలయానందమ్ |
| కూ వై. | కూరత్తాళ్వాను వైభవము |
| కూ వి | కూరేశవిజయము |
| గీ. భా | గీతాభాష్యమ్ |
| ఛాం ఉ | ఛాందోగ్యోపనిషత్ |
| చి. మీ | చిత్రమీమాంసా |
| త త్ర | తత్త్వత్రయము |
| త ము క అ స | తత్త్వముక్తాకలాప:, అద్రవ్యసర: |
| తా దీ | తాత్పర్యదీపికా |
| తి మొ | తిరువాయ్మొళి |
| తై ఉ | తైత్తిరీయోపనిషత్ |
| న సం | నవవిధసంబంధములు |
| ని వి | నిరుక్త వివృత్తి |
| న్యా సి | న్యాయసిద్ధాంజనమ్ |
| న్యా సి ర పే | న్యాయసిద్ధాంజనమ్, రత్నపేటికా |
| న్యా సు | న్యాయసుదర్శనమ్ |
| పా సం చ | పాద్మసంహితా చర్యాపాదము |
| ప్ర య భూ | ప్రతాపరుద్రయశోభూషణమ్ |
| బ్ర పు | బ్రహ్మాండపురాణమ్ |
| బృ ఉ | బృహదారణ్యకోపనిషత్ |
| భ గీ | భగవద్గీత |
| మ నా ఉ | మహానారాయణోపనిషత్ |
| మ. భా | మహాభారతమ్ |

| | |
|---|---|
| మ. ఉ. | మహోపనిషత్ |
| ముం. ఉ. | ముండకోపనిషత్ |
| మై ఉ. | మైత్రాయణ్యుపనిషత్ |
| య.ర | యమకరత్నాకరము |
| ర.ఘు. | రఘువంశమ్ |
| ర.సు. | రసార్ణవ సుధాకర: |
| రా.కౌ | రామానుజకీర్తికౌముది |
| రా చం | రామానుజ చంపూ |
| వ.స్త. | వరదరాజస్తవము |
| వా.రా. | వాల్మీకి రామాయణమ్ |
| వి.చూ. | వివేక చూడామణి |
| వి.కో | విశిష్టాద్వైత కోశ: |
| వి ధ.పు. | విష్ణుధర్మోత్తర పురాణమ్ |
| వి.పు. | విష్ణుపురాణమ్ |
| వి.సూ | విష్ణుసూక్తమ్ |
| వై.స్త | వైకుంఠస్తవము |
| శ గ | శరణాగతిగద్యము |
| శ్రీ గు.ర కో | శ్రీగుణరత్న కోశము |
| శ్రీ.గు.సు సా ల స్తో | శ్రీగుణసుధాసారలహరీ స్తోత్రమ్ |
| శ్రీ భా | శ్రీభాష్యము |
| శ్రీ.భాగ | శ్రీమద్భాగవతము |
| శ్రీ.రం స్త | శ్రీరంగరాజస్తవము |
| శ్రీ.మ | శ్రీవత్సాంకమహిమాదర్శము |
| శ్రీ ఆ.ని | శ్రీవైష్ణవఆచారనిర్ణయము |
| శ్రీ.స్త | శ్రీస్తవము |
| శ్రు ప్ర | శ్రుతప్రకాశికా |
| శ్రు ప్రదీ | శ్రుతప్రదీపికా |
| శ్వే ఉ. | శ్వేతాశ్వతరోపనిషత్ |
| సు. ఉ | సుబాలోపనిషత్ |
| సుం స్త | సుందరబాహుస్తవము |
| స్తో ర | స్తోత్రరత్నము |

* * *

అర్వాంచో యత్పదసరసిజద్వంద్వమాశ్రిత్య పూర్వే
మూర్ధ్నా యస్యాన్వయముపగతా దేశికాముక్తిమాపుః ।
సోఽయం రామానుజమునిరపి స్వీయముక్తిం కరస్థాం
యత్సంబంధాదమనుత కథం వర్ణ్యతే కూరనాథః ॥